Dwaraka

సత్యమేవ జయతే

సాక్షి


సోమవారం 15-1-2018

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10

సంచిక: 295



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

Dwaraka



SAMSUNG Rs. 0/- Down Payment Mobile EMI 1,166/-
vivo Rs. 0/- Down Payment Mobile EMI 1,249/-
oppo Mobile EMI 1,000/-
LG Life's Good Rs. 0/- Down Payment Mobile EMI 2,215/-
MOTOROLA Mobile EMI 875/-
iPhone I Phone Mobile EMI : 1,983/-
75" 4K Smart Rs : 4,87,000/-
65" 4K OLED Smart EMI : 26,333/-
65" 4K Smart EMI : 11,616/-
Side By Side Instaview Door in Door Refrigerator 668 Ltrs Mini Fridg Free EMI : 10,700/-
Front Load Twing Washing Machine 21.5 kg, 3.5 kg EMI : 13,834/-
55" 4K Smart OLED EMI : 15,916/-
55" 4K LED Smart EMI : 6,730/-
55" 4K LED Smart EMI : 4,042/-
55" LED TV Full HD EMI : 3,750/-
49" LED Smart EMI : 3,667/-
50" LED TV EMI : 3,000/-
43" 4K Smart EMI : 3,084/-
43" Smart LED TV EMI : 2,792/-
40" LED TV Full HD EMI : 2,042/-
40" LED EMI : 1,875/-
32" LED Smart EMI : 1,917/-
32" LED TV EMI : 1,167/-
24" LED EMI : 900/-
Side by Side Refrigerator 675 Ltrs Mini Fridge Free EMI : 5,466/-
Side by Side Refrigerator 600 Ltrs Mobile Free EMI : 6,583/-
Frost Free Refrigerator CBU - 393 Ltrs EMI : 3,700/-
Frost Free Refrigerator 360 Ltrs EMI : 3,200/-
Frost Free Refrigerator 321 Ltrs EMI : 2,700/-
Frost Free Refrigerator 308 Ltrs EMI : 2,600/-
Frost Free Refrigerator 290 Ltrs EMI : 2,100/-
Frost Free Refrigerator 260 Ltrs EMI : 1,900/-
Direct Cool Refrigerator 270 Ltrs EMI : 1,750/-
Direct Cool Refrigerator 250 Ltrs EMI : 1,475/-
Direct Cool Refrigerator 220 Ltrs EMI : 1,291/-
Direct Cool Refrigerator 200 Ltrs EMI : 1,275/-
Direct Cool Refrigerator 190 Ltrs EMI : 958/-
Deep Freezer 210 Ltrs EMI 1,483/-
Dish Washer EMI : 2,792/-
Front Load Washing Machine 8 kg EMI : 2,560/-
Front Load Washing Machine 6.5 kg EMI : 2,608/-
Top Load Washing Machine 9 kg EMI : 2,250/-
Top Load Washing Machine 6.0 kg EMI : 1,192/-
Semi Automatic Washing Machine 8.5 kg EMI : 1,217/-
Semi Automatic Washing Machine 6 kg Rs : 7,500/-
Air Conditioner 1.5 Ton 3 Star Invertor EMI : 2,708/-
Air Conditioner 1.5 Ton 5 Star Invertor EMI : 3,916/-
Air Conditioner 1.5 Ton 5 star 100% Copper Condenser EMI : 2,333/-
Air Conditioner 1.5 Ton 3star 100% Copper Condenser EMI : 2,166/-
Air Conditioner 2.0 Ton 3 Star 100% Copper Condenser EMI : 3,250/-
Air Conditioner 1 Ton 3 Star 100% Copper Condenser EMI : 1,834/-
Microwave Oven Gril & Conversion 32 Ltrs Starter Kit Set Free EMI : 1,700/-
Microwave Oven Gril Rs : 6,600/-
X-Boom EMI : 875/-
Home Theatre Speakers Rs : 3,900/-
Air Purifier Rs. 8,600/-
Water Dispenser Rs. 7,500/-
Water Purifier EMI : 1,732/-
Water Cooler EMI : 1,291/-
Water Greaser Rs : 3,000/-
Wet Grinder Rs : 3,000/-
Rice Cooker Rs : 1,700/-
Mixer Rs : 1,900/-
1969 నుండీ క్వాలిటీ ప్రొడక్ట్స్, అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో మీ అభిమానం పొందిన - సోనోవిజన్
సోనోవిజన్ సంక్రాంతి డిస్కౌంట్ సేల్
LG Life's Good SONY Panasonic Whirlpool Godrej VIDEOCON Carrier DAIKIN HITACHI VOLTAS IFB BOSCH Haier vivo oppo
SANSUI PHILIPS Symphony V-GUARD Preethi KENT EUREKA FORBES ULTRA Butterfly USHA KEELINE AO Smith Micromax iPhone MOTOROLA


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 295

సోమవారం 15-1-2018

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి

1969 నుండీ క్వాలిటీ ప్రొడక్ట్స్, అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో
మీ అభిమానం పొందిన - సోనోవిజన్

అతి తక్కువ ధరలు Lowest Prices GUARANTEED Best Service నమ్మకమైన సర్వీస్

సోనోవిజన్
సంక్రాంతి డిస్కౌంట్ సేల్

రూ. 1/- చెల్లించి LED, రిఫ్రిజిరేటర్, A.C, వాషింగ్ మెషిన్ మరియు మొబైల్స్ తీసుకెళ్ళండి (సెలెక్టెడ్ మోడల్స్ పై)

DBD మరియు వడ్డీ లేకుండా చెల్లించండి,
అన్ని మోడల్స్ పై వడ్డీలేని వాయిదాల సౌకర్యం (12/4 స్కీమ్)

MOBILES పై స్పెషల్ ఆఫర్స్

ఆధార్ కార్డు, చెక్కు తీసుకువచ్చి తక్షణ రుణ సదుపాయం పొందే అవకాశం
BAJAJ FINSERV | CAPITAL FIRST | HDB FINANCIAL SERVICES | HDFC BANK
నిబంధనలను అనుసరించి

బ్యాంక్ కార్డ్స్ పై చెల్లించే సదుపాయం
(అదనపు చార్జీలు లేకుండ)

Paytm mall
కొనుగోలుదారులకు 8% వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్





26 ఖరీదైన కార్లు బహుమతులు
36 షోరూంలలో



Visit Our Stores

వెబ్ సైట్ : https//www.sonovision.co

Vijayawada, Eluru Road. Ph : 9440804182	Priyadarshini Building, Vijayawada. Ph : 9100991701	Patamata, Vijayawada. Ph : 9246661616	Enikepadu, Tankasala Kalyana Mandapam Building, Ph : 9100991703	Digitalvision, M.G. Road, Ph : 9246666203	Panavision, M.G. Road, Ph : 9440804183	Vizag, Dimond Park. Ph : 9246667474	Hyderabad, Malakpet, Ph : 8333924932, 933	Hyderabad, Somajiguda, Ph : 9440804181.
Guntur, Jinnatower Centre, Ph : 9246667373	Guntur, Brodipet, Ph : 9100991706	Guntur, Lakshmipuram, Ph : 9246666204	Gollapudi, Vijayawada. Ph : 8333924930	Gudivada, Eluru Road, Ph : 9100991708	J.P. Road, Bhimavaram Ph : 8333924936.	New Gajuwaka Junction. Ph : 9440804187.	Gajuwaka, Opp. Srikanya Theatre, Ph : 9246667575	Gopalapatnam, Near Sukanya Theatre, Ph : 9100991704
Tenali, Opp. Town Church, Ph : 9246666211	Tenali, Near Ratnatalkies, Ph : 8333924937.	Eluru, Opp. Badeti Park. Ph : 9246666205.	Eluru, Ashoke Nagar. Ph : 9390006620	Pydiparru Junction, Tanuku. Ph : 8333924938.	Vijayanagaram, 3 Lantharla Centre, Ph : 9246666208	Ongole, Bapuji Market, Ph : 9246666329	Nellore, Trunk Road, Ph : 9246666206	Madhurawada, Ph : 9246666214
Tirupathi, Netaji Road, Ph : 9440804186	Tirupathi, Alipiri Road, Ph : 9100991707	Rajuhmundry, Kotipally Busstand, Ph : 9246662288	Rajuhmundry, J.N. Road. Ph : 9100991700	Kakinada, Ramaiah Steet, Ph : 9246665511	Khammam, Kaspa Bazar, Ph : 9246666319	Khammam, Vyra Road, Ph : 9100991709	Khammam, Opp. Parnasala, Vyra Road, Ph : 8333924931	Opp Municipal Office, Repalle, Ph : 9390006609



ఆఫర్‌లోయ్ సంబరాలోయ్
— సంగీత —
ప్రైస్ ఛాలెంజ్
ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్
సంగీతకు సాటి లేదు
iPhone X
₹89,000
₹72,990*
Redmi 4
4GB RAM + 64GB STORAGE
₹11,299
₹10,299
Redmi note 4
4GB RAM + 64GB STORAGE
₹11,999
₹10,999
Redmi 5A
NOW AVAILABLE
Mi A1
₹1,300pm
SAMSUNG GALAXY NOTE 8
₹8,000 CASHBACK
Google Pixel
₹21,000 CASHBACK
Vivo V7
₹1,911pm
Panasonic P91
₹5,690
₹4,999*
4G VoLTE SMARTPHONE
ONLY AT ₹2,499*
WIN PRIZES
Motorcycles
LED TVs
Refrigerators
Washing Machines
Mobile Phones
Bluetooth
AND MANY MORE
*Conditions apply
BAJAJ FINSERV
CAPITAL FIRST
HDB FINANCIAL SERVICES
HDFC BANK
You can also shop at www.sangeethamobiles.com
Sangeetha®
PIONEER THEN, LEADER NOW.
సంగీత
43 YEARS | 8 STATES | 425 STORES | 20 MILLION HAPPY CUSTOMERS
For feedback/suggestions, write to us at support@sangeethamobiles.com or call us at 080 4939 7000 | Connect with us SangeethaMobilesIndia | For terms and conditions, visit www.sangeethamobiles.com/sangeetha-advantage/price-challenge
*Prices offered are applicable only on exchange.
ఇప్పుడు హిందూపురంలో అనంతపురం, ధర్మవరం, గుంతకల్, కదిరి, కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, కర్నూలు, ఆదోని, నంద్యాల, మదనపల్లి, తిరుపతి, నెల్లూరు, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, తడ, వెంకటగిరి, శ్రీ కాళహస్తి, ఒంగోలు, చిలకలూరిపేట, గుంటూరు, మచిలీపట్టణం, నూజివీడు, తెనాలి, విజయవాడ, గన్నవరం, అమలాపురం, భీమవరం, కాకినాడ, మండపేట, పాలకొల్లు, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, తణుకు, అనకాపల్లి, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం
హైదరాబాద్ & తెలంగాణ లో 72 స్టోర్లు
ఆంధ్రప్రదేశ్ లో 55 స్టోర్లు
SAMSUNG
LG
NOKIA
Panasonic
Lenovo
mi
oppo
vivo
GIONEE
HUAWEI
LAVA
micromax
INTEX



‘పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 295

సోమవారం 15-1-2018



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి సంక్రాంతి శుభాకాంక్షలు

వై.ఎస్. భారతి చైర్‌పర్సన్

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కత్తులు దూసిన పందెం కోళ్లు

పలు జిల్లాల్లో జోరుగా కోడిపందేలు.. దగ్గరుండి మరీ నిర్వహించిన టీడీపీ నేతలు

- నర్సీపట్నంలో మంత్రి అయ్యన్న, విజయవాడలో ఎమ్మెల్సీ బుద్దా
- పలు చోట్ల బరిలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు
- ఫొటోలు, వీడియోలు తీయకుండా కార్యకర్తల పహారా..
- పశ్చిమలో కాసేపు అడ్డుకున్న పోలీసులు
- మామూలుగా మొదలుపెట్టి కత్తులు కట్టిన పందెంరాయుళ్లు
- భోగి రోజే రూ. 200 కోట్ల మేర పందేలు

సాక్షి, అమరావతి

కోర్టు ఓడిపోయింది. కోడే గెలిచింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ పలుచోట్ల కోళ్లకు కత్తులు కట్టి మరీ భారీగా పందేలు నిర్వహిస్తున్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, విశాఖ, విజయనగరం జిల్లాల్లో బరులు ఏర్పాటు చేశారు. టీడీపీ

మిగతా 2వ పేజీలో ▶



విజయవాడ సమీపంలోని పెదపులిపాక వద్ద ఏర్పాటు చేసిన బరిలో తలపడుతున్న పందెంకోళ్లు (ఇన్‌సెట్‌లో) కోడి కాళ్లకు కత్తి కడుతున్న దృశ్యం

అడ్డంగా దోచేసిన ఆర్టీసీ

- ఫ్లెక్సీ ఫేర్ విధానంతో ఇష్టారాజ్యంగా టిక్కెట్ల చార్జీల పెంపు
- ప్రత్యేక బస్సుల పేరిట 50 శాతం అదనపు రుసుముల వాత
- రద్దీని ఆసరాగా చేసుకొని మరింత ఎక్కువ వసూలు
- ప్రైవేట్‌లో అయితే చెప్పనవసరమే లేదు

5 లో

ఆర్టీసీ చార్జీలు (రూ.లలో)

ఎక్కడి నుంచి ఎక్కడికి	సర్వీసు	సాధారణ రోజుల్లో	సంక్రాంతి సీజన్‌లో
విజయవాడ-విశాఖ	నాన్ ఏసీ	430	645
	ఏసీ	808	1,200
హైదరాబాద్-విజయవాడ	నాన్ ఏసీ	317	476
	ఏసీ	544	816
హైదరాబాద్- తిరుపతి	నాన్ ఏసీ	652	978
	ఏసీ	1,023	1,534
హైదరాబాద్-విశాఖ	నాన్ ఏసీ	746	1,119
	ఏసీ	1,236	1,999
విజయవాడ-తిరుపతి	నాన్ ఏసీ	474	761
	ఏసీ	698	1,097
విజయవాడ-కర్నూలు	నాన్ ఏసీ	397	610
	ఏసీ	500	750
విజయవాడ-కడప	నాన్ ఏసీ	466	699
	ఏసీ	798	1,097

ఈ పట్టికలో రేట్లు ఆర్టీసీ అధికారికంగా వసూలు చేస్తున్నది మాత్రమే. అనధికారికంగా ఇంతకంటే భారీగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.



టర్కీలోని ట్రాబ్‌జోన్ విమానాశ్రయంలో రన్‌వే నుంచి జారి సముద్రం అంచు వరకు వెళ్లిన విమానం

- వివరాలు 2లో

32 బంతుల్లో 100



టి20లో రిషభ్ పంత్ అద్భుత సెంచరీ

ఢిల్లీ యువ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ముస్తాక్ అలీ టి20 టోర్నీలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 32 బంతుల్లోనే అతను సెంచరీ సాధించాడు. టి20 క్రికెట్‌లో భారత్ తరఫున ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ కావడం విశేషం. ఓవరాల్ జాబితాలో పంత్ శతకం రెండో స్థానంలో నిలిచింది. గతంలో క్రిస్ గేల్ ఐపీఎల్‌లో 30 బంతుల్లోనే సెంచరీ చేశాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ (35 బంతుల్లో) చేసిన శతకాన్ని మూడు బంతుల తేడాతో రిషభ్ సవరించాడు. - స్పోర్ట్స్‌లో

గ్రాట్యుటీ పన్ను మినహాయింపు

రూ.20 లక్షలు

- వివరాలు 7లో

సెలవు

సంక్రాంతి సందర్భంగా నేడు (సోమవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం (16-01-2018) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

‘బెల్టు’ జోలికి

వెళ్లొద్దు

- ఎక్సైజ్ అధికారులకు అధికార పార్టీ నేతల బెదిరింపులు
- బెల్టు షాపులు నిర్వహిస్తున్న మద్యం సిండికేట్లకు మంత్రుల అండ
- కేసులు నమోదు చేయొద్దని ఆదేశాలు

5 లో

నెతన్యాహుకు ఆత్మీయ స్వాగతం

ప్రొటోకాల్ పక్కనపెట్టి ఇజ్రాయెల్ ప్రధానికి మోదీ స్వాగతం

- ఆరు రోజుల పర్యటనకు భారత్‌కు వచ్చిన నెతన్యాహు
- మోదీ, నెతన్యాహు సమక్షంలో తీన్ మూర్తి చౌక్ పేరు మార్పు
- ఆగ్రా, ముంబై, గుజరాత్‌లో పర్యటించనున్న నెతన్యాహు
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో పర్యటిస్తున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి

- వివరాలు 7లో



ఢిల్లీ విమానాశ్రయంలో నెతన్యాహుకు స్వాగతం పలికిన అనంతరం మోదీ ఆత్మీయ ఆలింగనం

త్వరలోనే సర్దుకుంటుంది!

బార్ కౌన్సిల్ కమిటీతో సీజేఐ దీపక్ మిశ్రా

- ఆ నలుగురు జడ్జీలతోనూ బీసీఐ కమిటీ భేటీ
- 2–3 రోజుల్లో సాధారణ స్థితి నెలకొంటుందని ఆశాభావం
- ఇరువర్గాలతో చర్చలు జరిపిన జస్టిస్ నాగేశ్వరరావు, జస్టిస్ బోబ్డే
- తిరుగుబాటు జడ్జీలు కరెక్టే: సీజేఐకి నలుగురు రిటైర్డ్ జడ్జీల లేఖ

7 లో



ఇదండీ జగత్



గొబ్బెమ్మలకు పేడెక్కడా దొరకలేదొదినా...



చిత్తూరు జిల్లా సొరకాయలపాలెం క్రాస్ వద్ద ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు మేక పిల్లను అందించిన అభిమానులు. చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి తదితరులు

దారులన్నీ కిటకిట.. జగన్‌కు బాసట

ఊరూరా స్వాగతాలు, హారతులు

పెద్ద కొడుకు ఇంటికొచ్చినట్టుంది

ఆయా గ్రామస్తుల సంతోషం

- చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర
- సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజా సంకల్ప యాత్రకు నేడు విరామం
- ప్రతిపక్ష నేతను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలు

6 లో

గ్రూప్–1లో 70% పైగా సివిల్స్ సిలబస్

- నెలాఖరుకు గ్రూప్–2 ఎంపికలు పూర్తి
- ప్రభుత్వ అనుమతి రాగానే కొత్త నోటిఫికేషన్లు
- ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్



సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ఇక నుంచి గ్రూప్-1 పోస్టులకు నిర్వహించే పరీక్షలలో సివిల్ సర్వీసు సమానంగా సిలబస్‌ను పెట్టనున్నామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్ పేర్కొన్నారు. గోవాలో శుక్ర, శనివారాల్లో జరిగిన అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సదస్సు నుంచి తిరిగివచ్చిన ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడారు. ఇకపై

మిగతా 2వ పేజీలో ▶

@ysjagan

జగన్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఉదయం 'ట్విట్టర్'లో తెలుగు ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. 'మీకు భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నాను. అందరి ఇంట ఆయురారోగ్యాలు, సంతోషం, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నాను' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.




తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ స్పెషల్ బస్సులు

ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య

సాక్షి, అమరావతి: సంక్రాంతి పండుగకు సొంతూళ్లు వెళ్లి తిరుగు ప్రయాణం చేసే వారి కోసం ఏపీఎస్‌ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు తిప్పుతున్నట్లు రాష్ట్ర డీజీపీ, ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరు, తిరుపతి, చెన్నై, విశాఖపట్టణం, విజయవాడలకు రెగ్యులర్ సర్వీసులతో పాటు ప్రత్యేక సర్వీసులు తిరుగుతాయన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ యాప్ ద్వారా ముందస్తు ప్రయాణ టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని ఎండీ మాలకొండయ్య సూచించారు.

జయేంద్ర సరస్వతికి అస్వస్థత



సాక్షి ప్రతినిధి, చెన్నై: కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 11.15 గంటల సమయంలో శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఆయన్ని చెన్నై పోరూరులోని రామచంద్ర ఆస్పత్రికి తరలించారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాకినాడ టౌన్–సికింద్రాబాద్, నర్సాపూర్–హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జేవీఆర్కే రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ టౌన్– సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (నంబర్ 82707) ఈ నెల 17న రాత్రి 10.30 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. నర్సాపూర్–హైదరాబాద్ ప్రత్యేక రైలు (నంబర్ 07049) ఈ నెల 16న రాత్రి 7.30 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పీఆర్వో తెలిపారు.

14 మండలాల్లో ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలు

సాక్షి, అమరావతి: మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఖాళీగా ఉన్న 14 మండలాల్లో ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. 9 చోట్ల ఎంపీపీ, 6 చోట్ల ఉపాధ్యక్ష పదవులకు 18న ఉదయం 11 గంటలకు ఎన్నికలు జరగనున్నాయి. రామగిరి, అమరాపురం (అనంతపురం), వినుకొండ (గుంటూరు), ఇబ్రహీంపట్నం (కృష్ణా), కోడుమూరు (కర్నూలు), కొవ్వూరు (నెల్లూరు), బొబ్బిలి, సీతానగరం (విజయనగరం), మునగపాక (విశాఖపట్నం) మండలాల్లో ఎంపీపీ పదవికి.. రాంబిల్లి, మునగపాక (విశాఖపట్నం), మందస (శ్రీకాకుళం), కలిగిరి (నెల్లూరు), అమరావతి, దుర్గి (గుంటూరు) మండలాల్లో ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. ఆయా మండలాల్లో పరోక్ష పద్ధతిన ఎన్నిక నిర్వహణకు వీలుగా ప్రత్యేకంగా మండల సమావేశాలను ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా అధికారులను ఆదేశించింది.

విశాఖలో ఘనంగా సీ కేడెట్ కోర్ వార్షికోత్సవం

విశాఖ సిటీ: విశాఖపట్నంలోని తూర్పు నావికా దళంలో సీ కేడెట్ కోర్ 48వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నావెల్ బేస్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ దీపక్ కపూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరేడ్‌లో ఎస్‌సీసీకి చెందిన మూడు బాలికా కేడెట్ ప్లటూన్లు సహా 12 ప్లటూన్‌లు విన్యాసాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా రియర్ అడ్మిరల్ దీపక్ కపూర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకునేందుకు సీ కేడెట్ కోర్ శిక్షణ ఉపయుక్తమవుతుందని తెలిపారు.

రన్ వే నుంచి సముద్రం అంచుకు..

అంకారా: 162 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం.. రన్ వేపై సురక్షితంగానే ల్యాండ్ అయింది.. అయితే ఉన్నట్టుండి పక్కకు జరిగిపోయింది.. అలా అలా సముద్రం అంచు వరకు వెళ్లిపోయింది. చక్రాలు బురదలో కూరుకుపోవడంతో సముద్రానికి కొద్ది మీటర్ల దూరంలో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. టర్కీలోని ట్రాబ్‌జోన్ విమానాశ్రయంలో చోటు చేసుకుందీ ఘటన. టర్కీ రాజధాని అంకారా నుంచి బయలు దేరిన పెగాసుస్ ఎయిర్‌లైన్స్ విమానం.. ట్రాబ్‌జోన్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ అయినా రన్ వే నుంచి పట్టుతప్పి సముద్రం వైపు దూసుకెళ్లింది. ఇందుకు సంబంధించిన చిత్రాలను సీఎన్ఎన్ వార్తా సంస్థ విడుదల చేసింది. నల్ల సముద్రానికి కొద్ది మీటర్ల దూరంలో ఏటవాలుగా విమానం వేలాడుతూ ఉండటం ఆ చిత్రాల్లో కనిపించింది. విమానం చక్రాలు బురదల్లో ఇరుక్కుపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. లేదంటే సముద్రంలోకి పడిపోయి భారీ ప్రమాదం సంభవించేది. డోగన్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన చిత్రాల్లో విమానం నుంచి పొగలు రావడం కనిపించింది. మరోవైపు విమానం పట్టుతప్పి సముద్రం వైపుగా దూసుకెళ్లిన విషయాన్ని పెగాసుస్ ఎయిర్‌లైన్స్ సంస్థ కూడా ధ్రువీకరించింది. 162 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలెట్లు, నలుగురు సిబ్బందిని విమానం నుంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఈ ఘటనకు గల కారణాలు తెలియరాలేదని, విచారణ జరుగుతోందని ట్రాబ్‌జోన్ గవర్నర్ కార్యాలయం తెలిపింది.

డ్రాగన్ విభాగంలో తలపడుతున్న పడవలు



హోరాహోరీగా పడవల పోటీలు

అవనిగడ్డ /నాగాయలంక: కృష్ణా జిల్లా నాగాయలంకలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సంప్రదాయ పడవల పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్థానిక పడవల రేవులో ఆదివారం ఉత్సాహంగా పోటీలు సాగాయి. మెడ్డుడు, డ్రాగన్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి 87 జట్లు పోటీపడ్డాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన రెండు రోజుల సంప్రదాయ పడవల పోటీలను తిలకించేందుకు కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు ఈ పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల నిర్వహణ వల్ల సంప్రదాయాలు పెంపొందుతాయని చెప్పారు. అనంతరం పడవల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేసీ పి.బాబూరావునాయుడు పాల్గొన్నారు.

ఊరూరా భోగి సంబరం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. భోగి పండుగ సందర్భంగా ఆదివారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ సందడి వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే భోగిమంటలతో కొత్తదనాన్ని సింగారించుకున్నాయి. నగరాలు, పట్టణాల్లోనూ భోగి సందడి కనిపించింది. సొంత గ్రామాలకు దూరంగా నగరాల్లో ఉంటున్న వారంతా పండుగకు స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లె సీమల్లో నెలకొన్న సందడి అంతాఇంతా కాదు. నగరాల నుంచి వచ్చిన బంధువులు, మిత్రులతో పల్లెలన్నీకళకళలాడుతున్నాయి. కొత్తకొత్త రంగవల్లులతో మహిళలు తమ ఇళ్ల ముంగిళ్లను అందంగా అలంకరించుకున్నారు. మరోవైపు.. సంక్రాంతిని పురస్కరించుకుని చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారా వారిపల్లెకు నారా, నందమూరి కుటుంబ సభ్యులు వచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు వియ్యంకుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ భోగిమంటలు వేశారు. ఎడ్లబండిపై సందడి చేశారు.



విజయనగరం జిల్లా పూసపాటిరేగలో భోగి మంటలు

ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నగరం (రేపల్లె): భోగి పండగను పురస్కరించుకుని ఆదివారం ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీ మోహన్ మాట్లాడుతూ, సీపీఎస్ విధానంలో లోపాలను ఎత్తిచూపే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సీపీఎస్ అంతం–ఉద్యోగుల పంతం, పెన్షన్ భిక్ష కాదు–ఉద్యోగుల హక్కు.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి.. అనే నినాదాలను ముగ్గుల వద్ద వేశారు. పోటీల్లో మొదటి 3 స్థానాలలో నిలిచిన రమాదేవి, దుర్గాదేవి, జయలక్ష్మిలకు బహుమతులు అందజేశారు.



విజయవాడ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగిమంటలు వేస్తున్న వాకర్స్ సభ్యులు



నేడే చూడండి..

సంక్రాంతి వేళ విజయవాడలో కొన్నేళ్ల క్రితం నుంచి మరుగునపడ్డ 'సినిమా రికార్డింగ్స్' సందడి చేశాయి. నేడే చూడండి బాబూ మీ అభిమాన థియేటర్‌లో 'బంగారు బుల్లోడు' అంటూ చిన్నారులు సందడి చేసిన సరదా సన్నివేశం చోటుచేసుకుంది.



విజయవాడలో భోగి మంటల వద్ద మహిళలు



విజయవాడలోని విశాలాంధ్ర రోడ్డు సమీపంలో భోగి మంటల వద్ద నృత్యాలు చేస్తున్న యువతీ యువకులు



విజయవాడ కృష్ణలంకలో పిడకలతో భోగి మంటలు వేస్తున్న దృశ్యం

గ్రూప్-1లో 70% పైగా సివిల్స్ సిలబస్

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే పోస్టుల భర్తీకి 70 శాతం సిలబస్ సివిల్ సర్వీస్ సిలబస్‌తో సమానంగా ఉంటుందన్నారు. 30 శాతం వరకు రాష్ట్ర అంశాలు ఉంటాయన్నారు. గోవా సదస్సులో ఈ మేరకు అన్ని పబ్లిక్ సర్వీస్ సర్వీస్ కమిషన్లు ఒక అభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లోనూ గ్రూప్–1 సర్వీసు పోస్టులకు నిర్వహించే పరీక్షల్లో సమానంగా కామన్ సిలబస్ ఉండేలా నిర్ణయం తీసుకున్నారన్నారు.

వినూత్న పద్ధతులపై చర్చ

గోవా సమావేశంలో ఆయా రాష్ట్రాల్లో సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల్లో ప్రవేశపెట్టిన వివిధ వినూత్న పద్ధతుల గురించి ఆయా కమిషన్ చైర్మన్లు వివరించారన్నారు. గ్రూప్–1తో సహా కొన్ని ముఖ్యమైన పరీక్షలకు మన రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానాలను తాను వివరించినట్లు చెప్పారు. గ్రూప్స్ పరీక్షల్లో అభ్యర్థుల సమాధాన పత్రాలను గతంలో మూల్యాంకనం చేసేటప్పుడు ఆయా పేపర్లను పలువురు నిపుణులతో మూల్యాంకనం చేయించేవారమని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా గ్రూప్–1 పరీక్షల సంబంధించి ఇచ్చే ప్రశ్నలు అభ్యర్థులందరూ రాసిన ప్రశ్న పత్రాల్లోని ఒక్కో ప్రశ్న సమాధానాన్ని ఒక్కొక్కరితోనే మూల్యాంకనం చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల ప్రశ్నల మూల్యాంకనంలో ఎటువంటి సమస్య రాక పోవడంతో పాటు అభ్యర్థులకు సరైన న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇది మంచి ఫలితాలను ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి రాగానే కొత్త నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వివచించారు.

టెక్నాలజీతో కాపీయింగ్‌కు చెక్

ఆధునిక టెక్నాలజీ ద్వారా పరీక్షల్లో కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు కొన్ని రాష్ట్రాల్లో గ్రూప్–1 పరీక్షలకు జామర్ల ఏర్పాటు వంటి జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారని అయితే ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఇబ్బందికరమేనని, పైగా దీనికి సంబంధించిన అనుమతులు కూడా తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. మన రాష్ట్రంలో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్–1 గ్రూప్–2 పరీక్షలకు ఆన్‌లైన్ విధానంతోపాటు సీసీ కెమెరాలు బయోమెట్రిక్ విధానాన్ని అనుసరిస్తున్న విధానాన్ని వివరించినట్లు తెలిపారు. 2011 గ్రూప్–1 పరీక్షల ఇంటర్వ్యూలను ఈనెల 22 నుంచి ప్రారంభించనున్నామని, పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించనున్నామని చెప్పారు. 2016 గ్రూప్–1 పరీక్షల మూల్యాంకనం ప్రస్తుతం కొనసాగుతోందని అది నెలాఖరు పూర్తయిన వెంటనే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. 2016 గ్రూప్–2 పరీక్షలకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయించి మెరిట్ జాబితాను నెలాఖరుకల్లా ప్రకటిస్తామని వివరించారు.

పాతబస్తీలో రూ.15 కోట్ల వ్యాపారం

సాక్షి, హైదరాబాద్: ఏపీలో జరిగే కోళ్ల పందేల కోసం నగరంలో దాదాపు రూ.15 కోట్లకుపైగా కోళ్ల అమ్మకాలు జరిగాయని తెలుస్తోంది. పాతబస్తీలోని బార్కస్, ఎర్రకుంట, షాహీన్ నగర్‌లో 50 మంది పందెం కోళ్ల పెంపకందారులు ఉన్నారు. ఒక్కొక్కరు కనీసం 50 నుంచి 60 కోళ్లను పెంచి, విక్రయించినట్లు తెలిసింది. ఒక్కో కోడి ధర రూ.30 వేల నుంచి రూ.50 వేల దాకా పలికినట్టు సమాచారం. వీటిని కొనుగోలు చేసేందుకు ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొద్దినెలల కిందటే పందెం రాయుళ్లు వచ్చారు. వీరు దాదాపు 2 వేల నుంచి 3 వేల కోళ్ల దాకా కొనుగోలు చేసినట్టు పాతబస్తీలోని వ్యాపారులు చెబుతున్నారు. ఇలా కొనుక్కు వెళ్లిన వాటిలో కొన్నింటిని ఇళ్లలోనే పెంచుకుంటూ వచ్చే ఏడాది పందేలకు సిద్ధం చేస్తారు. బలిష్టంగా ఉన్న కోళ్లను ఈ ఏడాదే పందెం బరిలోకి దింపుతారు.

కత్తులు దూసిన పందెం కోళ్లు



పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు మండలం గుండుగొలనులో కత్తికట్టి కొట్టుకుంటున్న కోళ్లు



తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం మురమళ్లలో భారీ ఎత్తున జరుగుతున్న కోళ్ల పందేలు



పశ్చిమ గోదావరి జిల్లా ఏటూరులో కోడికి కత్తికడుతున్న పందెం ప్రియులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజాప్రతినిధులు, నేతలే బరుల నిర్వాహకులు కావడంతో అధికార యంత్రాంగం, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. కోడిపందేలు, పేకాట శిబిరాల్లో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని అంచనా వేస్తున్నారు. భోగి పండుగ రోజే దాదాపు రూ.200 కోట్లు చేతులు మారాయని అంటున్నారు. కర్ణాటక, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పందెంరాయుళ్లు తరలిరావడంతో విజయవాడలోని హోటళ్లు, లాడ్జిలు రద్దీగా మారాయి.

బరిలో టీడీపీ ప్రముఖులు

అధికారపార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు దగ్గరుండి మరీ కోడిపందేల బరులు నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో మంత్రి అయ్యన్నపాత్రుడు పందేలను ప్రారంభించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురంలో కోడి పందేలను ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం గుండుగొలనులో పందేలను ఎమ్మెల్యే గన్నివీరాంజనేయులు ప్రారంభించారు. ఏలూరు నియోజకవర్గంలో జాలిపూడి, గుడివాకలంక, శ్రీపర్రు గ్రామాల్లో టీడీపీ నాయకులు కొత్త బరులు ఏర్పాటు చేశారు. పెనమలూరు నియోజకవర్గం ఈడుపుగల్లులో పందేలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఇక్కడే పొట్టేళ్ల పందేలు కూడా జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా మురమళ్లలో పందేలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆరంభించారు. గుంటూరుజిల్లా చెరుకుపల్లి మండలంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో బరులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ పందేలకు తెర తీశారు.

జిల్లాల్లో పందేల జోరు..

కోర్టు నిషేధం ఉన్నప్పటికీ ఈ ఏడాది భారీ స్థాయిలో బరులు ఏర్పాటుచేశారు. గత ఏడాది నిర్వహించిన ప్రాంతాలలో కాకుండా చాలా చోట్ల ఈ సారి కొత్త ప్రాంతాలలో బరులు ఏర్పాటు చేయడం విశేషం. పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వరకు కోడిపందేలను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా యత్నించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి జిల్లా వ్యాప్తంగా కోడి పందేలు మొదలయ్యాయి. యలమంచిలిలోని గుంపర్రులో పందేలను తిలకించేందుకు పలువురు సినీ కమెడియన్లు వచ్చారు. ఏలూరు నియోజకవర్గంలో జాలిపూడి, గుడివాకలంక, శ్రీపర్రు గ్రామాల్లో టీడీపీ నాయకులు కొత్త బరులు ఏర్పాటు చేశారు. దెందులూరు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లోనూ పలుచోట్ల పందేలు జరుగుతున్నాయి. భీమవరం నియోజకవర్గంలో వెంప, వీరవాసరం, నౌడూరు, కొణితివాడ, మత్స్యపురి గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కొవ్వూరు, పాలకొల్లు, ఉండి, చింతలపూడి, ఆచంట, నరసాపురం, గోపాలపురం, తణుకు నియోజకవర్గాల్లో భారీగా పందేలు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం గ్రామంలో 30 ఎకరాల భూమిలో భారీ స్థాయిలో బరి ఏర్పాటు చేసి పందేలు చేపట్టారు. కోడిపందేలతో పాటు గుండాట, కోత ముక్క వంటి జూదాలు కూడా నిర్వహించారు. డబ్బు బయటికి కనబడకుండా పందేల వద్ద కాయిన్ విధానం ప్రవేశపెట్టారు. తొలుత కత్తులు లేకుండా పోటీలు ప్రారంభించి.. అనంతరం కత్తులు కట్టి యథావిధిగా పందేలు నిర్వహించారు. సెల్ ఫోన్లలో పందేల నిర్వహణను ఫొటోలు తీయకుండా నియంత్రించేందుకు దాదాపు 200 మంది పార్టీ కార్యకర్తలను నియమించారు. విజయవాడ శివారు ప్రాంతంమైన పెనమలూరు నియోజకవర్గంలో ఈడ్పుగల్లు వద్ద భారీ బరిని నిర్వహించారు. ఇదే నియోజకవర్గంలో దాదాపు 10చోట్ల బహిరంగంగా బరులు ఏర్పాటు చేశారు. ఇక్కడ కోడిపందేలు, గొర్రెపొట్టేళ్ల పందేలు, జూదం శిబిరాలు యథేచ్ఛగా నిర్వహించారు. ఈడ్పుగల్లులో జరిగిన పొట్టేళ్లు, కోడిపందేలకు హైదరాబాద్, తెలంగాణా, కర్ణాటక నుంచి గొర్రెపొట్టేళ్లు, కోళ్లతో పందెందారులు తరలివచ్చారు. కోస్తా జిల్లాల నుంచి కూడా కోడి పందెం దారులు తరలివచ్చారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం నియోజకవర్గంలో గోడి, రాజానగరం నియోజకవర్గంలో పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు, రాజోలు నియోజకవర్గంలో మలికిపురం, లక్కవరం, రాజోలు, చింతలపల్లిలో జరిగాయి. ఏజెన్సీలోని రంపచోడవరం, మెట్టలోని తుని, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లో పందేలు జోరుగా సాగాయి.



విశాఖ జిల్లా నర్సీపట్నంలో కోడిపందేలు ప్రారంభిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు




కృష్ణా జిల్లా ఈడుపుగల్లులో నిర్వహించిన పోటీల్లో తలపడుతున్న గొర్రె పొట్టేళ్లు

కోట్లలో పందేలు

ఆదివారం భోగి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాటలలో దాదాపు రూ. 200 కోట్ల మేర డబ్బు చేతులు మారిందని వినిపిస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరిగిన కోడిపందేలు, జూదంలో రూ. 150కోట్లు చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో తొలి రోజు రూ.30 కోట్లు, తూర్పు గోదావరిలో రూ.20 కోట్ల మేర పందేలు సాగినట్లు అంచనా. విశాఖలో రూ. 3 కోట్లు, విజయనగరం జిల్లాలో రూ.2 కోట్ల మేర పందేలు సాగాయని అంచనా వేస్తున్నారు.

4
సాక్షి
సాహిత్యం
వైఎస్ఆర్ జిల్లా | సోమవారం | జనవరి | 15 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com



గ్రేట్ రైటర్

హొనోరే దె బాల్జాక్



సూక్ష్మాంశాల పట్ల గల సునిశిత దృష్టి వల్లనూ, ఫిల్టర్ లేని సామాజిక చిత్రణ వల్లనూ యూరప్ సాహిత్యానికి వాస్తవికతను(రియలిజం) అద్దిన సాహిత్యకారుల్లో ఒకరిగా హొనోరే దె బాల్జాక్ (1799–1850) పేరొందారు. ఆయన సృష్టించిన ఒక చిన్నపాత్ర కూడా నైతిక సంశయంలో ఉన్న పూర్తి రక్తమాంసాలు గల మనిషిగా ప్రవర్తిస్తుందని విమర్శకులు చెబుతారు. ఫ్రాన్స్‌లో నెపోలియన్ ఓటమి అనంతరం పదహారో లూయీ సోదరులు అధికారంలోకి వచ్చిన పందొమ్మిదవ శతాబ్దపు తొలి అర్ధభాగంలోని ఫ్రెంచ్ సమాజపు స్థితిగతులను చిత్రించిన నవలాహారం ‘ద హ్యూమన్ కామెడీ’, బాల్జాక్ మేగ్నమ్ ఓపస్. కథలు, నవలలు, వ్యాసాలుగా ఉన్న ఈ బృహత్తర రచనాహారంలో ఆయన పూర్తిచేసినవి 91 పుస్తకాలు; ఆలోచించీ పూర్తిచేయనివి 46. ఇది రాస్తున్న సమయంలో దాదాపుగా నిద్రను మానుకున్నారు. తనను తాను మేల్కొనేలా ఉంచుకోవడానికి రోజుకు సుమారు యాభై కప్పుల కాఫీ తాగేవారట. ఇంత ఒత్తిడితో కూడిన రచనావ్యాసంగం వల్ల తరచూ వేధించిన అనారోగ్యమూ, దెబ్బతిన్న కుటుంబ సంబంధాలూ ఆయన్ని 51 ఏళ్లు మాత్రమే జీవించేలా చేశాయి.

సాహిత్య మరమరాలు


వదిన ఏమనుకుంటుందో!



ఒకరోజు ఉదయాన్నే బాగా వాన పడుతోంది. చాయ్ తాగుతూ కాళోజీ ఇంటిముందు కూర్చున్నారు. అప్పుడే ఒక ఎరుకలవాళ్ల పిల్లాడు అట్లా నడుస్తూ వస్తున్నాడు. ఒంటి మీద బట్టలు కూడా సరిగా లేవు. చూరు కింద నడుస్తున్నప్పటికీ సన్నచూరు కావడంతో పూర్తిగా తడిచిపోతున్నాడు. చిన్నోడిని ఇంట్లోకి పిలిచి, తుడుచుకోవడానికి ఏదైనా ఇచ్చి, ఏమైనా తినడానికి పెడితే బాగుండేదని కాళోజీ మనసుకు అనిపించింది. కానీ వదినకు మడి, ఆచారం అని తెలుసు. అన్నా వదినల మాట కాళోజీ జవదాటేవారు కాదు. ఇంట్లోకి పిలిస్తే వదిన ఏమంటుందో! దాంతో పిలుద్దామా, వద్దా అని మథనపడుతారు. ధైర్యం లేక, పీలగా ‘వదినా’ అంటారు. ఏ కారణం వల్ల కాళోజీ పిలిచాడో కూడా తెలియని ఆ ఇల్లాలికి బయటికి రాగానే పిల్లాడు కనబడ్డాడు. అయ్యో పసివాడు చలిలో వణుకుతున్నాడని వెంటనే దగ్గరికి తీసుకుని ఇంట్లోకి తోడ్కొనిపోతుంది. వదిన మాతృహృదయాన్ని తాను అర్థం చేసుకోలేకపోయానే అని కాళోజీ సిగ్గుపడతారు.

(లంకా సూర్యనారాయణ చెప్పిన ఘట్టం)

ప్రతిధ్వనించే పుస్తకం





త్రిపురనేని గోపీచంద్

‘సీతారామారావు జీవితం విచిత్రమైంది. ఉన్నత శిఖరాగ్రం నుంచి స్వచ్ఛమైన జలంతో భూమిమీద పడి మలినాన్ని కలుపుకొని, మురికి రూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది. తనలో వచ్చిన మార్పు ఆ సెలయేటికి తెలుసో తెలియదో మనకు తెలియదు. ఒకవేళ తెలిస్తే తనలో వచ్చిన మార్పుకి ఆ సెలయేరు బాధపడుతూ వుందో మనకు తెలియదు,’ అంటూ ప్రారంభమవుతుంది త్రిపురనేని గోపీచంద్ నవల ‘అసమర్థుడి జీవయాత్ర’.

ఊహాత్మక ఆదర్శాలకూ వాస్తవ జీవితానికీ మధ్య సమన్వయం కుదుర్చుకోలేని మనిషి సీతారామరావు. దాంపత్యానికి కొత్త అర్థాన్ని కల్పిస్తానని ఇందిరను వివాహం చేసుకుంటాడు. ఆమెను సాధించడం మినహా మరేమీ చేయడు. మళ్లీ సాధిస్తున్నానని తెలిసి కన్నీళ్లు పెట్టుకుంటాడు. పక్కనున్న పేదవాళ్లతో కలిసి ఆడుకొమ్మని పాపకు చెబుతాడు. ఆడుకున్నందుకూ, అందులో భాగంగా పోట్లాడి వచ్చినందుకూ అదే కూతురిని దండిస్తాడు. దీర్ఘంగా ఆలోచించడమే తన బాధలకు మూలకారణం అనుకుంటాడు. అలాగని ఆలోచనను రద్దు చేసుకోలేకపోతాడు. ఈ ప్రపంచం అజ్ఞానుల కోసమే ఉద్దేశించినది అనుకుంటాడు. తాను జ్ఞానంగా భావించే ఏ పనినీ చేయడు. అసలు జ్ఞానమంటే ఏమిటో మాత్రం తెలుసా?


జీవించడం మినహాయించి, జీవితానికి మరే సిద్ధాంతమూ లేదని గుర్తించడంలో విఫలమవుతాడు. బతికినన్నాళ్లూ ఏదో రకంగా జీవితంలో పాల్గొనవలసిందే అని చెప్పిన రామయ్యతాతను హేళన చేస్తాడు. అటు ఏమీ తెలియని శీనయ్యలానో, ఇటు అన్నీ తెలిసిన రామయ్యలానో ఉండలేకపోతాడు. తండ్రి కాపాడమన్న కుటుంబ మర్యాద అనే బరువును నెత్తిన మోపుకుని, ఉన్న ఆస్తినంతా కరిగిస్తాడు. తననూ అందర్నీ చూచినట్టు చూస్తే మనసు నొచ్చుకుని, జనంలో స్వేచ్ఛగా కలిసిపోలేక తనకు తానే ఒక ద్వీపకల్పంగా తయారవుతాడు. జీవితపు పరమార్థాన్ని అందుకోలేక, తలెక్కడో తోకెక్కడో తెలియని సంఘంతో ఘర్షణపడతాడు. చివరకు పిచ్చివాడిగా ముద్రపడి ఆత్మహత్య చేసుకుంటాడు.

హేతువాది త్రిపురనేని రామస్వామి కొడుకుగా పుట్టిన గోపీచంద్ తనకు ఎదురైన జీవితానుభవాల నేపథ్యంలో ధార్మిక చింతనలోకి మరలిపోయారు. తన జీవితకాలం మోసిన హేతువాదపు బరువును దింపుకోవడానికి కూడా గోపీచంద్ ఈ నవల రాశాడంటారు. ‘ఎక్కడో ఒక చోట ఈ ఎందుకు? ఆగవలసిందేరా తండ్రుల్లారా’ అని ఓచోట సీతారామరావు వ్యాఖ్యానిస్తాడు కూడా. ‘ఎందుకు? అన్న ప్రశ్న నేర్పినందుకు ‘నాన్నగారికి’ అంకితం చేసిన ఈ పుస్తకం రాయడం ద్వారా అదే నాన్న నుంచి సంక్రమించిన హేతుభావం నుంచి విముక్తుడయ్యారు. తెలుగులో వచ్చిన తొలి మనో వైజ్ఞానిక నవలగానూ, మానసిక స్థితిని చిత్రించడానికి బొమ్మలను వాడిన ప్రయోగాత్మక నవలగానూ దీనికి పేరుంది. తెలుగులో వచ్చిన అత్యుత్తమ నవలల్లో ఒకటి. గోపీచంద్ అత్యుత్తమ పనితనం కనబడే పుస్తకమూ ఇదే!

కథాసారం

చంపాలా? వద్దా?

అతడు మౌనంగా లోపలికి వచ్చాడు. బుల్లెట్లున్న తోలుపట్టీని, దానికి వేలాడుతున్న తుపాకి సహా తీసి గోడకు వున్న కొక్కానికి తగిలించాడు. తన మిలిటరీ టోపీని కూడా అక్కడే పెట్టాడు. తర్వాత టై ముడి విప్పుతూ, ‘ఈ వేడిమి భయంకరంగా వుంది. నాకు గడ్డం చెయ్’ అని కుర్చీలో కూర్చున్నాడు.



క్యాప్టెన్ టోరెస్! అతడిని చూడగానే క్షురకుడికి వణుకు మొదలైంది. భయంతో కూడిన భావోద్వేగాన్ని బయట పడనీయకుండా, తన దగ్గరున్న కత్తుల్లో అన్నిటికన్నా వాడిగా వున్న దాన్ని తోలుపట్టీ మీద పైకీ కిందకూ తిప్పుతూ పదునును మరింత పెంచడానికి ప్రయత్నించాడు. తర్వాత చేతి వేలితో సుతారంగా ఆ పదునును అంచనా వేశాడు. టోరెస్ గడ్డం నాలుగు రోజులదై వుంటుంది! అతడు నాలుగు రోజులుగా దళాలను వెతికే పనిలో ఉన్నాడు. అందువల్ల ముఖం ఎండ వేడిమికి కమిలి ఎర్రబడింది.

క్షురకుడు జాగ్రత్తగా సబ్బు నురగ తయారు చేయటం ప్రారంభించాడు. కొన్ని సబ్బుముక్కల్ని ప్లాస్టిక్ కప్పులో పడేసి, కొన్ని వేణ్నీళ్లను అందులో పోసి, బ్రష్‌తో తిప్పటం మొదలెట్టాడు.

‘మా పటాలంలోని మిగిలినవాళ్లక్కూడా ఇంతే గడ్డం పెరిగి వుండాలి’ అన్నాడు టోరెస్. ‘ముఖ్యమైనవాళ్లు మాకు దొరికారు. కొందర్ని చంపేశాం. మరికొందరు ఇంకా బతికేవున్నారు. కానీ త్వరలోనే వాళ్లంతా చనిపోతారు’ అని కూడా అన్నాడు.

‘ఎందర్ని పట్టుకున్నారు మీరు?’ అడిగాడు క్షురకుడు.

‘పద్నాలుగు మందిని. వాళ్ల ఆచూకీ కనుక్కోవటం కోసం మేము అడవిలో చాలా లోపలికి వెళ్లాల్సి వచ్చింది. మిగిలినవాళ్లను కూడా పట్టుకుంటాం. ఒక్కడు... ఒక్కడు కూడా ప్రాణాలతో మిగలడు’.

క్షురకుడు ఆందోళన చెందాడు. అతడు కూడా రహస్య దళానికి చెందినవాడే! డ్రాయరు సొరుగులోంచి గుడ్డను తీసి టోరెస్ మెడ వెనకాల ముడి వేశాడు. ‘మా చర్య ఈ నగర ప్రజలకు మంచి గుణపాఠాన్ని నేర్పివుండాలి’ అన్నాడు టోరెస్. అతడు బాగా అలసిపోయినట్టుగా కళ్లు మూసుకుని, సబ్బు నురగ తాలూకు చల్లదనాన్నీ, హాయినీ అనుభవించడానికి వేచి వున్నాడు.

టోరెస్‌కు అంత సమీపంగా ఎప్పుడూ వెళ్లలేదు క్షురకుడు. నగర ప్రజలందరినీ స్కూలు ప్రాంగణంలో గుమిగూడాలని టోరెస్ ఆజ్ఞ జారీ చేసినప్పుడు మాత్రం ఒక్క నిమిషం సేపు అతడికి ఎదురుగా నిలిచాడు. అక్కడ నలుగురు విప్లవకారులను చెట్లకు వేలాడదీసి తుపాకులతో కాల్చేస్తుంటే ప్రజలందరూ చూడాలని టోరెస్ కోరిక. గాయాలతో చెదిరిపోయిన ఆ శవాలను చూసి, ఆ చర్యకు ముఖ్యకారకుడైన మిలిటరీ అధికారి ముఖాన్ని అప్పుడు అంత పరీక్షగా చూడలేదు. కానీ ఆ ముఖాన్నే ఇప్పుడు తన చేతుల్లోకి తీసుకోబోతున్నాడు.

టోరెస్ అందవికారంగా ఏం లేడు. ఆ గడ్డం వల్ల వయసు కొంచెం ఎక్కువ ఉన్నట్టు అనిపిస్తోంది. అతడు మంచి ఊహాశాలీనత ఉన్నవాడయ్యుండాలి. లేకపోతే విప్లవకారుల్ని నగ్నంగా చెట్లకు వేలాడదీసి, వాళ్ల శరీరాలను టార్గెట్లు చేస్తూ షూట్ చేయాలనే ఆలోచన ఎవరికి వస్తుంది?

సబ్బు నురగను అనుభవిస్తూ, కళ్లు మూసుకునే అన్నాడు టోరెస్: ‘నేను ఎంతగా అలసిపోయి వున్నానంటే ఇప్పుడు నేరుగా నిద్రలోకి జారుకోగలను. కానీ ఈ సాయంత్రం నేను చేయాల్సిన పని ఎంతో వుంది’.

సబ్బు నురగ పులమటం ఆపి, ఏమాత్రం ఆసక్తి లేనట్టుగా, ‘మళ్లీ కాల్పులు కొనసాగిస్తారా?’ అడిగాడు క్షురకుడు.

‘అట్లాంటిదే. కానీ అంత తీవ్రమైన చర్య కాదు’.

క్షురకుడి చేతులు మళ్లీ వణికాయి. అయినా ఇతర కస్టమర్లకు చేసినట్టుగానే ఇతడికి కూడా ఒక్క చుక్క రక్తం రాకుండా జాగ్రత్తగా గడ్డం తీయాలి. వెంట్రుకల మీద కత్తిని పక్కకు పోనీయకూడదు. అరచేతి వెనుక భాగాన్ని ముఖానికి ఆనించి కదిపితే ఒక్క వెంట్రుక కూడా లేనట్టు తెలియాలి. కత్తి బ్లేడును తెరిచి సైడ్ లాక్ నుండి గీయటం మొదలెట్టాడు. కత్తి మెత్తగా జారుతోంది. టోరెస్ వెంట్రుకలు మందంగా, బిరుసుగా ఉన్నాయి. గీస్తుంటే చిన్నగా చర్మం తేలుతోంది.

‘ఈరోజు ఆరు గంటలకు బడి దగ్గరకు రా’ అన్నాడు టోరెస్.

‘ఆరోజు లాగానే జరగబోతోందా?’

‘ఇంకా బాగా కూడా వుండొచ్చు’

‘ఏం చెయ్యాలనుకుంటున్నారు?’

‘ఇంకా నాకే తెలియదు. కానీ మంచి వినోదం వుండబోతోంది’

‘అందర్నీ శిక్షించాలని ప్లాను వేసుకున్నారా?’ ధైర్యం చేసి అడిగాడు.

‘అందర్నీ’

అద్దంలో కనబడే వీధిని చూశాడు క్షురకుడు. ముందరిలాగే కిరాణా దుకాణం, అందులో ఇద్దరో ముగ్గురో కస్టమర్లు ఉన్నారు. గడియారం రెండూ ఇరవై సూచిస్తోంది. మెడమీద కత్తిని మెల్లగా కదుపుతున్నాడు. అక్కడ గీసేటప్పుడు చాలా చాకచక్యంగా ఉండాలి. వెంట్రుకలు మందంగా లేకపోయినా చిన్నచిన్న రింగులుగా మెలితిరిగినయ్. ఆ చర్మరంధ్రాల్లో ఏదైనా ఒకటి తెరుచుకుని రక్తాన్ని స్రవింపజేయగలదు. విప్లవకారుల్లో ఎంతమంది చంపించాడతడు! ఎంతమందిని చిత్రవధల పాలు చేశాడు! తన చేతుల్లో వున్న టోరెస్ ముఖానికి శుభ్రంగా గడ్డం గీసి, భద్రంగా ప్రాణాలతో వదిలేయటం భరించరాని విషయమనిపించింది. నిజానికి అతణ్ని చంపటం ఇప్పుడు ఎంత సులభం! గొంతును సర్రుమని కోసి. ప్రతిఘటించటానికి కూడా సమయం ఇవ్వకుండా. కళ్లు మూసుకుని వున్నాడు కనుక మెరిసే కత్తిని గుర్తించలేడు. మెడలోకి కత్తిని దించితే అందులోంచి రక్తం చిమ్మి గుడ్డనూ, కుర్చీనీ, నేలనూ మొత్తంగా తడిపేయగలదు. వెచ్చని రక్తం నేల మీదుగా పారి వీధిలోకి కూడా ప్రవహిస్తుంది. లోతుగా పెట్టే గాటు పెద్ద నొప్పిని కూడా కలిగించదు. మరి శవాన్ని ఏం చేయాలి? ఎక్కడ దాచాలి? క్యాప్టెన్ టోరెస్‌ను చంపిన హంతకుడు... గడ్డం గీస్తున్నప్పుడు గొంతు కోశాడు పిరికిపంద, అనుకుంటారు జనం. మనందరి వైపు నుండి ప్రతీకారం తీర్చుకున్నాడు, అని కూడా అనుకోవచ్చు!

పట్టువస్త్రంలాగా, మెత్తని రబ్బరు ముక్కలాగా అతని చర్మం సులభంగా తెగిపోతుంది. మనిషి చర్మం కన్నా ఎక్కువ మెత్తనైనది మరేదీ లేదేమో! బయటికి చిమ్ముకుని రావడానికి లోపల రక్తం వుండనే వుంటుంది. కానీ నేను హంతకుణ్ని కాదలుచుకోలేదు. నువ్వు గడ్డం గీయించుకోవటం కోసం నా దగ్గరికి వచ్చావు. నేను నా పనిని గౌరవప్రదంగా చేస్తాను. నా చేతులకు రక్తం అంటుకోవడం నాకిష్టం లేదు. కేవలం సబ్బు నురగ చాలు!

నున్నగా శుభ్రంగా గడ్డం గీకేశాడు క్షురకుడు. టోరెస్ అద్దంలో చూసుకున్నాడు. అరచేతుల్తో చెంపల్ని ముట్టుకుని, ‘థాంక్స్’ అన్నాడు.

కుర్చీలోంచి లేచి, బెల్టు, పిస్తోలు, టోపీ చేతిలోకి తీసుకున్నాడు. ప్యాంటు జేబులోంచి నాణాల్ని బయటికి తీసి ఇచ్చాడు.

బయటికి వెళ్లబోతూ, ద్వారం దగ్గర ఆగి– ‘నువ్వు నన్ను చంపుతావని అన్నారు కొందరు. ఆ విషయం తెల్చుకోవటానికి ఇక్కడికి వచ్చాను. చంపటం అంత సులువైన పనికాదు. నేను చెబుతున్న ఈ వాక్యంలో ఎంతో వాస్తవం ఉంది’ అన్నాడు టోరెస్. క్షురకుడు అక్కడే ఉండిపోయాడు.




ఎర్నాందో టెచేస్

కొలంబియా రచయిత, పాత్రికేయుడు ఎర్నాందో టెచేస్ (1908–1966) రాసిన ‘లాదర్ అండ్ నథింగ్ ఎల్స్’ కథ సారాంశం ఇది. దీన్ని ‘కొంచెం సబ్బు నురగ... అంతే’ పేరుతో ఎలనాగ తెలుగులోకి అనువదించారు.

కొత్త బంగారం

అన్న... తమ్ముడు... క్రికెట్!





అరవింద్ అడిగా

ముంబయిలో నివసిస్తున్న కుమార్ల కుటుంబంతో నవల ప్రారంభం అవుతుంది. 14 ఏళ్ల రాధాకృష్ణ (రాధ), 13 ఏళ్ల మంజునాథ్ (మంజు), తండ్రి మోహన్! ఆయన తన కొడుకులను పేరొందిన క్రికెటర్లుగా తయారు చేయడానికి, కర్ణాటక నుండి ముంబయి మురికివాడకు వస్తాడు. కుర్రాళ్ల తమ బాల్యాలను ఆరోగ్యం, శుభ్రత కోసం త్యాగం చేయవలసి వచ్చినప్పుడు, తండ్రిని అసహ్యించుకుంటారు. భార్య వదిలేసి పోతుంది.
మోహన్ రైల్లో ప్రయాణికులతో చెప్తుంటాడు: ‘నేను అద్భుతమైన చట్నీలమ్ముతాను. రోజుకి 24 రకాలైన చట్నీలు. పుదీనా, వెల్లుల్లీ, మిరపా, తీపీ. అన్నీ నూరు శాతం శాకాహారం’.

అబ్బాయిలు టీనేజీలోకి ప్రవేశించినప్పుడు, ముంబయి క్రికెట్ అసోసియేషన్ కోసం పని చేసే ‘టామీ సర్’ కుర్రాళ్ళ ప్రతిభ గుర్తించి, స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తాడు. ఆ డబ్బుని మితంగా ఖర్చు పెడుతూ కుమార్ల కుటుంబం చెంబూర్‌కు మారుతుంది. మంజూ, రాధా క్రికెట్ ఆడుతున్నప్పుడు, వారి జట్టులో ఉండే జావెద్ అన్సారీ వాళ్ళకి పోటీగా నిలబడతాడు. అన్నదమ్ములకీ తండ్రికీ మధ్య ఘర్షణ ఎక్కువవుతూ ఉంటుంది. సెలెక్షన్ డే సమీపిస్తున్నప్పుడు, తనవల్ల ఇతరులకి కావలసినదేమిటో, తనకోసం తాను కోరుకున్నదేమిటో అని పరిశీలించుకునే అవసరం పడుతుంది మంజుకి.

ఇక, సెలెక్షన్ డే నాడు తండ్రి నమ్మకం పెట్టుకున్న రాధ ఎంపికవక, క్రికెట్ ఆడటం ఇష్టం లేని మంజు ఎంపికవుతాడు. అన్నదమ్ముల మధ్య ఈర్ష్యాద్వేషాలు పుడతాయి. మంజుకీ, జావెద్‌కీ ఉన్న సంబంధం లైంగిక రూపం దాలుస్తుంది.

పుస్తకంలో స్త్రీలు ఉండరు. వారి గురించిన క్లుప్తమైన ఉదహరింపులుంటాయంతే. నవలలో అధికభాగం తోబుట్టువుల మధ్య పోటీ గురించినదే.

పుస్తకం, క్రికెట్లో పేరు ప్రఖ్యాతుల కోసం మార్గం వెతకడం కన్నా, ఆ క్రీడవల్ల మూసుకోబడిన ఇతర మార్గాల గురించినది. తన పాత్రలకున్న భయాలనీ, మనఃస్థితులనీ, తమకి తాము నిర్మించుకున్న వారి ఖైదులనీ– రచయిత వారి అంతర్గత కంతాల లోపలకీ, బయటకీ త్వరితంగా ప్రయాణిస్తూ, వర్ణిస్తారు. చిన్న పాత్రలకి కూడా రచయిత విషాదాన్నీ, గంభీరతనీ ఆపాదిస్తారు. వ్యంగ్య చిత్రాలు లేవు నవల్లో.


ఇతివృత్తం ఆహ్లాదకరమైనది. 1983 అనంతరపు క్రికెట్ చుట్టూ కథ అల్లారు రచయిత. నవల నేపథ్యం క్రికెట్ మీదనున్న భారతదేశపు ఆరాధన. ఆ క్రీడ మీద సవిమర్శక పరిశీలనతోనే నడిచే నవల ఇది. క్రికెట్ అంటే మనకి దేవుడు, అది జాతీయ వ్యామోహమే కాక ఒక మతంలా కూడా తయారయిందన్న ఉదహరింపులున్నాయి. పుస్తకం, లైంగిక మేల్కొలుపు గురించినది కూడా!

రచయిత రాసిన విధానం వల్ల కథను ఆస్వాదించాలంటే పాఠకులకి క్రికెట్ గురించి తెలియాల్సిన అవసరం ఉండదు. క్రీడల మీద రాయబడిన ఇతర పుస్తకాల్లాగే ఇక్కడ కూడా, క్రికెట్ అన్న అంశం– విస్తృత సమస్యలను అన్వేషించే పరికరం మాత్రమే. ఈ క్రీడ మనుష్యలని ఎలా ఏకం చేస్తుందో, విడదీస్తుందో, ఉత్తేజపరుస్తుందో అన్న సంగతులనీ, తెర వెనకాతల సాగే లంచగొండితనాలూ, సాధికారతలన్నిటినీ రచయిత వర్ణిస్తారు.


తన తొలి నవల ‘ద వైట్ టైగర్’కు 2008లో బుకర్ ప్రైజ్ గెలుచుకున్న అరవింద్ అడిగా మూడో నవల ఈ ‘సెలెక్షన్ డే’. 2016లో వచ్చింది.

◆ క్రిష్ణవేణి

ఈవారం పుస్తకాలు




కనిపించని చెయ్యి
(మరికొన్ని కథలు)
రచన: హెచ్చార్కె; పేజీలు: 164; వెల: 130; ప్రతులకు: చినుకు పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ –3. ఫోన్: 9848132208



రుద్రప్రయాగ చిరుతపులి
మూలం: జిమ్ కార్బెట్; స్వేచ్ఛానువాదం: కందుకూరి రవీంద్రనాథ్; పేజీలు: 288; వెల: 225; ప్రతులకు: 8-43/3/బి, శ్రీనివాసా కాలనీ మెయిన్ రోడ్, స్వరూప్ నగర్, ఉప్పల్, హైదరాబాద్–39. ఫోన్: 9440712903



మరోసారి కారా కథల్లోకి
సంపాదకత్వం: రమాసుందరి; పేజీలు: 230; వెల: 150; ప్రతులకు: కథానిలయం, విశాఖ బ్యాంక్ ఎ కాలనీ, శ్రీకాకుళం – 532001. ఫోన్: 9490008743



సాకిరేవు కతలు
రచన: మూరిశెట్టి గోవింద్; పేజీలు: 128; వెల: 120; ప్రచురణ: మల్లవరపు వెలువరింతలు; ప్రతులకు: పూదోట శౌరీలు, 1-2-740, హనుమాన్ మందిరం దగ్గర, రాకాసిపేట, బోధన్–503180. నిజామాబాద్ జిల్లా, తెలంగాణ. ఫోన్: 9010153505



పదం పలికింది - పాట నిలిచింది

ఆ నయనాలు విరిసిన చాలు అమవస నిశిలో చంద్రోదయాలు



సినిమా పాట ఔచిత్యాన్ని నూటికి నూరుపాళ్లు నిలబెట్టిన కవి, సి.నారాయణరెడ్డి. ఎలాంటి సినిమాలోనైనా, ఎలాంటి పాటలోనైనా ఆయన మార్కు పదాల పోహళింపు, భావాల గుబాళింపు రసహృదయులను ఇట్టే ఆకట్టుకుంటుంది.

1978లో వచ్చిన శివరంజని చిత్రం కోసం సినారె రాసిన ‘అభినవ తారవో నా అభిమాన తారవో’ పాటలోని ఈ పాదాల్లో కవిత్వం చెవులను తియ్యగా తాకుతుంది. ‘*ఆ నయనాలు విరిసిన చాలు అమవస నిశిలో చంద్రోదయాలు/ ఆ నెన్నడుమూ ఆడిన చాలు రవళించునూ పదకవితా ప్రబంధాలు*’. అంతటితో ఆగకుండా, తరువాతి చరణంలో ‘*నీ శృంగార లలిత భంగిమలో పొంగిపోదురే ఋషులైనా/ నీ కరుణ రసావిష్కరణంలో కరిగిపోదురే కర్కషులైనా*’ అంటాడు సినారె.

దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంగీతం కూర్చినది పసుపులేటి రమేష్ నాయుడు. ఈ పాటను ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాడారు. అభినయించినది హరిప్రసాద్, జయసుధ.

రారండోయ్

- 31వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ హైదరాబాద్, ఇందిరా పార్క్ దగ్గరి ఎన్టీఆర్ స్టేడియంలో జనవరి 18 నుంచి 28 వరకు జరగనుందని ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీ శంకర్ తెలియజేస్తున్నారు.
- జనవరి 21న హైదరాబాద్‌లోని గోల్డెన్ త్రెషోల్డ్‌లో జరిగే 36వ కవిసంగమంలో ఎండ్లూరి సుధాకర్, నాగిళ్ల రమేశ్, సరసిజ పెనుగొండ, వేణుగోపాల్ జుజ్జూరి, రమేష్ కార్తీక్ నాయక్ తమ కవిత్వాన్ని వినిపిస్తారు.
- రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం–2017కు గానూ సుంకిరెడ్డి నారాయణరెడ్డి కవితాసంపుటి ‘తావు’ ఎంపికైందని రంగినేని మోహన్‌రావు తెలియజేస్తున్నారు.
- నందకిశోర్ కవితాసంపుటి ‘యథేచ్ఛ’ ఆవిష్కరణ సభ జనవరి 16న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో జరగనుంది.
- జానుడి సాహిత్య పురస్కారాన్ని పత్తిపాక మోహన్‌కు జనవరి 22న ఒంగోలులో ప్రదానం చేయనున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం. తిథి బ.చతుర్దశి తె.4.56 వరకు (తెల్లవారితే మంగళవారం). నక్షత్రం మూల సా.4.44 వరకు, తదుపరి పూర్వాషాఢ. వర్జ్యం ప.2.56 నుంచి 4.44 వరకు. దుర్ముహూర్తం ప.12.30 నుంచి 1.14 వరకు, తదుపరి ప.2.43 నుంచి 3.27 వరకు. అమృత ఘడియలు ఉ.9.40 నుంచి 11.25 వరకు. మకర సంక్రాంతి.

సూర్యోదయం : 6.38 **సూర్యాస్తమయం :** 5.40
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.33
జొహర్ : 12.25
అసర్ : 4.26
మగ్రీబ్ : 6.02
ఇషా : 7.18



శ్రీవారి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ రజని




ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ షక్దేర్

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

సాక్షి, తిరుమల: ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ షక్దేర్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో వారు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. న్యాయమూర్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

ప్రజల సమస్యలు పరిష్కరించగల నేత జగన్

వైఎస్సార్‌సీపీ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి



సాక్షి, తిరుమల: రాష్ట్ర ప్రజల మనసెరిగి.. వారి సమస్యలను పరిష్కరించగల మంచి నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడు దశాబ్దాలపాటు సేవలందించే భాగ్యాన్ని ప్రసాదించాలని దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. ఆ దేవదేవుని ఆశీస్సులు తప్పక వైఎస్ జగన్‌కు ఉంటాయన్నారు. విజయసాయిరెడ్డి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మకర సంక్రాంతి వేళ తెలుగు ప్రజలందరూ సుఖసంతోషాలు, సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి నుంచి శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభం


సాక్షి, తిరుమల: పవిత్ర ధనుర్మాసం ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ పునఃప్రారంభం కానుంది. గత ఏడాది డిసెంబర్ 16న ఉదయం 11.13 గంటలకు ధనుర్మాసం ప్రారంభం కావడంతో శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 17 నుంచి సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. ఈ ధనుర్మాస ఘడియలు ఆదివారంతో పూర్తయ్యాయి. దీంతో యథాప్రకారం సుప్రభాతసేవ పునఃప్రారంభం కానుంది.

మత సామరస్యానికి ప్రతీక

ఏటి పండగ



నది వద్ద మహిళల పూజలు



బుద్ధ వందనం దృశ్యం (ఫైల్)

నాయుడుపేటటౌన్: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని స్వర్ణముఖి నది వద్ద ప్రతి ఏటా కనుమ రోజు నుంచి 3 రోజుల పాటు జరిగే ఏటి పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 50 ఏళ్ల కిందటి నుంచే ఈ పండుగ జరుగుతోందని చెబుతుంటారు. 20 ఏళ్ల కిందటి వరకు వందల సంఖ్యలో మాత్రమే ప్రజలు ఇక్కడకు వచ్చి ఏటి పండుగలో పాల్గొనేవారు. క్రమేపీ వేల సంఖ్యలో జనం ఈ పండగలో పాలుపంచుకోవడం మొదలయ్యింది. దీన్ని రాష్ట్ర పండుగల జాబితాలో చేర్చేందుకు కూడా కృషి జరుగుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగలో ప్రతిరోజూ మధ్యాహ్న సమయానికి అందరూ తమతమ కుటుంబసభ్యులు, స్నేహితులతో నది వద్దకు చేరుకొని.. గాలి పటాలు ఎగురవేస్తారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి.. ఆత్మీయతను చాటుకుంటారు. వివిధ రకాల ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. మహిళలు గొబ్బెమ్మలు తయారు చేసి.. ప్రత్యేక పూజల అనంతరం వాటిని నదిలో నిమజ్జనం చేసి మొక్కులు తీర్చుకుంటారు. నీలకంఠేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

రాయి వేస్తే మేలు జరుగుతుందట..

అనకాపల్లి: విశాఖ జిల్లా అనకాపల్లి మండలంలోని ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద ప్రతి ఏటా కనుమ రోజున(ఈ నెల 16న) బౌద్ధ మేళా, బొజ్జన్న తీర్థం నిర్వహిస్తుంటారు. కనుమ రోజున జరిగే తీర్థంలో సుమారు లక్ష మంది భక్తులు పాల్గొంటారు. అదే రోజు ఉదయం దేశవిదేశాలకు చెందిన ప్రముఖ బౌద్ధ భిక్షవులు ఇక్కడకు విచ్చేసి బౌద్ధ మేళా నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి బొజ్జన్న తీర్థం ప్రారంభం అవుతుంది. చుట్టుపక్కల జిల్లాలతో పాటు సరిహద్దు రాష్ట్రాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఈ ఉత్సవంలో పాల్గొంటారు. ఈ కొండపై ఉన్న దంగోడు గొయ్యిలో రాయివేస్తే మేలు జరుగుతుందని సందర్శకుల విశ్వాసం.

విభిన్నం.. మన్యం సంక్రాంతి

పాడేరు: ఇక్కడి గిరిజనులు శంకు దేవుణ్ణి పూజిస్తారు. సంక్రాంతి సందర్భంగా గిరిజన గ్రామాల్లో ప్రత్యేకంగా జాతరలు జరుపుతుంటారు. వీటిలో భారీజం, గొట్టి పండుగలు ప్రత్యేకమైనవి. భారీజం పండుగ సందర్భంగా గ్రామస్తుంతా ఊరు వెలుపల ఉన్న ఖాళీ స్థలానికి వెళ్లి విచిత్ర వేషాధారణలతో ధింసా నృత్యాలు చేస్తారు. గొట్టి పండుగ సందర్భంగా తమకు అన్నం పెడుతున్న భూమిని పూజించి.. కొత్త బియ్యాన్ని సమీకరించి పొలంలో సహపంక్తి భోజనాలు చేస్తారు. అలాగే ఈ పండుగల సందర్భంగా గ్రామ సేవకులను ఎన్నుకొంటుంటారు.

అడ్డంగా దోచేసిన ఆర్టీసీ

- సంక్రాంతి పండుగ సీజన్‌లో ఆర్టీసీ వసూళ్ల జాతర
- 'ఫ్లెక్సీ ఫేర్'తో ఇష్టారాజ్యంగా టిక్కెట్ల చార్జీల పెంపు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిత్యం 75 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్‌ఆర్టీసీ) సంక్రాంతి సీజన్‌లో ఫక్తు వ్యాపార ధోరణిని ప్రదర్శించింది. ప్రయాణికుల అవసరాన్ని భారీగా సొమ్ము చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలతో పోటీ పడి మరీ ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేసింది. సంక్రాంతి పండుగను సొంత గ్రామాల్లో చేసుకుందామని బయలుదేరిన వారికి ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్ల రుసుములు చూసి కళ్లు బైర్లు కమ్మాయి. పండుగ నేపథ్యంలో 50 శాతం అదనంగా చార్జీలు పెంచిన విషయం తెలిసిందే. అయితే, ఈ అదనపు చార్జీలకు మించి మరింత ఎక్కువగా వసూళ్లు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు అందుతున్నాయి. హైదరాబాద్ నుంచి తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంతో పాటు పలు రాయలసీమ జిల్లాల రూట్లలో భారీగా దోపిడీ జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమానయాన సంస్థలు ప్రయాణికుల రద్దీని బట్టి ఫ్లెక్సీ ఫేర్ విధానంలో టిక్కెట్ల ధరలను నిర్ణయిస్తాయి. ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సైతం పండుగ సీజన్‌లో ఫ్లెక్సీ ఫేర్ విధానాన్ని అమలు చేసింది. దీనిప్రకారం నచ్చిన రేట్లను వసూలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. సంక్రాంతి ముగిశాక జనమంతా తిరుగు ప్రయాణమవుతారు. తిరుగు ప్రయాణంలోనూ డిమాండ్ ఉంటుంది కాబట్టి ఆర్టీసీ యాజమాన్యం టిక్కెట్ల ధరలను భారీగానే పెంచేసింది. ఈ మేరకు టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచింది.

రాయితీల ఊసేది?

ఏపీఎస్‌ఆర్టీసీ ప్రభుత్వ సంస్థ కాకుండా కార్పొరేషన్ కావడంతో మనుగడ కోసం సొంత ఆదాయంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. పండుగ సీజన్‌లో ప్రత్యేక బస్సులు నడపండి, ప్రయాణికుల జేబులు కొల్లగొట్టండి అని ఆర్టీసీ యాజమాన్యానికి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ప్రభుత్వం రాయితీలు ఇస్తే ప్రయాణికులపై అదనపు భారం పడదు. సాధారణంగా విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే అమరావతి ఏసీ సర్వీసులోచార్జీ రూ.808. ప్రత్యేక బస్సు పేరిట 50 శాతం అదనంగా, అంటే రూ.1,200కు పైగా వసూలు చేశారు. అన్ని ప్రధాన రూట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రైవేట్ ట్రావెల్స్‌దీ అదే దారి

ఆర్టీసీలో అధిక చార్జీలను సాకుగా చూపి ప్రైవేట్ ట్రావెల్స్ కూడా ప్రయాణికులను ఇష్టారీతిన దోచుకుంటున్నాయి. నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్నానికి రూ.3 వేలకు పైగా వసూలు చేశారంటే ప్రైవేట్ ట్రావెల్స్ ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. టిక్కెట్ ధరలను కట్టడి చేయాల్సిన ప్రభుత్వం ప్రైవేట్ ట్రావెల్స్‌తో కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కడపలో ఇద్దరు బంగ్లా దేశీయుల అరెస్ట్

వీరిలో ఒకరు అమెరికన్ డాలర్లు సగం ధరకిస్తామంటూ మోసగించిన బృందంలో సభ్యుడు



అరెస్టు వివరాలను తెలియజేస్తున్న ఎస్‌ఐ మోహన్

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లాలోని కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు బంగ్లా దేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరినీ మాతోవర్ తోఫిక్(30), మున్షి మహ్మద్ ఇస్లాం పింటో(26)లుగా గుర్తించినట్టు చిన్నచౌకు ఎస్‌ఐ మోహన్ ఆదివారం వెల్లడించారు. అమెరికన్ డాలర్లు సగం ధరకిస్తామంటూ ప్రజల్ని మోసగించే బృందంలో మాతోవర్ తోఫిక్ సభ్యుడని తెలిపారు. ఢిల్లీకి చెందిన కితాబ్ అలీ, అతని అనుచరులైన బంగ్లాదేశ్‌కు చెందిన మాతోవర్ తోఫిక్, అతని భార్య రేష్మా, అస్సాంకు చెందిన ఆలంఖాన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన అమీర్.. మొత్తం ఐదుగురు కలసి ముఠాగా ఏర్పడ్డారని, అమెరికన్ డాలర్లు సగం ధరకిస్తామని ప్రజల్ని నమ్మించి డబ్బులు తీసుకుని పారిపోతుండడం వీరి ప్రవృత్తి అని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ.. శంకరాపురానికి చెందిన ఆరీఫుల్లా నుంచి రూ.2.50 లక్షలు, దేవునికడపకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మల్లె నాగార్జునను మోసగించి రూ.1.50 లక్ష తీసుకుని పరారయ్యారని ఎస్‌ఐ తెలిపారు. మల్లె నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిని శనివారం కడప ఆర్టీసీ బస్టాండు వద్ద అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించామని, ఈ సందర్భంగా తోఫిక్‌తోపాటు పింటో పట్టుపడ్డారని, రేష్మా, అలంఖాన్, అమీర్, కితాబ్ అలీ పరారీలో ఉన్నారని చెప్పారు. కాగా, తోఫిక్‌తో కలసి ఉన్న పింటో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దొరకడంతో అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. మిగతా నిందితులకోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

'బెల్టు' జోలికి వెళ్లొద్దు

- ఎక్సైజ్ అధికారులకు టీడీపీ నేతల బెదిరింపులు
- బెల్టు షాపులు నిర్వహిస్తున్న మద్యం సిండికేట్లకు మంత్రుల అండ
- వారిపై కేసులు నమోదు చేయొద్దని ఆదేశాలు

సాక్షి, అమరావతి: సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో కూడా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో బెల్టు షాపులు నడుస్తున్నాయి. చివరకు మెడికల్ షాపుల్లో సైతం మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో బెల్టుషాపులపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులకు మద్యం వ్యాపారులు, అధికార పార్టీ నేతల నుంచి బెదిరింపులు తీవ్ర స్థాయిలో వస్తున్నాయి. మద్యం షాపులు, బెల్టు షాపుల జోలికి వెళ్లొద్దంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే బెదిరింపులకు దిగుతున్నారు. బెల్టు షాపులపై పలు జిల్లాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం శుక్రవారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. దీంతో అధికార పార్టీ నేతలు, మద్యం సిండికేట్లకు చిర్రెత్తుకొచ్చింది. 'మామూళ్లు ఇవ్వలేదనే దాడులు చేస్తున్నారంటూ ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేస్తాం.. తర్వాత మీ ఇష్టం' అంటూ ఎక్సైజ్ అధికారులను బెదిరించారు. ఫిర్యాదు ఆధారంగా తమను ఎక్కడ సస్పెండ్ చేస్తారోననే భయంతో అధికారులు సెలవుపై వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

ఆ షాపు వైపు చూస్తే తాట తీస్తా..

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం తిర్లంగి గ్రామంలోని ఓ పాన్ షాపులో బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. దీని వల్ల తమ గ్రామంలో శాంతి భద్రతల సమస్య ఏర్పడుతోందని ఆ గ్రామస్తులు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదుతో టాస్క్‌ఫోర్సు అధికారులు దాడి చేసి.. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. వీరికి ఎక్కడి నుంచి మద్యం సరఫరా అవుతుందో ఆరా తీసి సంబంధిత మద్యం షాపును సీజ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా.. వెంటనే శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ మంత్రి నుంచి వారికి ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆ మద్యం షాపుపై కేసు నమోదు చేస్తే తాట తీస్తానని ఆ మంత్రి బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. ప్రజల ఇబ్బందుల కన్నా మద్యం సిండికేట్ నిర్వాహకుడైన తన అనుచరుడి అక్రమ వ్యాపారమే ప్రధానమని ఆ మంత్రి బెదిరింపులకు దిగడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు షాక్‌కు గురయ్యారు.

ఎక్సైజ్ మంత్రి ఇలాకాలోనూ..

- ఎక్సైజ్ మంత్రి జవహర్ సొంత జిల్లా అయిన పశ్చిమగోదావరిలో సంక్రాంతి సీజన్‌లో బెల్టు షాపులు ఏర్పాటు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించారు. కొందరు రూ.లక్షల్లో వేలం పాడి బెల్టు షాపులు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో బెల్టు షాపుల జోలికొస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జిల్లాకు చెందిన వివాదాస్పద ఎమ్మెల్యే ఒకరు ఎక్సైజ్ అధికారులను బెదిరించినట్లు తెలిసింది.
- గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో బెల్టు షాపులు ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేశారు. చివరకు మెడికల్ షాపుల్లో సైతం మద్యం అమ్ముతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సీనియర్ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇక్కడ మద్యం దందా జరుగుతున్నట్లు తెలిసింది. కాగా, ఇక్కడి బెల్టు షాపులపై మహిళల నుంచి ఫిర్యాదులు రావడంతో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసేందుకు వెళ్లగా.. సీనియర్ ఎమ్మెల్యే వారిని తీవ్ర స్థాయిలో బెదిరించారు.
- చిత్తూరు జిల్లాలో బెల్టు షాపులు ఏర్పాటు చేసుకునేందుకు మద్యం సిండికేట్లు ఓ మంత్రిని ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఆ మంత్రి చూసీ చూడనట్లు వదిలేయాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

మార్జిన్ ఇవ్వట్లేదుగా..

మద్యం వ్యాపారం చేసినందుకు ప్రభుత్వం వ్యాపారులకు 7 శాతం మార్జిన్ ఇస్తుంటుంది. అంటే రూ.వంద మద్యం అమ్మితే వ్యాపారికి ఏడు రూపాయలు దక్కుతాయి. ఈ మార్జిన్ శాతం పెంచాలని వ్యాపారులు కోర్టుల్లో కేసులు వేశారు. దీన్ని కూడా టీడీపీ నేతలు తమకు అనుకూలంగా మార్చుకొని అధికారులను బెదిరిస్తున్నారు. మద్యం వ్యాపారులకు ప్రభుత్వం ఎక్కువ కమీషన్ ఇవ్వట్లేదని, అందువల్ల అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డు వెళ్లొద్దని ఎక్సైజ్ అధికారులను హెచ్చరిస్తున్నట్లు సమాచారం.



నారావారిపల్లెలో ఎడ్లబండి నడుపుతున్న బాలకృష్ణ



మనవడు దేవాన్ష్‌ను ధ్వజ స్తంభానికి మొక్కిస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు, పక్కన మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణ, ఈవో సింఘాల్

శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

ఇస్తికఫాల్ మర్యాదలతో స్వామి దర్శనం

సాక్షి, తిరుమల: సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం సకుటుంబ సపరివార సమేతంగా తిరుమలేశుని దర్శించుకున్నారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేష్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్, బావమరిది బాలకృష్ణ దంపతులు, ఇతర కుటుంబసభ్యులతో కలసి ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ మార్గం నుంచి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్నారు. అర్చకులు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్.. సీఎం చంద్రబాబుకు ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం పలికారు. తర్వాత ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. పచ్చకర్పూరపు వెలుగులో స్వామివారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మేల్‌ఛాట్ వస్త్రాన్ని సీఎంకు బహూ కరించారు. తర్వాత హుండీలో కానుకలు సమర్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వాదం ఇవ్వగా.. ఈవో సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు శ్రీవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు, నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ అందజేశారు.

వెంకన్న ఆశీస్సులతో పోలవరం పూర్తి చేస్తా

తిరుమలేశుని ఆశీస్సులతో పోలవరం పూర్తి చేసి.. తద్వారా నదుల అనుసంధానం చేస్తానని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీవారి దర్శనం తర్వాత ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, కరువు కాటకాలు రాకుండా, తుపాన్ల బారిన పడకుండా కాపాడాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సంపద, ఆనందంతోపాటు మెరుగైన జీవన ప్రమాణాలివ్వాలని కోరుకున్నానన్నారు. త్వరలోనే టీటీడీ ధర్మకర్తల మండలిని నియమిస్తానని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. చంద్రబాబు మీడియాతో మాట్లాడుతున్న సమయంలో బాలకృష్ణ సమీపంలోకి వెళ్లడాన్ని చూసిన అభిమానులు ''జైజై బాలయ్యా...జైసింహా'' అంటూ నినాదాలు చేశారు. వారిని అక్కడున్న సిబ్బంది వారించారు.

సీలేరులో మరో జలవిద్యుత్ కేంద్రం!

- వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే యోచన
- పాత ప్లాంట్లలో తరచూ మొరాయిస్తున్న యంత్రాలు
- నీరు సమృద్ధిగా ఉన్నా విద్యుదుత్పత్తికి ఆటంకాలు
- పీపీపీతో కొత్త కేంద్రం నిర్మాణంపై జెన్‌కో పరిశీలన

సాక్షి, అమరావతి: విశాఖ జిల్లా సీలేరు పరసర ప్రాంతాల్లో కొత్తగా వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో మరో జల విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఏపీజెన్‌కో ఏర్పాట్లు చేస్తోంది. ప్రాథమిక సర్వే ఇప్పటికే పూర్తయింది. సీలేరు – డొంకరాయి మధ్యలో దీన్ని ఏర్పాటు చేయవచ్చని విశ్వసనీయ సమాచారం.

దశాబ్దాల నాటి ప్లాంట్లతో సమస్యలు

జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను జెన్‌కో ఉన్నతాధికారుల బృందం ఇటీవల పరిశీలించింది. సీలేరు, డొంకరాయి ప్రాంతాల్లో ఏపీ జెన్‌కోకు ఇప్పటికే జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. దశాబ్దాల క్రితం నెలకొల్పిన ఈ ప్లాంట్ల సామర్థ్యం 60 మెగావాట్లలోపే ఉంది. వీటి యంత్రాలు అరిగిపోయి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మాచ్‌ఖండ్‌లోని అంతరాష్ట్ర జల విద్యుత్ కేంద్రంలోనూ ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి ఒడిశా సహకారం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి ప్రాంతాల్లో నీరు పుష్కలంగా ఉన్నా తగినంత విద్యుత్ ఉత్పత్తి కావటం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త జల విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జెన్‌కో భావిస్తోంది. పోలవరంపై 960 మెగావాట్లతో నిర్మించే జల విద్యుత్ కేంద్రం టెండర్లు కూడా ఇప్పటికే ఖరారయ్యాయి.

పీపీపీ విధానంలో టెండర్లు!

సీలేరు వద్ద వెయ్యి మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించాలనే ప్రతిపాదనను జెన్‌కో పరిశీలిస్తోంది. ఇటీవల ఉన్నతాధికారులు ఈ అంశంపై చర్చించారు. ప్రాజెక్టుకు కనీసం రూ .5 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీన్ని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశం ఉందని, నిర్వహణ సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అయితే ప్రైవేట్ భాగస్వామ్యం వల్ల ప్రాజెక్టు నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుందని సాంకేతిక, ఆర్థిక నిపుణుల బృందం జెన్‌కో దృష్టికి తెచ్చింది.

యూనిట్ విద్యుత్తు రూ.3!

సాధారణంగా జల విద్యుత్ యూనిట్‌కు రూ.1.90కే లభిస్తుంది. కానీ ప్రైవేట్ భాగస్వామ్యం వల్ల ఇది రూ.3కి చేరే వీలుందని, పైగా జెన్‌కో చేతుల్లోంచి కీలకమైన ఓ విద్యుత్ కేంద్రం చేజారుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

భారతీయులు సోదర భావంతో మెలగాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



భోగిమంట వద్ద ఉపరాష్ట్రపతి వెంకయ్య దంపతులు

వెంకటాచలం: భారతీయులు సోదరభావంతో మెలగాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటలు వేయించారు. సాయంత్రం సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయంలో గాలి పటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు. సమాజంలో వెనుకబడిన వారికి చేయూతనిచ్చే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సతీమణి ఎం.ఉషమ్మ, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

జల్లికట్టులో 50 మందికి గాయాలు

సాక్షి, చెన్నై: తమిళనాడు ప్రజలు సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మదురై అవనియపురంలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో గత రెండేళ్లుగా సంక్రాంతి రోజున జల్లికట్టు ఏర్పాటు చేయడం లేదు. గత ఏడాది మహా ఉద్యమంతో జల్లికట్టును మళ్లీ సాధించుకున్నారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా అవనియపురంలో 900 ఎద్దులు, 600 మంది క్రీడాకారులు జల్లికట్టులో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 50 మంది యువకులు గాయపడ్డారు. విజేతలకు సైకిల్, మంచం, బంగారు, వెండి నాణేలను అందజేశారు. ఈ కార్యక్రమం కలెక్టర్ వీరరాఘవ రావు పర్యవేక్షణలో నిర్వహించారు. కాగా సోమవారం ప్రపంచ ప్రసిద్ధి కాంచిన మదురై అలంగనల్లూరులో జల్లికట్టు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎడ్లబండ్ల పోటీల విజేత ప్రకాశం జిల్లా



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కోవూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం కొత్తూరులో ఆదివారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీల్లో ప్రకాశం జిల్లా ఎడ్లబండి విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 35 జట్లు పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా జె.పంగులూరు ప్రాంతానికి చెందిన పెండ్యాల రాంబాబు ఎడ్లబండి మూడు కిలో మీటర్లను 7.03 నిమిషాల్లో లక్ష్యం సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఈ పోటీలను ప్రముఖ పారిశ్రామికవేత్తలు అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి, సన్నపరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వేమారెడ్డి శైలేంద్రరెడ్డి, కోవూరు జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డి, శివుని నరసింహులురెడ్డి ప్రారంభించారు. వరుసగా ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్లబండ్ల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లాకు చెందిన పెండ్యాల రాంబాబుకు రూ.20,116తోపాటు కప్పును అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా కంకటపాళెం ప్రాంతానికి చెందిన పోలేరమ్మతల్లి ఎడ్లబండి 7.15 నిమిషాల్లో గమ్యం స్థానం చేరుకుంది. ఈ ఎడ్లబండి యజమానికి రూ.16,116, మూడో స్థానంలో నిలిచిన నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం యల్లాయపాళేనికి చెందిన సయ్యద్ రంజిత్ ఎడ్లబండికి రూ.12,116 అందజేశారు.

పొగమంచుతో విశాఖలో విమానాలకు అంతరాయం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విశాఖపట్నంలో ఆదివారం విపరీతంగా అలుముకున్న పొగమంచు విమానాల రాకపోకలపై ప్రభావం చూపింది. పొగమంచు కారణంగా విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో దుబాయ్ విమానం దిగలేకపోయింది. దుబాయ్ నుంచి ఎయిరిండియా విమానం ఆదివారం ఉదయం ఏడుగంటలకు విశాఖ చేరుకుంది. దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో విమానాశ్రయంలో దిగడానికి వీల్లేకపోయింది. దీంతో విశాఖ చుట్టూ 15సార్లు చక్కర్లు కొట్టింది. అయినప్పటికీ వాతావరణం అనుకూలించనందున అధికారులు భువనేశ్వర్‌కు వెళ్లిరావాలని సంకేతాలిచ్చారు. దీంతో విమానం భువనేశ్వర్ విమానాశ్రయానికి వెళ్లింది.

సంక్రాంతి వేళ చిన్నారులతో..







శెట్టివారిపల్లి క్రాస్, చల్లావారిపల్లి వద్ద చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్



నెన్నూరు వద్ద జగన్‌తో సెల్ఫీ దిగుతున్న చిన్నారి





శెట్టివారిపల్లి క్రాస్, పులిగుంట వద్ద చిన్నారులను ముద్దాడుతున్న జననేత

ప్రజాసంకల్ప యాత్ర
62 రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
849.5 కి.మీ

62వ రోజు నడిచిన దూరం
7.8 కి.మీ

ప్రారంభం: ఉ. 8.30 గంటలకు, నెన్నూరు బస నుంచి

ముగింపు: మ. 12.30 గంటలకు, రావిళ్లవారిపల్లె శివారు

ముఖ్యాంశాలు

నెన్నూరు, శెట్టివారిపల్లి క్రాస్, కట్టకింద వెంకటాపురం, వెంకటాపురం క్రాస్, చల్లావారిపల్లి, సొరకాయలపాలెం క్రాస్, మద్దూరుపల్లి, పులికుంట, కమ్మపల్లి క్రాస్, దేశూరికండ్రిగ, రావిళ్లవారిపల్లె, పారకాల్వక్రాస్ గ్రామాల్లో పాదయాత్ర, జనంతో మమేకం.

సంక్రాంతి పండగ సందర్భంగా నేడు పాదయాత్రకు విరామం



నెన్నూరు వద్ద జగన్‌కు బొకే ఇచ్చి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న యువకుడు



శెట్టివారిపల్లి క్రాస్ వద్ద అక్కచెల్లెమ్మలు, అవ్వలకు అభివాదం చేస్తున్న వైఎస్.జగన్



కట్టకింద వెంకటాపురంలో సంప్రదాయ నృత్యాలు చేస్తున్న అవ్వలు, అక్కచెల్లెమ్మలు

దారులన్నీ కిటకిట..

జగన్‌కు బాసట

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ప్రజలకు భరోసా కల్పించేందుకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర విజయవంతంగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో నెన్నూరు శివారు నుంచి యాత్రను ప్రారంభించి శెట్టివారిపల్లి క్రాస్, దేశూరి కండ్రిగ, రావిళ్లవారిపల్లె శివారు పారకాల్వ క్రాస్‌కు జననేత చేరుకున్నారు. యాత్ర పొడవునా ప్రజలు మేళతాళాలు, డప్పులు, బాణాసంచా పేలుళ్లతో ఎదురేగి స్వాగతం పలికి మంగళహారతులు పట్టారు. జగన్‌తో సెల్ఫీల కోసం పోటీ పడ్డారు. 'మా పెద్ద కొడుకు మా ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉంది' అని పెద్దలు ముచ్చటపడ్డారు. ఒకవైపు పండుగ ఉన్నా జనంతో దారులన్నీ కిటకిటలాడాయి.

ఆ బిడ్డను చూడనివ్వండి..

ప్రతి ఒక్కరూ జగన్‌ను చూసేందుకు, కరచాలనం చేసేందుకు పోటీపడుతున్నారు. పాదయాత్ర సొరకాయలపాలెం క్రాస్‌కు చేరుకున్నప్పుడు రోడ్డు పక్క కుర్చీలో కూర్చున్న ఓ పెద్దామె అందరిపై కేకలు వేస్తూ 'నేనేం పెన్షన్ కోసం రాలా, ఆ బిడ్డను చూడనివ్వండి, అడ్డు లేవండి' అంటూ పైకి లేచేందుకు ప్రయత్నించిన తీరు ఆయన పట్ల వ్యక్తమవుతున్న ఆదరాభిమానాలకు నిదర్శనం. కొందరు యువతులు ఆయనను కలిసి తాము దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులు చదువుకున్నామని వివరించారు. పిల్లల చదువు కోసం జగన్ తన నవరత్నాల్లో ఓ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని హర్షించారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆర్తులు, అన్నార్తులకు జగన్ గొంతుక కావాలని పలువురు ఆకాంక్షించారు. అనేక సాకులు చూపి పెన్షన్లు తీసేస్తున్నారని బాధితులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జగన్ వెంట ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీలు వేణుంబాక విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వరప్రసాద్ తదితర నేతలు ఉన్నారు.

నేడు సంక్రాంతి సందర్భంగా పాదయాత్రకు విరామం..

నేడు సంక్రాంతి సందర్భంగా పాదయాత్రకు విరామం ప్రకటించారు. పారకాల్వ క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన తన శిబిరంలోనే జగన్ సంక్రాంతిని జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజులుగా జలుబు, దగ్గుతో బాధపడుతున్నా పట్టించుకోకుండా పాదయాత్ర చేస్తున్న జగన్‌ను పరామర్శించేందుకు ఆయన సతీమణి భారతీరెడ్డి ఆదివారం మధ్యాహ్నం పారకాల్వ క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి వచ్చారు.



శెట్టివారిపల్లి క్రాస్ వద్ద దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న ప్రతిపక్ష నేత



చల్లావారిపల్లి వద్ద వైఎస్.జగన్‌తో సెల్ఫీ దిగుతున్న అక్కచెల్లెమ్మలు



దేశూరి కండ్రిగ వద్ద జగన్‌ను శాలువాతో సన్మానిస్తున్న అన్నమయ్య వంశీకులు




కమ్మపల్లి వద్ద జగన్‌తో పాటు అడుగులేస్తున్న ముస్లిం సోదరి, చిన్నారులు



పులిగుంట వద్ద తన కష్టాలు చెప్పుకొని కన్నీరు పెట్టుకున్న అవ్వను ఓదార్చుతున్న జననేత వైఎస్ జగన్

62వ రోజు

14-01-2018, ఆదివారం
రావిళ్లవారిపల్లె శివారు,
చిత్తూరు జిల్లా.



ఈ ఆత్మీయతలే నన్ను నడిపిస్తున్నాయి..

ప్రపంచంలోని తెలుగువారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ప్రజలందరూ భోగభాగ్యాలతో, సిరిసంపదలతో విలసిల్లాలి. సుఖసంతోషాలతో జీవించాలి. ఈ సంక్రాంతి.. అందరి జీవితాలలో కాంతిని నింపాలి.

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడూ ఉన్నత చదువులు చదవాలి' అని నాన్నగారు అనేవారు. ఆయన కలలకు ప్రతిరూపమైన ఓ సంఘటన ఈ రోజు ఎదురైంది. అడపారెడ్డిపల్లికి చెందిన తులసి, కీర్తి అనే అక్కచెల్లెళ్లు 'అన్నా.. మీ నాన్నగారు ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో మేము, మా తమ్ముడు.. ముగ్గురం ఎంటెక్ చదివాం. చాలా థ్యాంక్స్ అన్నా' అన్నారు. నాన్నగారిపై ఉన్న అదే కృతజ్ఞతాభావాన్ని నాపై ప్రదర్శించడాన్ని చూసి చలించిపోయాను. అంతేగాక నా చేతికి రక్షాబంధన్ కట్టి 'అన్నా.. మీ ఆరోగ్యం జాగ్రత్త. మీరు బాగుంటేనే మేమంతా బాగుంటాం' అని అనడం నా హృదయాన్ని తాకింది. ఈ ఆత్మీయతలే నన్ను ఉత్సాహంతో నడిపిస్తున్నాయి. ఈ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొందరు మార్క్సిస్టు విశ్లేషకులు సైతం 'ఇంతకు మించిన సోషలిజం ఏముంటుంది..' అని ప్రశంసించారు. పిల్లలు ఎంత బాగా చదువు కోగలిగితే.. భావితరాలకు పునాది అంత పటిష్టంగా ఉంటుంది.

కాస్త దూరం నడిచాక ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలలో పనిచేసే అధ్యాపక సంఘం నేతలు కలిశారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు వేతనాల నుంచి సౌకర్యాల వరకు తమ హక్కుల్ని కాలరాస్తున్నాయని, పని ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని, వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకుల స్థితిగతులను మెరుగుపరచడంతోపాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్ర మానసిక ఒత్తిళ్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దారిలో సుజాత అనే ఒక అక్క 'అన్నా.. పండగ కోసం హైదరాబాద్ నుంచి వచ్చాం. కానీ, ఆ సంతోషమే లేదు' అంది. ఏమైంది అక్కా.. అని అడిగాను. 'హైదరాబాద్ నుంచి రావడానికి బస్సు చార్జీ ఒక్కొక్కరికి రూ.2,300 పెట్టాం.. ఇంతగా రేట్లు పెంచేస్తే ఇక గవర్నమెంటుకు, ప్రైవేటు కంపెనీకి తేడా ఏముందన్నా..' అని అంది. పల్లెసీమల ప్రజల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటే, పండుగ సందర్భంగా ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ప్రజలకు తోడ్పాటునిచ్చి, ధరలను తగ్గించి, సంతోషంగా పండగ జరుపుకొనే పరిస్థితులను కల్పించాల్సింది పోయి.. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వమే ఆర్టీసీ చార్జీలను పెంచడమే కాకుండా, ప్రైవేటు ఆపరేటర్లకు కొమ్ముకాయడం, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రయత్నించకపోవడం ఎంత వరకు సమంజసం?

వైయస్. జగన్.

ప్రజాసంకల్ప యాత్రపై 17న వైఎస్సార్‌సీపీ నేతల భేటీ

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రపై చర్చించడానికి 17న నెల్లూరులో పార్టీ నేతలు సమావేశం కానున్నారు. నెల్లూరు పార్లమెంటరీ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో జిల్లాలో జగన్ పాదయాత్ర మార్గాన్ని ఖరారు చేస్తారు. జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఈ సమావేశానికి హాజరై జిల్లాలో పాదయాత్ర పూర్తయ్యే వరకూ తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేస్తారు. మొత్తం పది నియోజకవర్గాలకు గాను 9 నియోజకవర్గాల్లో యాత్ర సాగే అవకాశం ఉందని పార్టీ నేతలంటున్నారు. 21 తర్వాత ఒకట్రెండు రోజుల్లో ఎప్పుడైనా జిల్లా సరిహద్దుల్లోకి ప్రవేశించవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి.

సవరణ

ఆదివారం నాడు ప్రచురితమైన ప్రజా సంకల్ప యాత్ర డైరీలో రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు 9 లక్షల మందికిపైగా.. అని పొరపాటుగా ప్రచురితమైంది. దానిని 19 లక్షల మందికి పైగా.. అని చదువుకోగలరు.

'చంద్రగిరి'లో ఆ ఇద్దరు

- సంక్రాంతి వేడుకలకు సీఎం చంద్రబాబు
- ప్రజా సంకల్ప యాత్రలో ప్రతిపక్ష నేత జగన్

ప్రజాసంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం సంక్రాంతి సందర్భంగా అరుదైన సంఘటనకు వేదికైంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తోన్న ఇద్దరు ముఖ్య నేతలు ఒకే రోజున ఒకే నియోజకవర్గంలో కొలువు తీరారు. సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన స్వగ్రామం నారావారిపల్లికు చేరుకున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన వైఎస్సార్‌సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారకాల్వ క్రాస్‌కు చేరుకున్నారు. చంద్రబాబు నారావారిపల్లికి రెండు రోజుల ముందుగానే వచ్చారు. ఆయన ఆదివారం ఉదయం భోగి వేడుకలు చేసుకుని నేడు కుటుంబసమేతంగా సంక్రాంతి సంబరాలు చేసుకోనున్నారు. మరోవైపు పాదయాత్ర చేస్తున్న ప్రతిపక్ష నేత జగన్ గత నాలుగు రోజులుగా చంద్రగిరి నియోజకవర్గంలో జనంతో మమేకమవుతున్నారు. భోగి రోజున సైతం పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో తమకోసం జగన్ వచ్చారని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



మకర సంక్రాంతి సందర్భంగా ఆదివారం మైసూర్‌లో నిర్వహించిన పోటీలో ఎద్దులతో పాటు మంటలను దాటుతున్న యువకులు.

'మమ్మల్ని వేధించొద్దు ప్లీజ్!'

మా నాన్నది సహజమరణమే: లోయా కుమారుడి ఆవేదన



ముంబై: సంచలనం రేకెత్తించిన గ్యాంగ్‌స్టర్ సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సమయంలోనే గుండెపోటుతో ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతి చెందటంపై ఎలాంటి అనుమానాల్లేవని ఆయన కుటుంసభ్యులు వెల్లడించారు. మొదట్లో అనుమానాస్పదంగా అనిపించినా తర్వాత అది సహజమరణమేనని తేలిందని లోయా కుమారుడు అనుజ్ (21) ఆదివారం ముంబైలో పేర్కొన్నారు. 'మా నాన్న సహజ కారణాలతోనే కన్నుమూశారు. మా కుటుంబం మొదట్లో అనుమానం వ్యక్తం చేసినా తర్వాత అది సహజమరణమేనని నిర్ధారణకు వచ్చింది. ఈ విషయంలో మేం స్పష్టంగా ఉన్నాం. నాన్న మృతిపై తాజాగా నెలకొన్న పరిస్థితులు బాధ కలిగించాయి. కొన్ని ఎన్జీవోలు, రాజకీయ నాయకులను కోరుతున్నా.. దయచేసి మమ్మల్ని వేధించటం ఇక ఆపండి' అని అనూజ్ కోరారు. సుప్రీంకోర్టులో సీజేఐపై తిరుగుబాటు ప్రకటించిన నలుగురు న్యాయమూర్తులు.. సీబీఐ న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతిపై విచారణ జరపాలనే డిమాండ్ నేపథ్యంలో దీనిపై చర్చ జరుగుతోంది.

గుజరాత్‌లో 'పద్మావత్' విడుదలపై నిషేధం

అహ్మదాబాద్: 'పద్మావత్' సినిమా విడుదలపై గుజరాత్ ప్రభుత్వం నిషేధం విధించింది. శాంతిభద్రతలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోంమంత్రి ప్రదీప్ సింహ్ తెలిపారు. గత ఏడాది ఎన్నికల సమయంలోనే 'పద్మావతి' పేరుతో ఉన్న ఈ సినిమాను గుజరాత్ ప్రభుత్వం నిషేధించింది. సినిమా పేరును మార్చినా నిషేధం కొనసాగుతుందని గుజరాత్ సీఎం రూపానీ ఇంతకుముందే ప్రకటించారు.

రైల్వే క్లాక్‌రూమ్, లాకర్ల ఫీజు పెంపు!



న్యూఢిల్లీ: రైల్వే ప్రయాణికులు లగేజీని భద్రపరచుకునే క్లాక్‌రూములు, లాకర్ల ఫీజులను పెంచేందుకు రైల్వేశాఖ అంగీకరించింది. ఫీజుల్ని పెంచే అధికారాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ల(డీఆర్ఎం)కు కట్టబెట్టింది. ఈ సేవల ఆధునీకరణకు త్వరలో బిడ్లు ఆహ్వానించనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ కొత్త విధానంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఫీజుల్ని పెంచే అధికారం డీఆర్ఎంలకు ఉంటుంది. లగేజీని గరిష్టంగా నెలరోజుల పాటు భద్రపరుస్తామని, కొత్త విధానాన్ని తొలుత 'ఏ' క్లాస్ రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 24 గంటల పాటు వస్తువుల్ని భద్రపరిచేందుకు క్లాక్ రూమ్‌కు రూ.15, లాకర్‌కు రూ.20 వసూలు చేస్తున్నారు.

'ఉన్నత నియామకాల'కు ఐబీ పరిశీలన

న్యూఢిల్లీ: సెబీ, ట్రాయ్ తదితర ప్రభుత్వ నియంత్రణ సంస్థలు, ట్రిబ్యునళ్లలో ఉన్నత స్థాయి పదవుల్లో నియమితులయ్యే వ్యక్తులు ముందుగా ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరిశీలనను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ మేరకు సిబ్బంది మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నియంత్రణ సంస్థలు, ట్రిబ్యునళ్లలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ సహా అన్ని ఇతర కీలక, ఉన్నత స్థాయి పదవుల్లో నియామకాలకు ఐబీ పరిశీలన తప్పనిసరని సిబ్బంది మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

క్షిపణి హెచ్చరికలతో హవాయిలో కలకలం!

వాషింగ్టన్: ఉత్తరకొరియా నుంచి ఖండాంతర క్షిపణి దూసుకొస్తోందనీ, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని మొబైల్స్‌కు సందేశాలు రావడంతో అమెరికాలోని హవాయి రాష్ట్ర ప్రజలు వణికిపోయారు. ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులు తీశారు. ఇదంతా ఓ ఉద్యోగి తప్పిదమని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. 'ఓ ఖండాంతర క్షిపణి హవాయి వైపు దూసుకొస్తోంది. వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లండి' అని మొబైల్స్‌కే కాకుండా టీవీ, రేడియో కేంద్రాలకూ శనివారం సందేశాలు అందాయి. దీంతో పలువురు రెస్టారెంట్లు, హోటళ్ల బేస్‌మెంట్లలో దాక్కుని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. 10 నిమిషాల అనంతరం ఇది పొరపాటున వచ్చిన హెచ్చరికని అధికారులు వివరణ ఇచ్చారు. ఓ ఉద్యోగి పొరపాటున హెచ్చరిక బటన్‌ను నొక్కాడని హవాయి గవర్నర్ డేవిడ్ ఇగ్ తెలిపారు.

సైనిక-రాజకీయ పద్ధతిలో శాంతి స్థాపన



న్యూఢిల్లీ: కశ్మీర్‌లో శాంతి స్థాపన కోసం మిలిటరీ కార్యకలాపాలు, రాజకీయ ప్రయత్నాలు సమన్వయంతో కొనసాగాలని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ అన్నారు. పాక్ సైన్యం పట్ల మన సైనికులు మరింత దూకుడుగా వ్యవహరిస్తే సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితి మెరుగవ్వాలంటే జమ్మూకశ్మీర్‌లోని మన సైన్యం చేతులు ముడుచుకుని కూర్చోకుండా, కొత్త ఎత్తుగడలు, వ్యూహాలను రచించాల్సి ఉందని పీటీఐ ఇంటర్వ్యూలో రావత్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం స్థానికుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి రాజకీయంగా చేయగలిగినదంతా చేయాలని సూచించారు.

అలాంటి ముస్లింలే ఇక్కడ ఉంటారు..!

బల్లియా: భారత్ హిందూ దేశంగా మారాక హిందూ సంస్కృతిలో భాగంగా మారే ముస్లింలే ఇక్కడ ఉంటారని బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 నాటికి భారత్ హిందూదేశంగా మారుతుందని జోస్యం చెప్పారు. అప్పుడిక హిందూ సంస్కృతి నచ్చని ముస్లింలు ఇష్టం వచ్చిన దేశానికి వెళ్లిపోవచ్చని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని అవతార పురుషుడిగా ఆయన అభివర్ణించారు.

'ఆరెంజ్ పాస్‌పోర్ట్'.. బీజేపీ వివక్షే: రాహుల్



న్యూఢిల్లీ: ఇమిగ్రేషన్ చెక్ అవసరం ఉన్న పాస్‌పోర్ట్ హోల్డర్లకు ఆరెంజ్ రంగు పాస్‌పోర్టు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. బీజేపీ వివక్షాపూరిత ఆలోచనా ధోరణిని ఇది సూచిస్తోందని విమర్శించారు. 'వలస కార్మికులను రెండో తరగతి పౌరులుగా బీజేపీ పరిగణించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ చర్యలు బీజేపీ వివక్షాపూరిత ఆలోచన ధోరణిని సూచిస్తున్నాయి' అని ధ్వజమెత్తారు.

హర్యానాలో ఇద్దరు దళిత బాలికల రేప్, హత్య

చండీగఢ్: హర్యానాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దళిత బాలికలు అత్యాచారానికి, దారుణహత్యకు గురయ్యారు. కురుక్షేత్ర జిల్లాకు చెందిన ఓ బాలిక(15) పదో తరగతి చదువుకుంటోంది. గత మంగళవారం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి రాలేదు. గుర్తు తెలియని దుండగులు ఆమెపై అత్యాచారం చేసి అనంతరం శరీర భాగాలను ఛిద్రం చేసి కాల్వలో పడేశారు. ఈ ఘటనపై విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పానిపట్ జిల్లాకు చెందిన ఓ బాలిక(11) శుక్రవారం సాయంత్రం చెత్తను పారేసేందుకు బయటకు వెళ్లగా కొందరు ఆమెను ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఉరివేసి చంపారు. ఈ ఘటనలో మృతురాలి పొరుగింట్లో ఉండే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

త్వరలోనే సర్దుకుంటుంది!

బార్ కౌన్సిల్ కమిటీతో సీజేఐ దీపక్ మిశ్రా

- తిరుగుబాటు న్యాయమూర్తులతోనూ బీసీఐ కమిటీ భేటీ
- 2–3 రోజుల్లో సాధారణ స్థితి నెలకొంటుందని ఆశాభావం
- ఇరువర్గాలతో చర్చలు జరిపిన జస్టిస్ నాగేశ్వరరావు, జస్టిస్ బాబ్డే
- తిరుగుబాటు జడ్జీలు కరెక్టే: సీజేఐకి నలుగురు రిటైర్డ్ జడ్జీల లేఖ



సీజేఐ దీపక్ మిశ్రా (ఫైల్)





సీజేఐతో సమావేశం తరువాత తిరిగివెళ్తున్న వికాస్ సింగ్, మన్ కుమార్ మిశ్రా

న్యూఢిల్లీ: భారత న్యాయవ్యవస్థలో ఏర్పడిన సంక్షోభం త్వరలోనే సమసిపోతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్రా స్పష్టం చేశారు. వివాదం నేపథ్యంలో తనను కలిసిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఏడుగురు సభ్యుల కమిటీకి సీజేఐ ఈవిధమైన భరోసా ఇచ్చారు. సానుకూల వాతావరణంలో జరిగిన ఈ చర్చల అనంతరం వివాదం 2–3 రోజుల్లో సమసిపోతుందనే భరోసా కలిగిందని బీసీఐ కమిటీ చైర్మన్ మన్ కుమార్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. అంతకుముందు ఈ కమిటీ... తిరుగుబాటు చేసిన న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతోనూ సమావేశమైంది. వారు కూడా వివాదం తొందరగానే పరిష్కారమవుతుందని అభిప్రాయపడ్డారన్నారు. మరోవైపు, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ కూడా సీజేఐని కలిశారు. అటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఎస్ఏ బాబ్డేలు కూడా సీజేఐ, జస్టిస్ చలమేశ్వర్‌లతో సంప్రదింపులు జరిపారు. సుప్రీంకోర్టులో కేసుల పంపకం రోస్టర్ విధానంలో జరగటం లేదంటూ సీజేఐ తీరుకు నిరసనగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు తిరుగుబాటు ప్రకటించిన సంగతి తెలిసిందే.

రెండు మూడు రోజుల్లో: బీసీఐ

చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతోపాటు జస్టిస్ చలమేశ్వర్, ఇతర న్యాయమూర్తులతో బీసీఐ కమిటీ ఆదివారం వేర్వేరుగా భేటీ అయింది. ఈ సమావేశాల అనంతరం బీసీఐ చైర్మన్ మన్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. 'సుప్రీంకోర్టులో ఎలాంటి సంక్షోభం లేదు. ఇది కేవలం అంతర్గత విషయమే. ఈ సమావేశాల అనంతరం వివాదం త్వరలోనే పరిష్కారం అవుతుందనే నమ్మకం కుదిరింది. సీజేఐతో 50 నిమిషాల సేపు సానుకూల వాతావరణంలో భేటీ జరిగింది. ఇది తీవ్రమైన సమస్యేమీ కాదు. అంతా సర్దుకుంటుంది. ఈ వివాద పరిష్కారంలో బీసీఐ పాత్ర పరిమితమే. న్యాయమూర్తులు కూడా సమస్యేమీ లేదని పేర్కొన్నారు. 2–3 రోజుల్లో అంతా సర్దుకుంటుంది' అని పేర్కొన్నారు. కొందరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఢిల్లీకి దూరంగా ఉన్నందున రెండ్రోజుల్లో వీరందరితోనూ భేటీ అవుతామన్నారు. అనంతరం జస్టిస్ అరుణ్ మిశ్రాతో సమావేశమైన బీసీఐ కమిటీ.. ప్రత్యేక సీబీఐ న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతిపై దాఖలైన పిల్‌పై విచారణ జరపాలని కోరింది. జస్టిస్ అరుణ్ మిశ్రాకు లోయా కేసును బదిలీ చేయటాన్నీ తిరుగుబాటు జడ్జీలు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

వారి ప్రెస్‌మీట్ దురదృష్టకరం

న్యాయమూర్తులు, సీజేఐ మధ్య నెలకొన్న వివాదం త్వరలోనే పరిష్కారమవుతుందని ఢిల్లీ బార్ అసోసియేషన్స్ (ఢిల్లీలోని ఆరు జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘాలు) సమన్వయ కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. న్యాయమూర్తులు ప్రెస్‌మీట్ పెట్టడం సరైంది కాదని భావిస్తున్నట్లు తెలిపిన కమిటీ.. ఈ వివాదం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కాస్త తగ్గిందని అభిప్రాయపడింది. అందుకే ఎట్టిపరిస్థితుల్లోనూ న్యాయపరమైన క్రమశిక్షణను కొనసాగించాలని పేర్కొంది. 10 రోజుల్లో అందరూ కలిసి సమస్యను పరిష్కరించుకోలేని పక్షంలో మిగిలిన నగరాల్లో ఉన్న బార్ అసోసియేషన్లతో చర్చించి.. దేశవ్యాప్తంగా వీధుల్లో నిరసన ప్రదర్శనలను నిర్వహిస్తామని హెచ్చరించింది. 'అంతర్గత వివాదాలను పరిష్కరించుకునేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలి. ఇలాంటి వివాదాలను నిరోధించేందుకు జ్యుడీషియల్ అకౌంటబిలిటీ బిల్లును తీసుకురావాలి. సీజేఐ సభను ఆర్డర్‌లో పెట్టుకోవాలి. సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలను తక్షణమే పరిష్కరించాలి' అని కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది.

సీజేఐతో ఎస్‌సీబీఏ అధ్యక్షుడి భేటీ

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ ఆదివారం సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాతో సమావేశమయ్యారు. సంక్షోభ పరిష్కారం కోసం ఎస్‌సీబీఏ రూపొందించిన తీర్మానాన్ని సీజేఐకి అందజేశారు. సుప్రీంకోర్టులోని అందరు న్యాయమూర్తులు ఈ తీర్మానానికి సమ్మతించారని.. వికాస్ సింగ్ పేర్కొన్నారు. ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పీఐఎల్), పెండింగ్ పిల్‌లను సీజేఐ నేరుగా విచారించాలని, లేదంటే కొలీజియం వ్యవస్థలోని నలుగురు సీనియర్ న్యాయమూర్తుల ధర్మాసనానికి అప్పగించాలని ఎస్‌సీబీఏ శనివారం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సీజేఐ సానుకూలంగా స్పందించారని వికాస్ వెల్లడించారు.

సమంజసమే: మాజీ జడ్జీల లేఖ

ఓ సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సహా ఐదుగురు రిటైర్డ్ న్యాయమూర్తులు సీజేఐకి బహిరంగ లేఖ రాశారు. నలుగురు తిరుగుబాటు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు సమంజసమేనని.. వీటిని త్వరలోనే పరిష్కరించుకోవాలని ఆ లేఖలో కోరారు. మాజీ సుప్రీం న్యాయమూర్తి పీబీ సావంత్, ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఏపీ షా, మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె. చంద్రు, బాంబే హైకోర్టు మాజీ జడ్జి హెచ్ సురేశ్ ఈ లేఖను రాశారు. ఈ వివాదం పరిష్కారమయ్యేంత వరకు ముఖ్యమైన కేసులను ఐదుగురు సీనియర్ న్యాయమూర్తుల ధర్మాసనానికి బదిలీ చేయాలని కోరారు. 'రోస్టర్, కేసుల పంపకంలో సీజేఐ నిర్ణయమే అంతిమం. కానీ.. సున్నితమైన, ముఖ్యమైన కేసులను జూనియర్ న్యాయమూర్తులున్న ధర్మాసనాలకు ఇవ్వటం సరికాదు. వివాదాన్ని వెంటనే పరిష్కరించుకుని.. కేసుల పంపకానికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలను రూపొందించుకోవాల్సిన తక్షణ అవసరం ఉంది' అని ఆ లేఖలో వారు పేర్కొన్నారు.

గెలవలేమని తెలిసే...

'ఈ నలుగురు న్యాయమూర్తులు తాము లేవనెత్తిన అంశాలను నెగ్గించుకోవాలంటే.. ఫుల్‌కోర్టు (అందరు న్యాయమూర్తులతో సమావేశం)లో విషయాలను లేవనెత్తి ఓటింగ్ నిర్వహించవచ్చు. కానీ సీజేఐకే మెజారిటీ న్యాయమూర్తుల మద్దతుందని ముందే గుర్తించినందుకే ఫుల్‌కోర్టుకు పోకుండా.. తమ ఆవేదనను పంచుకునేందుకే మీడియాతో సమావేశమయ్యారు' అని సుప్రీంకోర్టు వర్గాలు వెల్లడించాయి. భవిష్యత్తులో సీజేఐ కావాలనుకుంటున్న ఓ న్యాయమూర్తి ఈ నలుగురితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొనేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు తెలిపాయి.

శబరిమలకు పోటెత్తిన భక్తులు

మకరజ్యోతి దర్శనం



శబరిమలలో మకరజ్యోతి దర్శనం చేసుకుంటున్న భక్తులు

శబరిమల: కేరళలోని ప్రఖ్యాత శబరిమల ఆలయంలో ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా వేలాది మంది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. కేరళతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు శబరిమలకు తరలివచ్చారు. అయ్యప్ప స్వామి దర్శనం కోసం ఇరుముళ్లను తలపై పెట్టుకుని భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. పంపానది పరిసరాలు మొత్తం 'స్వామియే శరణం అయ్యప్ప' స్మరణతో మార్మోగిపోయాయి. సాయంత్రం దీపారాధన తర్వాత ఆలయ ద్వారాలు తెరచుకోవడంతో తిరువాభరణాలు అలంకరించిన స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. తిరువాభరణాలను పందళం అనే ప్రదేశం నుంచి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. స్వామి వారు పందళంలోనే పుట్టి పెరిగారని భక్తుల విశ్వాసం. మకర జ్యోతి కనిపించగానే భక్తుల 'శరణం అయ్యప్ప' స్మరణ మరింత పెరిగిపోయింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, వైద్యులు, విపత్తు సహాయక బృందాలు, అధికారులను కేరళ ప్రభుత్వం భారీ సంఖ్యలో మోహరించింది.

ఆధార్‌కు 'బయోమెట్రిక్' లాక్!

న్యూఢిల్లీ: ఆధార్ సమాచారానికి రక్షణ, గోప్యత కోసం 16 అంకెల వర్చువల్ గుర్తింపు సంఖ్యను మార్చి 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ- యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ వర్చువల్ ఐడీ కన్నా ముందే ఆధార్ వెబ్‌సైట్‌లో మరో సెక్యూరిటీ ఫీచర్ ఎప్పటి నుంచో అందుబాటులో ఉంది. యూఐడీఏఐ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి, తన బయోమెట్రిక్ డేటాను లాక్ చేసుకోవచ్చు. లాక్ ఆన్ చేసి ఉన్నప్పుడు ఎక్కడైనా ఆధార్ ధ్రువీకరణకు వేలిముద్ర వేసినా పనిచేయదు. వినియోగదారుడు తనకు అవసరం ఉన్నప్పుడు మాత్రమే మళ్లీ బయోమెట్రిక్ డేటాను అన్‌లాక్ చేయొచ్చు. వేలి ముద్ర వేసి ఆధార్ ధ్రువీకరణ పూర్తి కాగానే మళ్లీ లాక్ చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో బయోమెట్రిక్ సమాచారం భద్రంగా ఉంటుందనీ, ఆధార్ వివరాలను ఎవరూ దుర్వినియోగం చేయకుండా ఉండేందుకే ఈ అవకాశాన్ని కల్పించామని యూఐడీఏఐ సీఈవో తెలిపారు. బయోమెట్రిక్ సమాచారాన్ని లాక్ చేసేందుకు ఆధార్ కార్డుకు వినియోగదారుడి మొబైల్ నంబర్ అనుసంధానమై ఉండడం తప్పనిసరి. ఇప్పటికే ఉన్న ఈ ఫీచర్‌తోపాటు 16 అంకెల వర్చువల్ గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానం కూడా అమల్లోకి వస్తే ఆధార్ సమాచారానికి మరింత భద్రత, గోప్యత లభించనుంది.

వారు కలిసుండటం కష్టమే

అరవై రెండేళ్ల వ్యక్తికి విడాకులు మంజూరు



ముంబై: ఇక పిల్లలు కలిగే అవకాశం లేకపోవడంతో పాటు భర్త(62)ను భార్య మానసికంగా హింసించిందన్న కారణంతో బాంబే హైకోర్టు ఓ వృద్ధ జంటకు విడాకులు మంజూరు చేసింది. తన భార్య మానసిక వేధింపులకు పాల్పడుతోందని, తమకు పిల్లలు పుట్టే అవకాశం ఇక లేనందున విడాకులు మంజూరు చేయాలని 1995లో ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌ను ఫ్యామిలీ కోర్టు తిరస్కరించింది. దీన్ని సవాలు చేస్తూ అతను హైకోర్టును ఆశ్రయించారు. వారిద్దరూ కలిసున్న 20 ఏళ్లలో ఏనాడూ సజావుగా కాపురం చేయలేదని భర్త తరఫు న్యాయవాది వాదించారు. వీరికి 1972లో వివాహం కాగా 1993 నుంచి వేర్వేరుగా జీవిస్తున్నారు. వాదనల అనంతరం వీరిద్దరూ భవిష్యత్తులో కూడా సఖ్యతగా కలసి ఉండే అవకాశం లేనందున విడాకులు ఇవ్వడం సబబేనని కోర్టు వ్యాఖ్యానించింది.

గ్రాట్యుటీ పన్ను మినహాయింపు రూ. 20 లక్షలు!

న్యూఢిల్లీ: రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు ఇచ్చే గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లు–2017ను వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంట్ ఆమోదించే అవకాశాలున్నాయి. దీని ప్రకారం.. 5 ఏళ్ల అంతకంటే ఎక్కువ కాలం ఒక సంస్థలో పనిచేసి రిటైరయ్యే లేదా వైదొలిగే వారు పొందే గ్రాట్యుటీపై రూ.20లక్షల వరకు పన్ను ఉండదు. ప్రస్తుతం రూ.10 లక్షల వరకు గ్రాట్యుటీపై మాత్రమే పన్ను మినహాయింపు ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు పది అంతకంటే ఎక్కువ మంది పనిచేసే ఫ్యాక్టరీలు, గనులు, చమురు క్షేత్రాలు, ప్లాంటేషన్లు, నౌకాశ్రయాలు, రైల్వే కంపెనీలు, దుకాణాలు తదితర వ్యవస్థీకృత రంగ సంస్థలకు ఇది వర్తిస్తుంది. ఈ బిల్లు శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం కూడా పొందింది. మహిళలకు మాతృత్వ సెలవులను పొడిగించే మాటర్నిటీ బెనిఫిట్ సవరణ బిల్లు–2017ను ఈ సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

బడ్జెట్ సమావేశాల్లోనే వేతన కోడ్ బిల్లు

బడ్జెట్ సమావేశాల్లో వేతన కోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. దీని ప్రకారం కనీస వేతన పరిమితి అమల్లోకి వస్తుంది. ఏ రాష్ట్ర ప్రభుత్వం అంతకంటే తక్కువ వేతనం నిర్ణయించకూడదు.

ఫిట్‌నెస్ నగరాలు ఇవే..



న్యూఢిల్లీ: దేశంలో ఫిట్‌నెస్‌పై అధిక అవగాహన ఉన్న నగరాలుగా గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ నిలిచాయని ఓ అధ్యయనంలో తేలింది. ఈ నగరాల్లోని ప్రజలు రోజుకు 340 కేలరీలు ఖర్చు చేయటంతో పాటు నెలలో సగటున 10 రోజులు కసరత్తులు చేస్తున్నారని వెల్లడైంది. దేశంలోని 220 పట్టణాల్లో సుమారు 30.6 లక్షల మందికి సంబంధించిన ఆహారపు అలవాట్లు, వ్యాయామ సమాచారాన్ని మొబైల్ ఫిట్‌నెస్ యాప్ 'హెల్తీఫైమ్' సేకరించింది. ఈ జాబితాలో కోల్‌కతా, లక్నో, అహ్మదాబాద్‌లు చివరి స్థానాల్లో నిలిచాయని, ఇక్కడ పురుషుల కంటే మహిళలే ఫిట్‌నెస్‌పై అధిక శ్రద్ధ కనబర్చుతున్నారని పేర్కొంది. దేశంలో మహిళల కంటే పురుషులే ఫిట్‌నెట్‌పై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని వెల్లడించింది. పురుషులు నెలలో సగటున 14 రోజులు, మహిళలు 11 రోజులు వ్యాయామం చేస్తున్నారని పేర్కొంది.

నెతన్యాహుకు ఆత్మీయ స్వాగతం

ప్రొటోకాల్ పక్కనపెట్టి ఇజ్రాయెల్ ప్రధానికి మోదీ స్వాగతం

- ఆరు రోజుల పర్యటనకు భారత్‌కు వచ్చిన నెతన్యాహు
- మోదీ, నెతన్యాహు సమక్షంలో తీన్ మూర్తి చౌక్ పేరు మార్పు



ఆదివారం ఢిల్లీలోని తీన్‌మూర్తి చౌక్ వద్ద నెతన్యాహు దంపతులతో మోదీ

న్యూఢిల్లీ: ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత్ చేరుకున్నారు. ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి.. ఢిల్లీ విమానాశ్రయంలో నెతన్యాహుకు ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతం పలికారు. ఆయనను హత్తుకుని భారత పర్యటనకు సాదరంగా ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై భారత్, ఇజ్రాయెల్‌లు సంతకాలు చేయనున్నాయి. ముంబై, ఆగ్రా, గుజరాత్‌లో నెతన్యాహు పాల్గొనే కార్యక్రమాలకు ప్రధాని మోదీ హాజరవుతారు. నెతన్యాహు పర్యటనపై మోదీ స్పందిస్తూ.. 'నా స్నేహితుడు నెతన్యాహుకు స్వాగతం.. భారత్‌లో మీ పర్యటన చరిత్రాత్మకమే కాకుండా ప్రత్యేకమైంది. ఇరు దేశాల మధ్య సన్నిహిత సంబంధాల్ని మరింత బలోపేతం చేస్తుంది' అని ట్వీట్ చేశారు. భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌తో భేటీ సందర్భంగా.. తనకు లభించిన అపూర్వ స్వాగతానికి నెతన్యాహు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రాత్రి నెతన్యాహు, ఆయన సతీమణికి ప్రధాని మోదీ ప్రత్యేక విందు ఇచ్చారు.

తీన్ మూర్తి–హైఫా చౌక్‌గా పేరు మార్పు

అంతకుముందు సెంట్రల్ ఢిల్లీలోని తీన్ మూర్తి చౌక్ మెమోరియల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మోదీ, నెతన్యాహు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ చౌక్ పేరును అధికారికంగా తీన్ మూర్తి– హైఫా చౌక్‌గా మార్చారు. ఇజ్రాయెల్ నగరం హైఫా విముక్తి కోసం మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అమరులైన భారతీయ సైనికులకు ఇరువురు నేతలు నివాళులర్పించారు. తీన్ మూర్తి మెమోరియల్‌లోని సందర్శకుల పుస్తకంలో సంతకాలు చేశారు. 'హైఫా నగరం విముక్తికి మొదటి ప్రపంచ యుద్ధంలో అమరులైన భారతీయ సైనికుల నిస్వార్థ త్యాగానికి నేను సెల్యూట్ చేస్తున్నా. ఇజ్రాయెల్ ప్రధాని సమక్షంలో వీర సైనికులకు నివాళులర్పిస్తున్నాం. ఈ చరిత్రాత్మక దినాన ఈ ప్రాంతానికి తీన్ మూర్తి–హైఫా చౌక్‌గా నామకరణం చేస్తున్నాం.' అని సందర్శకుల పుస్తకంలో మోదీ రాశారు. తీన్‌మూర్తి చౌక్‌లోని మూడు కాంస్య విగ్రహాలు.. '15వ ఇంపీరియల్ సర్వీస్ బ్రిగేడ్'కు చెందిన హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్ సైనికులకు ప్రతీక. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో సెప్టెంబర్ 23, 1918న హైఫాకు ఒట్టోమాన్, జర్మనీ బలగాల నుంచి ఈ బ్రిగేడ్ విముక్తి కల్పించింది.

పలు కీలక ఒప్పందాలపై సంతకాలు

ఈ పర్యటనలో భాగంగా మోదీ, నెతన్యాహులు వివిధ అంశాలపై విస్తృత స్థాయి చర్చలు జరుపుతారు. ఢిల్లీ, ఆగ్రా, గుజరాత్, ముంబైలో నెతన్యాహు పర్యటిస్తారు. చమురు, సహజవాయువు, పునరుత్పాదక ఇంధనం, సైబర్ భద్రత, తదితర ఎంటయూలపై ఇరు దేశాలు సంతకాలు చేస్తాయి.

15 ఏళ్ల తర్వాత..

15 ఏళ్ల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని ఒకరు భారత్‌లో పర్యటిస్తున్నారు. 2003లో అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని ఏరియల్ షరన్ భారత్‌లో పర్యటించారు. ఆరు నెలల క్రితం ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనతో ఆ దేశంతో సంబంధాలు బలపడ్డాయి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ జరిగాక ఆ దేశంలో పర్యటించిన తొలి ప్రధాని మోదీనే కావడం విశేషం.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 15-1-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
89 ▲	30 ▲
34,592	10,681

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,261	▲ 49
డోజోన్స్	25,803	▲ 228
ఎఫ్‌టీఎస్ఈ 100	7,779	▲ 16
డాక్స్	13,245	▲ 42
షాంఘై	3,429	▲ 4
నికాయ్	23,654	▼ 57

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.35	64.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.52	87.69
€	యూరో	ఎస్‌బీఐ	77.86	78.02
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.08	58.19
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.00	51.10
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.57	48.66
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.37	18.23
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.74	18.40
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.94	11.26

కొత్త ఏడాది... కాస్త మారాలి!

(సాక్షి, బిజినెస్ విభాగం)

గరిష్ఠ స్థాయిలో స్టాక్స్ విలువలు
పెట్టుబడులను మార్చుకుంటే బెటర్

ప్రస్తుతానికి లార్జ్‌క్యాప్ షేర్లయితేనే నయం • డెట్స్‌లో తగ్గిన రాబడి; రియల్టీదీ అదే తీరు

పోర్ట్‌ఫోలియోలో మార్పులు అవసరం • బంగారం ఈటీఎఫ్‌ల కంటే బాండ్లు బెటర్

రిటైర్మెంట్‌కు ఎన్‌పీఎస్ మంచి ఆప్షన్ • క్రిప్టో కరెన్సీలకు దూరంగా ఉండండి...

హెల్త్‌ప్లాన్‌కు క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ • ఇవీ.. 2018కి ఆర్థిక నిపుణుల సూచనలు



ఈక్విటీలో ఇన్వెస్ట్ చేసినవారందరికీ 2017వ సంవత్సరం మంచి రాబడులను పంచి పెట్టింది. రెరా చట్టం వచ్చినా రియల్ ఎస్టేట్ రంగం పెద్దగా పుంజుకున్నది లేదు. బినామీ ఆస్తుల చట్టం, జీఎస్టీ వంటి ప్రతిబంధకాలూ ఎదురయ్యాయి. రియల్టీ విషయంలో నూతన సంవత్సరం భిన్నంగా ఉండకపోవచ్చంటున్నారు నిపుణులు. ఇక డెట్ మార్కెట్... అంటే బాండ్లలోను, డెట్ ఫండ్స్‌లోను పెట్టుబడులు పెట్టాలంటే వడ్డీ రేట్లు ఆకర్షణీయంగా లేవు. బంగారమైతే పెద్దగా పెరగకపోయినా స్థిరంగా కొనసాగుతోంది. దీని కదలికలు ఇక ముందూ ఇదే తీరులో ఉంటాయన్న అంచనాలున్నాయి. మరి 2018లో మంచి రాబడులు రావాలంటే ఏం చేయాలి? ఏ సాధనాలు ఆకర్షణీయంగా ఉన్నాయి? పెట్టుబడుల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? ఇదే విషయమై పలువురు నిపుణులతో 'సాక్షి' పర్సనల్ ఫైనాన్స్ విభాగం ప్రతినిధులు మాట్లాడారు. వారు చెప్పిన వివరాల సమాహారమే ఈ కథనం...

రీ బ్యాలెన్స్ తప్పనిసరి...

2017లో మార్కెట్ల ర్యాలీతో ఈక్విటీ పెట్టుబడుల విలువ పుంజుకుని ఉంటుంది. కనుక పెరిగిన విలువకు తగినట్టు ఆ పెట్టుబడులను ఇప్పుడే రీ బ్యాలెన్స్ చేయాల్సిన అవసరముంది. అయితే, మార్కెట్లు బులిష్‌గా ఉన్న ఈ తరుణంలో ఈక్విటీలో పెట్టుబడులను తగ్గించుకోవటం అన్నది ప్రతికూలంగానే అనిపించొచ్చు. అయితే, ప్రతి ఇన్వెస్టర్‌కు ఫలానా సాధనంలో ఇంత శాతం పెట్టుబడులు పెట్టాలన్న (అస్సెట్ అలోకేషన్) ప్లాన్ ఒకటి ఉంటుంది. ఉదాహరణకు మిగులు నిధుల్లో 25 శాతం ఈక్విటీ, 25 శాతం డెట్, 25 శాతం బంగారం, 25 శాతం రియల్టీ అనుకుని ఉండొచ్చు. ''ఈ పెట్టుబడుల విలువ ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. కనుక విలువకు తగినట్టు మార్పులు చేసుకోవడం అన్నది తెలివైన చర్య. పెట్టుబడులను క్రమానుగతంగా సమీక్షించుకుంటూ, అవసరమైతే నిర్ణీత శాతం మేర పోర్ట్‌ఫోలియోలో మార్పులు చేసుకోవాలి'' అని ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ సీఈవో రాధికా గుప్తా సూచించారు.

మిడ్, స్మాల్ క్యాప్స్‌లో పెట్టుబడులు

2017లో సెన్సెక్స్ 28 శాతం పెరిగింది. కానీ, స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు ఇంకా ఎక్కువే రాబడులు ఇచ్చాయి. నిపుణుల సూచన ఏమంటే అధిక విలువలకు చేరిన మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని. ప్రస్తుత స్థాయిలో వాటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు. ఎందుకంటే బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ పీఈ 46.7 రెట్లయితే... స్మాల్‌క్యాప్ సూచీ పీఈ ఏకంగా 114.5 రెట్లకు చేరింది. మిడ్, స్మాల్ క్యాప్‌లో పెట్టుబడి పెట్టేందుకు ప్రత్యేకంగా ఆరంభమైన పలు మ్యూచువల్ ఫండ్ పథకాలు స్టాక్స్ అధిక వ్యాల్యూయేషన్ల నేపథ్యంలో కొత్తగా పెట్టుబడులను తీసుకోవడం తాత్కాలికంగా నిలిపివేశాయి. రిస్క్ కొద్దీ రాబడుల దృష్ట్యా ప్రస్తుతానికి లార్జ్‌క్యాప్ ఫండ్స్ అన్నవి తగిన ఎంపిక అని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ సీఐవో, ఈడీ శంకరన్ నరేన్ అభిప్రాయపడ్డారు.

షార్ట్‌టర్మ్ డెట్ పథకాలు చూడొచ్చు

2017లో డెట్‌ఫండ్స్ రాబడులు చిన్నబోయాయి. అంతకు ముందు ఒకటి రెండు సంవత్సరాల కాలంలో ఇవి రెండంకెల స్థాయిలో రాబడులనిచ్చాయి. దీంతో గత సంవత్సరం రాబడులు నిరాశపరిచినట్లే భావించాల్సి ఉంటుంది. చమురు ధరలు పెరగడం, ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడంపై ఉన్న ఆందోళనలు బాండ్ మార్కెట్‌కు ప్రతికూలంగా మారాయి. అయితే, ఇన్వెస్టర్లు స్వల్పకాలిక డెట్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చని, వీటిలో అంత అస్థిరతలు ఉండవని, స్థిరమైన రాబడులు ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు.

పన్ను రహిత రాబడుల కోసం...

స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టిన వారికి మార్కెట్ల ర్యాలీ కారణంగా మంచి రాబడులొచ్చి ఉంటాయి. దీంతో లాభాల స్వీకరణకు ఇది సరైన సమయమనేది నిపుణుల సూచన. స్టాక్స్‌ను విక్రయించేసి దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ప్రయోజనాలను పొందాలని, తిరిగి అవే స్టాక్స్‌ను కొనుగోలు చేసుకోవాలని పేర్కొంటున్నారు. తాజాగా కొనుగోలు చేసిన ధర నుంచి స్టాక్స్ ధరలు ఒక వేళ పడిపోతే స్వల్పకాలిక నష్టాలను బుక్ చేసుకోవచ్చని, ఈ నష్టాలను ఇతర క్యాపిటల్ గెయిన్స్‌తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సర్దుబాటు చేసుకోవచ్చని లేదా ఎనిమిది ఆర్థిక సంవత్సరాల వరకు వాటిని పొందే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

రిటైర్మెంట్ కోసం ఎన్‌పీఎస్

అతి తక్కువ చార్జీలతో కూడిన ఎన్‌పీఎస్ పథకం... దేశీయ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉన్న రిటైర్మెంట్ పథకాల్లో అత్యంత చౌకయినదని చెప్పొచ్చు. ప్రత్యేక అవసరాల్లో పాక్షిక ఉపసంహరణలు, రిటైర్ అయిన తర్వాత కూడా పెట్టుబడులు పదేళ్ల వరకు కొనసాగించుకునే అవకాశం... ఇవన్నీ ఎన్‌పీఎస్ ఇన్వెస్టర్లకు పన్ను భారాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాయి. ఎన్‌పీఎస్ ఖాతాను ఇప్పుడు చాలా సులభంగా ఆన్‌లైన్ విధానంలోనే ప్రారంభించుకోవచ్చు. ఆధార్‌కు బ్యాంకు ఖాతా, పాన్ లింక్ అనుసంధానమై ఉంటే ఎన్‌పీఎస్ ఖాతాను ఆన్‌లైన్‌లో అప్పటికప్పుడు నిమిషాల్లో ప్రారంభించుకోవచ్చు.

ఇంటి రుణం ముందే తీర్చేస్తే సరి

ఇల్లు అద్దెకు ఇవ్వకపోయినట్టయితే ఆ ఇంటి కోసం తీసుకున్న రుణంపై చెల్లించే వడ్డీకి పూర్తిగా పన్ను మినహాయింపు ఉండేది. అధిక నికర విలువ కలిగిన ఇన్వెస్టర్లు తమ పన్ను భారం తగ్గించుకునేందుకు ఈ నిబంధనను ఉపయోగించుకునే వారు. కోటి రూపాయల గృహ రుణాన్ని 20 ఏళ్ల కాలానికి 8.75 శాతం వడ్డీ రేటుకు తీసుకుని ఉంటే రూ.8.67 లక్షల వరకు పన్ను మినహాయింపుకు అవకాశం లభిస్తుంది. దీంతో రుణం తీసుకున్న వారిపై పన్ను భారం మొదటి సంవత్సరం రూ.2.5 లక్షల మేర తగ్గుతుంది. అయితే, గత బడ్జెట్‌లో పన్ను మినహాయింపును రూ.2 లక్షలకు పరిమితం చేశారు. కనుక ఇంతకంటే ఎక్కువ మొత్తంలో పన్ను ప్రయోజనం ఉండదు కాబట్టి ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డెట్ ఫండ్స్‌లో పెట్టే కంటే ఇంటి రుణం తీర్చేందుకు అదనంగా కేటాయించుకోవడం నయం.

అనారోగ్యానికి కవరేజీ ఉండాలి

మీరు తీసుకున్న వైద్య బీమా పాలసీ అన్ని రకాల రిస్క్‌లను కవర్ చేస్తుందనుకుంటున్నారా..? ఒక్కసారి పరిశీలించుకోండి. ఎందుకంటే తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడితే హాస్పిటల్‌లో చేరి 30 రోజులకు పైగా చికిత్స తీసుకోవాల్సిన సందర్భమే వస్తే అప్పుడు సాధారణ బీమా పాలసీలు అక్కరకు రావు. ఎందుకంటే ఈ పాలసీల్లో కవరేజీ పరిమితంగా ఉండడమే కాకుండా, హాస్పిటల్‌లో గరిష్టంగా 30రోజులకే కవరేజీ లభిస్తుంది. ఆరోగ్య సంరక్షణ వ్యయాలు ఏటేటా భారీగా పెరిగిపోతున్నాయి. కనుక బేసిక్ ప్లాన్‌కు అదనంగా క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ కూడా ఉండాలని సూచిస్తున్నారు హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ ఈడీ ముకేశ్‌కుమార్. జీవిత బీమా లేదా వైద్య బీమాకు రైడర్‌గానూ లేదా స్టాండలోన్‌గా క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ ప్లాన్‌ను తీసుకునే వెసులుబాటు ఉంది.

గోల్డ్ ఫండ్స్ వద్దు

బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌ను (ఈటీఎఫ్) బంగారంలో పెట్టుబడులకు అనువైన సాధనంగా గతంలో పరిగణించేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి తల్లకిందులయింది. వీటి కంటే సార్వభౌమ బంగారం బాండ్లు అధిక రాబడులనిస్తున్నాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లు వార్షికంగా 1 శాతాన్ని ఎక్స్‌పెన్స్ రేషియోగా వసూలు చేస్తున్నాయి. అదే బంగారం బాండ్లు ఎక్స్‌పెన్స్ ఛార్జీల వంటివేమీ లేకుండా... వార్షికంగా అవే 2.5 శాతం వడ్డీని ఇస్తున్నాయి. ఇక బంగారం ధర పెరుగుదల ప్రయోజనం ఎలాగూ లభిస్తుంది. దీంతో బంగారం ఈటీఎఫ్‌ల కంటే బంగారం బాండ్లు వార్షికంగా 3.5 శాతం అధికంగా రాబడులను ఇస్తున్నట్టు లెక్క.

వీటిల్లో ఇన్వెస్ట్ చేయొద్దు

ఇటీవల బిట్‌కాయిన్, ఇతర క్రిప్టో కరెన్సీల్లో చోటు చేసుకున్న పతనం ఇన్వెస్టర్లకు ఓ మేల్కొలుపుగా నిపుణులు సూచిస్తున్నారు. సాధారణ ఇన్వెస్టర్లు బిట్‌కాయిన్‌కు దూరంగా ఉండాలని, వారికి ఏ ధరలో కొనాలి, ఎక్కడ విక్రయించాలో తెలియకపోవడం పెద్ద రిస్క్ అని కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఎండీ నీలేష్ షా చెప్పారు.

అద్దెకు తీసుకుంటే పోలే...

ఇటీవల కాలంలో ఇంటికి కావాల్సిన ఉత్పత్తులు అద్దెకు తీసుకునే ధోరణి పెరుగుతోంది. ఇది ఖర్చు పరంగా సౌకర్యమైనది. ఎందుకంటే ఒకే నగరం, పట్టణం పరిధిలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం సాధారణం అయిపోతోంది. ముఖ్యంగా యువ నిపుణులకు ఇది ఎక్కువగా అనుభవం. దీంతో ఫర్నిచర్‌ను అద్దెకు తీసుకుంటున్న వారున్నారు. ఫర్నిచర్, ఇతర గృహోపకరణాలను అద్దెకు తీసుకునేందుకు నెలకు రూ.10 వేల బడ్జెట్ చాలు. అద్దెకు తీసుకుంటే అందులోనే ఉచితంగా డెలివరీ చేస్తారు. వేరే ప్రాంతానికి మారినా ఉచితంగానే రవాణా చేస్తారు. శుభ్రం చేయడం, నిర్వహణ కూడా అద్దెకు ఇచ్చిన సంస్థల పనే.

ఇల్లు కొంటారా..?
ఇవి గుర్తుంచుకోండి!!

అవసరమేంటో తెలుసుకోవటం ముఖ్యం • నగదుతో సహా సన్నద్ధమయ్యాకే ముందుకు



ప్రభుత్వ ప్రోత్సాహం తోడుండటం వల్ల కూడా కావచ్చు... ప్రస్తుతం మార్కెట్లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గృహ రుణాలపై ఆకర్షణీయమైన ఆఫర్లిస్తున్నాయి. తగ్గుతున్న వడ్డీ రేట్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, రెరా చట్టం ప్రయోజనాలు, అమ్ముడు కాకుండా పెద్ద సంఖ్యలో పేరుకుపోయిన గృహాలు... ఇవన్నీ చూస్తే ఇంటి కొనుగోలుకు అనువైన పరిస్థితులు కల్పిస్తున్నాయి. మీరు కొనడానికి సిద్ధంగా ఉన్నారా లేదా అన్నది వేరే విషయం. ఒకవేళ కొనాలనే ఉద్దేశం ఉండి, ఊగిసలాడుతుంటే కనక సొంతింటి కలను సాకారం చేసుకునే ముందు చూడాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం...



అదిల్ శెట్టి, సీఈవో, బ్యాంక్ బజార్

దీర్ఘకాలమని గుర్తుంచుకోవాలి..

ప్రాపర్టీ కొనాలన్నా, అమ్మాలన్నా చాలా పెద్ద వ్యవహారమే. సొంతంగా ఉండటానికైనా లేదా ఇన్వెస్ట్‌మెంట్ కోసమైనా... చాన్నాళ్ల పాటు దాన్నే అట్టే పెట్టుకుని ఉండాలి. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఇతరత్రా ఆర్థిక అసెట్స్‌ను ఏ రోజైనా విక్రయించుకునే వీలుంది. అదే ప్రాపర్టీ విషయానికొస్తే.. అలాంటి వెసులుబాటు ఉండదు. అనుకున్న రేటుకు విక్రయించుకుని, వైదొలగాలంటే కాలం పట్టేస్తుంది. ఇక, గృహ రుణం తీసుకున్నారంటే.. కాలపరిమితి ఎంతైనా సరే చట్టప్రకారంగాను, ఆర్థికంగానూ, నైతికంగాను కట్టి తీరాల్సిన బాధ్యత మీ మీద ఉంటుంది.

అనువైన ఇల్లు ఏది..?

ఎలాంటి ఇంటిని కొనాలనుకుంటున్నారో నిర్ణయించుకోవడం రెండో అంశం. ఇది కష్టమైన వ్యవహారమే. మంచి లొకాలిటీలో మీరు మెచ్చిన ఇంటిని వెతికిపుచ్చుకుంటే సరిపోదు. ఆ ఇంటి ఖరీదు మీ బడ్జెట్‌కి అనువైనదిగాను, ఇటు సౌకర్యంతో పాటు అటు మానసిక సంతృప్తినిచ్చేదిగా కూడా ఉండాలి. అలాంటి ప్రాపర్టీని ఎంచుకున్నాక... తర్వాతి దశలో చూడాల్సినవి మరికొన్ని ఉన్నాయి.

చేతి నుంచీ కొంత పడుతుంది..

ఇంటి కొనుగోలు అంటే బోలెడన్ని లావాదేవీలుంటాయి. డౌన్ పేమెంటు, రిజిస్ట్రేషన్.. స్టాంపు డ్యూటీ, ఫర్నిషింగ్, బ్రోకరేజి, లోన్ చార్జీలు, ఈఎంఐలు.. వగైరా వంటి అనేకానేకం ఉంటాయని గుర్తుంచుకోవాలి. గృహ రుణం సంగతి పక్కనపెడితే.. డౌన్ పేమెంటు, ఇతర ఖర్చులన్నీ మీ జేబు నుంచే కట్టాలి. ఎందుకంటే గృహ రుణం అనేది ప్రాపర్టీ విలువలో సుమారు 70–90 శాతానికే వస్తుంది. ఇక మిగతా ఖర్చులన్నీ మీరు చూసుకోవాల్సినవే. ఇందుకు సరిపడేంత నగదు కూడా చేతిలో పట్టుకుని ఉన్న పక్షంలో .. తదుపరి అంశంపై దృష్టి పెట్టవచ్చు.

ఏ అవసరానికి కొంటున్నాం..

ముందుగా ఇంటి కొనుగోలు అవసరం గురించి ప్రశ్నించుకోవాలి. చాలా మందికి రెండే కారణాలుంటాయి. ఒకటి సొంతంగా నివసించేందుకు కాగా రెండోది.. పన్నుపరమైన మినహాయింపు, క్యాపిటల్ గెయిన్స్ ప్రయోజనాలు పొందడం కోసం ఇన్వెస్ట్‌మెంట్ కోణంలో కొనడం. అవసరం ఏదైనా రెండింటిలో సానుకూల, ప్రతికూలాంశాలను బేరీజు వేసుకోవాలి. కుటుంబానికి సొంతింటి భరోసా, పెరిగే అద్దెల నుంచి రక్షణ, పెరిగే ఆస్తి విలువ, పన్నుపరమైన ప్రయోజనాలు మొదలైనవి సానుకూలాంశాలు ఉంటాయి. ఇక దీనికి వ్యతిరేక అంశాల విషయానికొస్తే.. చేతిలో నగదు లభ్యత, మార్కెట్.. చట్టపరమైన రిస్కులు, తీసుకున్న రుణం తిరిగి చెల్లింపులో ఎదురయ్యే సమస్యలు లాంటివి ఉంటాయి.

పేపర్‌వర్క్ పక్కాగా..



సాధారణంగా ఇంటి కొనుగోలు అనేది చాలా మంది జీవితాల్లో చాలా పెద్ద ఆర్థిక లావాదేవీగానే చెప్పవచ్చు. అందుకే అన్నీ సక్రమంగా ఉండాలి. మీరు కొందామనుకుంటున్న ఇంటికి సంబంధించి మున్సిపల్ క్లియరెన్సులు, ఇతరత్రా అవసరమైన పర్మిట్లు ఉన్నాయా లేదా చూసుకోవాలి. పేపర్‌వర్క్ పక్కాగా ఉండాలి. స్థల వివాదాల్లాంటివేమీ ఉండకూడదు. ఇంటి పత్రాలను మదింపు చేయడంలో న్యాయనిపుణుడి సలహాలనూ తీసుకోవడం మంచిది. ప్రాపర్టీ చట్టబద్ధంగా పక్కాగా ఉందని పూర్తిగా నమ్మకం కలిగాకే కొనుగోలు విషయంలో ముందడుగు వేయాలి.

ఎంత గృహ రుణం రావొచ్చు..

ఏ రుణానికైనా కొన్ని అర్హతా ప్రమాణాలుంటాయి. అవి కుదిరితేనే బ్యాంకులు రుణాలిస్తాయి. గృహ రుణమూ ఇందుకు మినహాయింపేమీ కాదు. ఆ అర్హతా ప్రమాణాలేమిటంటే.. మీ వయస్సు (సాధారణంగా 18–65 ఏళ్ల మధ్య), ఆదాయం, క్రెడిట్ స్కోరు, ప్రస్తుతం కడుతున్న రుణ మొత్తాలు మొదలైనవి. రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే గానీ క్రెడిట్ స్కోరు తెలుసుకునే వీలు లేదు కదా అనుకోవద్దు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లోనే ఉచితంగా కూడా క్రెడిట్ రిపోర్టు పొందే వెసులుబాటుంది. సదరు నివేదికను బట్టి రుణ అర్హత మెరుగుపర్చుకునేందుకు వీలయితే ప్రస్తుత రుణాలను తీర్చుకునే అంశాన్ని కూడా పరిశీలించవచ్చు. ఒకవేళ మీ ఎలిజిబిలిటీ తక్కువగా ఉన్న పక్షంలో అర్హత ఉన్న కుటుంబ సభ్యులతో కలిసి జాయింట్‌గా కూడా రుణం తీసుకోవచ్చు.

పసిడి మరింత పైకి

బలహీన డాలర్ ఊతం



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సానుకూల సెంటిమెంటుతో పసిడి ధరలు వరుసగా అయిదోవారం పరుగులు తీశాయి. న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజీ ఫ్యూచర్స్ మార్కెట్లో ఫిబ్రవరి కాంట్రాక్టుకి సంబంధించి ఔన్సు (31.1 గ్రాములు) బంగారం ధర డాలర్ల దగ్గర 0.7 శాతం పెరిగి 1,331.70 డాలర్ల వద్ద ముగిసింది. డిసెంబర్ నాటి కనిష్ట స్థాయిల నుంచి పసిడి రేట్లు ఇప్పటిదాకా 6.6 శాతం పైగా పెరిగాయి. అమెరికా డాలరు బలహీనంగా ఉంటుండటం.. సమీప భవిష్యత్‌లో బంగారం రేట్లు మరింత పెరగడానికి కారణం కాగలవని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రేటు 1,300 డాలర్ల పైనే కొనసాగినన్ని రోజులు బంగారానికి బులిష్‌గానే ఉండగలదని పేర్కొన్నారు. పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు క్రమంగా ద్రవ్యపరపతి విధానాన్ని కఠినతరం చేస్తున్న నేపథ్యంలో అమెరికా డాలర్ బేరిష్‌గానే ఉండొచ్చన్నది నిపుణుల మాట. డాలర్‌తో పోలిస్తే మిగతా దేశాల కరెన్సీలు మరింత పెరిగే అవకాశం ఉంది. సమీప భవిష్యత్‌లో సెప్టెంబర్ నాటి 1,357 డాలర్ల గరిష్ఠ స్థాయి తదుపరి కీలక నిరోధంగా ఉండగలదని నిపుణుల అంచనా. ఒకవేళ అది దాటేస్తే 2016 జూలైలో నమోదైన 1,375 డాలర్ల స్థాయికి చేరొచ్చు. సీజనల్ అంశాల కారణంగా త్వరలో బంగారం 1,400 డాలర్ల స్థాయికి కూడా చేరొచ్చన్నది మరికొందరి అభిప్రాయం.

దేశీయంగా ఏడువారాల గరిష్టానికి..

ఆభరణాల సంస్థల కొనుగోళ్ల కారణంగా దేశీయంగాను పసిడి ధరలు మెరుగుపడ్డాయి. న్యూఢిల్లీలో 7వారాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ. 300 మేర పెరిగి రూ. 30,750 వద్ద, ఆభరణాల బంగారం రేటు కూడా రూ. 300 పెరిగి రూ. 30,600 వద్ద క్లోజయ్యాయి.

• యాప్‌కీ కహానీ...

ఫైల్స్ గో




టెక్నాలజీ దిగ్గజ కంపెనీ 'గూగుల్' ఇటీవల ఒక స్టోరేజ్ మేనేజ్‌మెంట్ యాప్ 'ఫైల్స్ గో'ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు



- **స్పేస్ ఆదా:** కేవలం కొన్ని ట్యాప్‌లతోనే వేగంగా, సులభంగా ఫోన్‌లో స్పేస్ పెంచుకోవచ్చు. పాత ఫొటోలను డెలీట్ చేయడం, డూప్లికేట్ ఫైల్స్‌ను తొలగించడం, ఉపయోగించని యాప్స్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేయడం, చాటీని తీసేయడం ద్వారా స్టోరేజ్ స్పేస్ పెంచుకోవచ్చు.
- **స్టోరేజ్ చెక్:** యాప్ సాయంతో ఫోన్, ఎస్‌డీ కార్డ్‌లో ఎంతమేర ఖాళీ స్పేస్ ఉందో తెలుసుకోవచ్చు. ఫోన్ స్టోరేజ్ నుంచి ఫైల్స్‌ను ఎస్‌డీ కార్డులోకి సులభంగా బదిలీ చేసుకోవచ్చు.
- **స్మార్ట్ రికమెండేషన్స్:** ఫైల్స్ తొలగింపునకు సంబంధించిన రికమెండేషన్స్ పొందొచ్చు.
- **ఫైల్స్‌ను వేగంగా పట్టేయవచ్చు:** కొన్ని సందర్భాల్లో అవసరమైన ఫొటో/ఫైల్ ఫోన్‌లో ఎక్కడుందో వెతకడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇలాకాకుండా ఈ యాప్‌తో ఫోన్‌లోని ఫొటోలు, డాక్యుమెంట్లు, వీడియోలను వేగంగా చూడొచ్చు. సమయం ఆదా చేసుకోవచ్చు.
- **ఫైల్స్‌ను ఇతరులకు పంపొచ్చు:** ఫోన్‌లోని ఫైల్స్, ఫొటోలు, వీడియోలు, యాప్స్, డాక్యుమెంట్లను ఇతర ఫోన్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. అయితే అవతలి ఫోన్లో కూడా ఈ యాప్ ఉండాలి.
- **బ్యాకప్:** ముఖ్యమైన ఫైల్స్‌ను గూగుల్ డ్రైవ్ లేదా ఇతర క్లౌడ్ స్టోరేజ్ యాప్‌లలో బ్యాకప్ చేసుకోవచ్చు.



“ఒకరిని అనుకరించి విజయం సాధించడం కన్నా నీవు నీలా ఉండి విఫలం కావడం ఉత్తమం”
– హెర్మన్ మెల్విల్లే, అమెరికా నవలా రచయిత.

పొదుపు-మదుపు





మహిళ.. మనీ... మేనేజ్‌మెంట్!

ముందు నుంచీ అవగాహన ప్రధానం

పరిస్థితులు ఎదురు తిరిగితే ఇబ్బందే • పూర్తి అవగాహన వచ్చాకే పెట్టుబడులు

అంతవరకూ బ్యాంకు డిపాజిట్లే బెటర్ • ఆర్థిక నిపుణులు, ప్లానర్ల సూచనలు

(సాక్షి, బిజినెస్ విభాగం)

మగవారితో పోలిస్తే దేశంలో ఆర్థిక విషయాల గురించి పట్టించుకునే మహిళలు తక్కువ. ముఖ్యంగా వివాహం తరవాత కుటుంబంలో ఆర్థిక అంశాలు, ప్రణాళికలన్నీ పురుషులే చూస్తుంటారు. తక్కువ శాతం ఇళ్లలోనే మహిళలు ఆ పాత్ర నిర్వహిస్తూ ఉంటారు. నిజానికి కుటుంబానికి ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలు ఏంటన్నదానిపై మహిళలకు మంచి అవగాహనే ఉంటుంది. కాకపోతే ఆర్థిక అంశాలు, పెట్టుబడుల విషయం మనకెందుకులే అని దూరంగా ఉండిపోతారు. ఈ ధోరణే భవిష్యత్తులో వారు ఒంటరిగా, తమ కాళ్లపై తాము జీవించాల్సి వస్తే ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. కారణాలేవైనప్పటికీ తాము ఒంటరిగా పిల్లలతో కలసి జీవించాల్సి వస్తే తమ అవసరాలకు, లక్ష్యాలకు, ఆర్థిక భద్రతకు ఏం చేయాలన్న అంశాల గురించి తెలియకపోవటం సమస్యలకు దారితీస్తుందంటున్నారు ఫైనాన్షియల్ ప్లానర్లు.

తమకెందుకులేనన్న ధోరణి తప్పు!

“ఈ విధమైన పరిస్థితులను ఎదుర్కొనే మహిళల్లో అధిక శాతం భారీ నగదు నిర్వహణ తెలియని వారే ఉంటారు. నగదు నిర్వహణ వ్యవహారం తమ ఉద్యోగం కాదులే నన్న ధోరణి చాలా మంది మహిళల్లో, కుటుంబాల్లో ఉండటమే దీనికి కారణం. కనీసం సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలు తెలియని వివాహిత మహిళలు కూడా చాలా మందే ఉంటారు. ఈ విధమైన సందర్భాలు ఎదురైనప్పుడు వారు అచేతనంగా కొన్నాళ్ల పాటు ఏమీ చేయకుండా అలానే ఉండిపోతారు. లేదంటే ఆ నిధుల్ని తప్పుగా ఇన్వెస్ట్ చేస్తారు. పైపెచ్చు ఇలాంటి సందర్భాల్లో వారు విశ్వసనీయత లేని సన్నిహితులు, స్నేహితులపై ఆధారపడతారే గానీ ఫైనాన్షియల్ ప్లానర్ల సాయం తీసుకునేందుకు ముందుకు రారు. ఫైనాన్షియల్ ప్లానర్ల గురించి తెలియకపోవడం కూడా ఓ కారణం” అని హమ్‌ఫౌజి ఇనీషియేటివ్స్ సీఈవో సంజీవ్ గోవిల చెప్పారు.

సమాన బాధ్యత ఉండాలి...

ఒంటరి మహిళలు ముఖ్యమైన అన్ని ఆర్థిక లక్ష్యాల పట్ల సమాన బాధ్యత వహించాలని ఉమంత్ర సహ వ్యవస్థాపకురాలు ప్రిణ్ అగర్వాల్ సూచించారు. ఎక్కువగా పిల్లల విద్యకే ప్రాధాన్యమిస్తుంటారని, అదే సమయంలో తమ రిటైర్మెంట్ అవసరాల గురించి నిర్లక్ష్యం వహించడం లేదా పూర్తిగా మర్చిపోతారని ఆమె చెప్పారు. వ్యక్తిగత బీమా రక్షణకు టర్మ్ ప్లాన్, కుటుంబం కోసం ఆరోగ్య బీమా అన్నవి ఒంటరి మహిళలకు అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యాలని ఆమె సూచించారు.

పలు సమస్యలుంటాయి...

భర్తకు దూరమైన ప్రతి మహిళకు సాధారణంగా పలు రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. జీవనం ఎలా, తన భర్త ఏవిధంగా సంపాదించేవారు, తను ఏ విధంగా ఇన్వెస్ట్ చేసేవారు అనేవి ఎక్కువగా ఎదురయ్యేవని జైపూర్‌కు చెందిన ఫైనాన్షియల్ ప్లానర్ వినితా బరయా తెలియజేశారు. “ఒకవేళ తన భర్త మరణంతో బీమా పరిహారం అందితే గనుక దాన్ని లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. అప్పుడు పెట్టుబడులు, ఆర్థిక అంశాల గురించి నేర్చుకోవాలి. ఆదాయం, ఖర్చులు, పొదుపు, మదుపు, బాధ్యతల గురించి స్పష్టత వచ్చిన తర్వాత ఇన్వెస్ట్ చేయడం ఆరంభించాలి” అని సూచించారు.

పెట్టుబడులు ప్రారంభించాలి

- ఒంటరి మహిళలు భర్తకు దూరమైనప్పుడు తమ నిధుల నిర్వహణను బంధువులకు ఇవ్వకూడదు.
- ఆర్థికాంశాల గురించి పెట్టుబడుల గురించి అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఉంటే ఉన్న నిధుల్ని బ్యాంకులో ఎఫ్‌డీ చేయడమే బెటర్.
- ఆ తర్వాత పెట్టుబడులు, రాబడుల గురించి కనీస అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయాలి.
- ఆర్థిక ప్రణాళిక గురించి తెలుసుకోవాలి. అవసరం అనుకుంటే ఫైనాన్షియల్ ప్లానర్లను ఆశ్రయించాలి.
- ఒకసారి ఆర్థికాంశాలు, పెట్టుబడుల గురించి అవగాహన వచ్చాక క్రమంగా దాన్ని ఆచరణలో పెట్టాలి. బ్యాంకు ఎఫ్‌డీలో నుంచి కొంత మొత్తంతో పెట్టుబడులు ప్రారంభించాలి. మరింత అవగాహన, విషయ పరిజ్ఞానం వచ్చిన తర్వాత పూర్తి స్థాయి ప్రణాళికను అమల్లో పెట్టాలి.

ఫైనాన్షియల్ ప్లానర్ ఎంపికలో..

- సంబంధిత వృత్తిలో కొన్నేళ్లయినా అనుభవం కలిగి ఉండాలి.
- ఫీజులు, చార్జీల గురించి ముందే విచారించాలి. కమిషన్‌పై సలహాలిస్తారా లేక వార్షిక ఫీజు తీసుకుంటారా? లేక ప్రతీసారి నిర్ణీత ఫీజు తీసుకుని సూచనలిస్తారా అన్నది తెలుసుకోవాలి.
- కేవలం ఏం చేయాలన్నది సూచిస్తారా లేక మన తరఫున వారే లావాదేవీలు నిర్వహిస్తారా?
- ఆర్థిక అంశాల గురించి సంపూర్ణంగా తెలియజేస్తారా... లేదా అన్నది కనుక్కోవాలి.

– ప్రిణ్ అగర్వాల్, ఉమంత్ర సహ వ్యవస్థాపకురాలు

దీర్ఘకాలం పాటు పెట్టుబడులకు కావాల్సినవి...

- పొదుపు, మదుపులకు క్రమశిక్షణ తప్పనిసరి.
- ఆర్థిక లక్ష్యాల పట్ల స్పష్టత అవసరం. ఉదాహరణకు పిల్ల ఉన్నత విద్య, పదవీ విరమణ అనంతరం అవసరాలు ఈ విధమైన లక్ష్యాలకు సంబంధించి చేయాల్సిన పెట్టుబడుల్లో స్పష్టత ఉండాలి.
- మీ లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్నేళ్ల సమయం ఉందన్నది కీలకం.
- పెట్టుబడుల్లో మార్కెట్ స్వల్పకాల ఆటుపోట్లను పట్టించుకోవద్దు. దీర్ఘ కాలిక లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేస్తున్నామని గుర్తుంచుకోవాలి.
- మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సిప్‌పై విశ్వాసం ఉంచాలి. దీనివల్ల కొనుగోలు వ్యయాలు సగటుగా మారి, ప్రతికూల రిస్కులు పరిమితం అవుతాయి.

– వినితా బరాయా, వెల్త్ మేనేజర్

వ్యవధిని బట్టి పెట్టుబడి..

- పెట్టుబడులు జాగ్రత్తగా చేయాలి. భావోద్వేగాలకు దూరంగా ఉండాలి. మీరు భరించే రిస్క్‌కు అనువైన సాధనంలో ఆర్థిక లక్ష్యాలకు అవసరమైన మేర ఇన్వెస్ట్ చేయాలి.
- వచ్చే రెండు, మూడేళ్ల కాల అవసరాల కోసం అయితే సురక్షితమైన డెట్ సాధనాల్లో పెట్టాలి.
- చాలా ఏళ్ల తర్వాతే అవసరం అనుకుంటే ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాలి.
- కేవలం సురక్షిత సాధనాలనే ఆశ్రయిస్తే భవిష్యత్తు అవసరాలకు గండిపడినట్టే.
- బంగారం అయినా, రియల్ ఎస్టేట్ అయినా మీకు అవసరం అయితేనే కొనుగోలు చేయాలి.
- బీమా అన్నది పెట్టుబడి సాధనం కాదు. జరగరానిది జరిగితే రక్షణ కల్పించేది.

– సంజీవ్‌గోవిల, హమ్‌ఫౌజి ఇనీషియేటివ్స్ సీఈవో

ఫేస్ ఐడీతో కొటక్ మహీంద్రా బ్యాంక్ సేవలు



ముంబై: ప్రైవేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా తన మొబైల్ బ్యాంకింగ్ యాప్‌కు కొత్త ఫీచర్లను జోడించింది. ఫింగర్‌ప్రింట్, ఫేస్ ఐడీలతో లాగిన్ కావొచ్చని తెలియజేసింది. అయితే ఫింగర్ ప్రింట్, ఫేస్ ఐడీ ఫీచర్లు ఉన్న స్మార్ట్‌ఫోన్లలోనే ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. 'బ్యాంక్ కస్టమర్లు వారి మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లోకి మొబైల్ పిన్ (ఎం–పిన్) సాయం లేకుండానే బయోమెట్రిక్ అథంటికేషన్‌తో లాగిన్ అవ్వొచ్చు. అలాగే ఎం–పిన్ అవసరం లేకుండా యాప్‌లోని చాలా సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు. మరీముఖ్యంగా అన్ని రకాల నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లను నిర్వహించుకోవచ్చు. అయితే ఫండ్ ట్రాన్స్‌ఫర్ వంటి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లకు మాత్రం ఎం–పిన్ తప్పనిసరి' అని కొటక్ మహీంద్రా బ్యాంక్ వివరించింది.

సిప్ పెట్టుబడులు రూ. 6,200 కోట్లు

న్యూఢిల్లీ: సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)ల ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు ఒక్క డిసెంబర్ నెలలోనే రూ. 6,200 కోట్ల మేర పెట్టుబడులు చేసారు. ఏడాది క్రితం ఇదేనెలతో పోలిస్తే ఈ పెట్టుబడులు 56% అధికం. 2017లో మ్యూచువల్ ఫండ్స్... సిప్‌ల ద్వారా రూ. 59,000 కోట్లు సమీకరించినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ (యాంఫి) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2016లో ఈ మొత్తం రూ. 40,000 కోట్లు. ఇన్వెస్టర్లకు యాంఫి అవగాహనా ప్రచార కార్యక్రమాలతో పాటు, ఈక్విటీ స్కీముల పనితీరు బాగుండటంతో సిప్ పెట్టుబడులు పెరుగుతున్నాయని కొటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ నీలేష్ షా చెప్పారు. 2017లో ఇన్వెస్టర్లు మొత్తం ఈక్విటీ స్కీముల్లో రూ.2.3 లక్షల కోట్లు పెట్టుబడి చేయగా, ఇందులో రూ. 59,000 కోట్లు సిప్‌ల ద్వారా ఫండ్స్‌లోకి వచ్చాయి.

స్టాక్స్ వ్యూ

ఇండస్‌ఇండ్ బ్యాంక్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.1,705
టార్గెట్ ధర: రూ.2,076

ఎందుకంటే: ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. నికర లాభం 25 శాతం వృద్ధితో రూ.940 కోట్లకు పెరిగింది. కార్పొరేట్ రుణాలు 26 శాతం, రిటైల్ రుణాలు 24 శాతం, క్రెడిట్ కార్డ్ రుణాలు 55 శాతం చొప్పున వృద్ధి సాధించడంతో మొత్తం రుణాలు 25 శాతం పెరిగాయి. దీంతో నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధి చెందింది. 3.99 శాతం నికర వడ్డీ మార్జిన్(ఎన్‌ఐఎమ్) సాధించింది. ట్రెజరీ ఆదాయం అంతంత మాత్రమే ఉండగా, ఇతర ఆదాయం ఒకింత తగ్గింది. మొత్తం ఆదాయం 19 శాతం వృద్ధి చెందింది. మొత్తం రుణాల్లో మార్జిన్లు అధికంగా వచ్చే రిటైల్ రుణాలు 41%గా ఉన్నాయి. రుణ నాణ్యత స్వల్పంగా తగ్గింది. స్థూల మొండి బకాయిలు 1.16%కి, నికర మొండి బకాయిలు 0.46%కి పెరిగాయి. కాసా జోరు కొనసాగడంతో కాసా నిష్పత్తి 43%కి ఎగసింది. 2019–20 కల్లా వాహనేతర రిటైల్ రుణాల వాటా పెంచుకోవాలనే లక్ష్య సాధనపై ఈ బ్యాంక్ దృష్టి పెట్టింది. 25–30 శాతం రేంజ్‌లో రుణ వృద్ధి సాధించాలనేది బ్యాంక్ నిర్దేశించుకున్న కీలక లక్ష్యాల్లో ఒకటి. దీని కోసం, బ్రాంచ్ విస్తరణ కొనసాగిస్తోంది. భారత ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను విలీనం చేసుకోవడం వల్ల బ్యాంక్ రాబడి నిష్పత్తులు పెరుగుతాయి. మార్కెట్ వాటా పెరుగుతుండడం, కొత్త ఉత్పత్తులు, విభిన్నరకాలైన రుణాలను ఇవ్వడం, ప్రస్తుతం 1,320గా ఉన్న బ్రాంచ్‌లను 2019–20 ఆర్థిక సంవత్సరం కల్లా 2,000కు పెంచుకోనుండటం... తదితర కారణాల వల్ల రుణ వృద్ధి 26 శాతానికి మించి చక్రగతి వృద్ధి సాధించగలదని అంచనా వేస్తున్నాం. బ్యాంకింగ్ పరిశ్రమలో అత్యుత్తమ స్థాయిలో మూలధన నిధులున్న బ్యాంక్ ఇదే.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: జియోజిత్ ఫైనాన్షియల్
ప్రస్తుత ధర: రూ.405
టార్గెట్ ధర: రూ.480

ఎందుకంటే: ఆస్తుల పరంగా రెండో అతి పెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ బ్యాంక్, బ్రిటిష్ ఎమ్‌ఎన్‌సీ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్‌ల జాయింట్ వెంచర్‌గా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యకలాపాలు ప్రారంభించింది. 521 కార్యాలయాలతో, పదివేలకు పైగా ఉద్యోగులతో, లక్ష మందికి పైగా ఏజెంట్లతో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఎల్‌ఐసీ తర్వాత అత్యధిక మంది ఏజెంట్లు ఉన్నది ఈ సంస్థకే. అంతేకాకుండా నిర్వహణ ఆస్తులు అత్యధికంగా ఉన్న ప్రైవేట్ రంగ బీమా కంపెనీ కూడా ఇదే. జీవిత బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ సంబంధిత విస్తృతమైన, విభిన్నమైన పాలసీలను అందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో జీవిత బీమా రంగంలో ప్రైవేట్ కంపెనీల మార్కెట్ షేర్ 22 శాతంగా ఉండగా, దీంట్లో 12 శాతం వాటా ఈ కంపెనీదే. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌ఓఈ) 22 శాతంగా, ఆర్‌ఓఈవీ(రిటర్న్ ఆన్ ఎంబెడెడ్ వేల్యూ–ప్రస్తుత వ్యాపారం ద్వారా భవిష్యత్తులో వచ్చే లాభాలు–బీమా కంపెనీ విలువ మదింపులో ఇది ఒక అంశం) 15 శాతంగా ఉండగలదని అంచనా వేస్తున్నాం. కొత్త వ్యాపారం మార్జిన్లు ఆరోగ్యకరంగా ఉండడం, అండర్ రైటింగ్ కార్యకలాపాలు బాగా ఉండటం, కఠినమైన వ్యయ నియంత్రణ పద్ధతుల కారణంగా ఈ రాబడి నిష్పత్తులు పటిష్టంగానే కొనసాగుతాయని అంచనా వేస్తున్నాం. విస్తృతంగా ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కారణంగా కొత్త వినియోగదారులను సాధించడం ఈ బీమా సంస్థకు సులువైన పని. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త వ్యాపారం 62% వృద్ధి చెందింది. ఈ కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో 2.8% సాల్వెన్సీ రేషియో(కనీసం 1.5% ఉండాలి)ను సాధించింది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

ప్రత్యక్ష పన్ను వసూళ్లు 6.56 లక్షల కోట్లు



ప్రత్యక్ష పన్ను వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో (2017 ఏప్రిల్– డిసెంబర్) రూ.6.56 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2016లో ఇదే కాలంతో పోల్చి చూస్తే 18% వృద్ధి నమోదయ్యింది. 2017–18లో మొత్తం సంవత్సరానికి గాను బడ్జెట్లో రూ.9.8 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు వస్తాయని అంచనా వేశారు. కాకపోతే ఈ లక్ష్యంలో ప్రస్తుత డిసెంబర్ నాటికి 67% పూర్తయింది.

12,600 కోట్ల సమీకరణకు ఎస్‌బీఐ రెడీ!

ఎస్‌బీఐ విదేశీ బాండ్ల ద్వారా రూ.12,600 కోట్లకు పైగా నిధులు సమీకరించనుంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో డాలర్లు, ఇతర కన్వర్టబుల్ కరెన్సీల్లో బాండ్ల జారీతో ఈ స్థాయిలో నిధులు సమీకరిస్తామని ఎస్‌బీఐ తెలిపింది. వీటిని విదేశాల్లో కార్యకలాపాల విస్తరణకు వినియోగిస్తామని పేర్కొంది.

'మెర్సిడెస్'దే లగ్జరీ కార్ మార్కెట్..



దేశీ లగ్జరీ కార్ మార్కెట్‌లో మెర్సిడెస్ బెంజ్ తన హవా కొనసాగిస్తోంది. వరుసగా మూడోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. పలు సవాళ్లను అధిగమించి మరీ 2017లో ఏకంగా 15,330 కార్లు, ఎస్‌యూవీలను విక్రయించింది. కంపెనీ కార్ల విక్రయాలు 2016లో 13,231 యూనిట్లుగా ఉన్నాయి. వార్షిక ప్రాతిపదికన 15.86% వృద్ధి నమోదయ్యింది.

గుర్గావ్‌లో ట్రంప్ టవర్స్ ప్రాజెక్టు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి చెందిన రియల్టీ బ్రాండ్ 'ట్రంప్ టవర్స్' గుర్గావ్‌లో ఖరీదైన రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపడుతోంది. డొనాల్డ్ కుమారుడు ట్రంప్ జూనియర్ సారథ్యంలోని ది ట్రంప్ ఆర్గనైజేషన్ నుంచి లైసెన్స్ పొందిన ఎం3ఎం, ట్రైబెకా సంస్థలు ఈ ప్రాజెక్టును ప్రకటించాయి. ఇందులో రూ. 1,200 కోట్ల పెట్టుబడులతో 250 అపార్ట్‌మెంట్లు ఉంటాయి.

ఎఫ్‌డీఐ సంస్కరణల జోరు



కేంద్ర ప్రభుత్వం సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగం, విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించింది. దీంతో సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఆటోమేటిక్ విధానంలో 100% ఎఫ్‌డీఐలకు మార్గం సుగమం అయ్యింది. అలాగే రుణ సంక్షోభంలో కూరుకున్న ఎయిరిండియాలో 49% దాకా విదేశీ ఎయిర్‌లైన్స్ ఇన్వెస్ట్ చేసేందుకు అనుమతించింది.

3,500 కోట్ల బినామీ ఆస్తులు జప్తు

ఫ్లాట్లు, ఆభరణాలు, వాహనాలతో కూడిన 900 బినామీ ఆస్తులను జప్తు చేసినట్లు ఆదాయ పన్ను విభాగం వెల్లడించింది. వీటి విలువ రూ.3,500 కోట్లు ఉంటుందని తెలిపింది. 2016 నవంబర్‌లో అమల్లోకి వచ్చిన బినామీ ఆస్తి లావాదేవీల నిరోధక చట్టం కింద మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

పీడబ్ల్యూసీకి సెబీ షాక్!

అంతర్జాతీయ ఆడిటింగ్ దిగ్గజం ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్‌కు (పీడబ్ల్యూసీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గట్టి షాకిచ్చింది. సత్యం కేసుకు సంబంధించి పీడబ్ల్యూసీని దోషిగా తేల్చింది. ఫలితంగా పీడబ్ల్యూసీ నెట్‌వర్క్ సంస్థలు రెండేళ్ల పాటు భారత్‌లోని లిస్టెడ్ కంపెనీలకు ఆడిట్ సర్టిఫికెట్లు జారీ చేయకుండా నిషేధం విధించింది. అలాగే సత్యం కంప్యూటర్స్ ఖాతాలు ఆడిటింగ్ ద్వారా పీడబ్ల్యూసీ, గతంలో దాని రెండు భాగస్వామ్య సంస్థలు అక్రమంగా ఆర్జించిన రూ.13 కోట్ల పైగా మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని పేర్కొంది.

ఐదో ఏడాదీ తగ్గిన గోల్డ్ ఫండ్స్ మెరుపు!

గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి నిధులు వెనక్కుమళ్లడం కొనసాగుతోంది. 2017లో గోల్డ్ ఫండ్స్ నుంచి రూ.730 కోట్ల ఉపసంహరణలు జరిగాయి. ఇలాంటి ధోరణి వరుసగా ఇది ఐదో ఏడాది.

పగ్గాలు తెంచుకున్న రిటైల్ ద్రవ్యోల్బణం



రిటైల్ ద్రవ్యోల్బణం చాలా నెలల తర్వాత మరోసారి దౌడుతీసింది. ఆహారోత్పత్తులు, కూరగాయలు, గుడ్ల ధరల పెరుగుదలతో ఆర్‌బీఐ నియంత్రిత లక్ష్యమైన 4 శాతాన్ని దాటేసుకుని గడిచిన డిసెంబర్‌లో ఏకంగా 5.21 శాతానికి ఎగిసింది. దీంతో సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలన్నీ ఆవిరయ్యాయి. మరోవైపు దేశ పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 17 నెలల గరిష్టానికి చేరింది. గత నవంబర్‌లో ఇది 8.4 శాతంగా నమోదైంది.

ఎమ్మార్ డీమెర్జర్‌కు ఎన్‌సీఎల్‌టీ ఓకే

ఎమ్మార్ ఎంజీఎఫ్ ల్యాండ్ కంపెనీ డీమెర్జర్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలిపింది. దీంతో ఎమార్ ఎంజీఎఫ్ ల్యాండ్ జాయింట్ వెంచర్ ఇక ఎమార్ ప్రాపర్టీస్, ఎమ్మార్ డెవలప్‌మెంట్‌లుగా విడిపోతుంది.

ఆటోమొబైల్స్



- 'హ్యుందాయ్' తన మిడ్‌సైజ్ ప్రీమియం సెడాన్ 'వెర్నా'లో 'ఇ,' 'ఇఎక్స్' అనే రెండు కొత్త వేరియంట్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.7.79 లక్షలు, రూ.9.09 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ)గా ఉంది.
- 'శాంసంగ్ ఇండియా'.. 'గెలాక్సీ ఏ8 ప్లస్' స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.32,990. కంపెనీ నుంచి డ్యూయెల్ ఫ్రంట్ కెమెరా ఫీచర్‌తో వస్తోన్న తొలి స్మార్ట్‌ఫోన్ ఇదే.
- 'బజాజ్ ఆటో'.. డిస్కవర్ 110, డిస్కవర్ 125 అనే రెండు బైక్స్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ప్రారంభ ధర రూ.50,496 (ఎక్స్‌షోరూమ్ మహారాష్ట్ర).
- 'లంబోర్గిని' తన తొలి సూపర్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ 'ఉరుస్'ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.3 కోట్లు.
- 'హోండా కార్స్' తన సిటీ, అమేజ్, డబ్ల్యూఆర్–వీ మోడళ్లలో స్పెషల్ ఎడిషన్స్‌ను తీసుకొచ్చింది. హోండా సిటీ 20వ వార్షికోత్సవం ఎడిషన్, అమేజ్ ప్రైడ్ ఎడిషన్, డబ్ల్యూఆర్–వీ ఎడ్జ్ ఎడిషన్ అనేవి వీటి పేర్లు.
- రాయల్ ఎన్‌ఫీల్డ్ తన అడ్వెంచర్ టూరింగ్ మోడల్ 'హిమాలయన్'లో కొత్త వెర్షన్ 'స్లీట్'ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.2.13 లక్షలు (ఆన్–రోడ్ చెన్నై).
- యమహా మోటార్ ఇండియా తన 'ఎఫ్‌జెడ్‌ఎస్–ఎఫ్ఐ'లో సరికొత్త వెర్షన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఢిల్లీలో దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.86,042.

2017-18 క్యూ3 ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017–18	2016–17	వృ/క్షీ(%)	2017–18	2016–17	వృ/క్షీ(%)
ఇండస్‌ఇండ్ బ్యాంక్	936	751	25	5,474	4,716	16
శ్రీ సిమెంట్స్	333	235	42	2,384	2,227	7
టీసీఎస్	6,531	6,778	-4	30,904	29,735	4
ఇన్ఫోసిస్	5,129	3,708	38	17,794	17,273	3
యూనికెమ్ ల్యాబ్స్	2,507	26	--	166	160	4
సౌత్ ఇండియన్ బ్యాంక్	115	111	3	1,736	1,737	--
బజాజ్ కార్ప్	55	58	-5	213	201	6


డీల్స్..



- ఎన్ఎస్ఈలో 0.20 శాతం వాటాను మౌలిక రంగ రుణాలిచ్చే ఐఎఫ్‌సీఐ విక్రయించింది. ఒక్కో షేర్‌ను రూ.925 ధర చొప్పున పది లక్షల షేర్లను రూ.92.51 కోట్లకు విక్రయించింది.
- 'ఫోన్‌పే'.. మొబైల్ వాలెట్ సంస్థ 'ఫ్రీచార్జ్'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఫోన్‌పే యూజర్లు వారి ఫ్రీచార్జ్ వాలెట్లను ఫోన్‌పే యాప్‌తో అనుసంధానం చేసుకోవచ్చు.
- టాటా కెమికల్స్ తన యూరియా, కస్టమైజ్డ్ ఫెర్టిలైజర్స్ వ్యాపారాన్ని నార్వేకు చెందిన యారా ఇంటర్నేషనల్ ఎఎస్ఏ అనుబంధ కంపెనీ యారా ఫెర్టిలైజర్స్ ఇండియాకు రూ.2,682కోట్లకు విక్రయించింది.



బొమ్మ-బొరుసు



“విజయానికైనా, అపజయానికైనా
అవసరమైన దారులు దాదాపు ఒకేలా ఉంటాయి
– కోలిన్ ఆర్ డేవిస్, ఇంగ్లీష్ కండక్టర్.”

తయారీ సూచీలో భారత్‌కు 30వ స్థానం

- డబ్ల్యూఈఎఫ్ జాబితా...
- జపాన్ టాప్, చైనాకు ఐదో ర్యాంక్




న్యూఢిల్లీ/జెనీవా: ప్రపంచ తయారీ రంగ సూచీలో భారత్ 30 స్థానంలో నిలిచింది. ప్రపంచ ఆర్థిక సమాఖ్య(డబ్ల్యూ ఈఎఫ్) ఈ ర్యాంకుల జాబితాను ప్రకటించింది. కాగా, జపాన్ ఈ సూచీలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా తొలి ఐదు ర్యాంకుల్లో ఉన్నాయి. ఇక టాప్-10లో ఆతర్వాత స్థానాల్లో చెక్ రిపబ్లిక్, అమెరికా, స్వీడన్, ఆస్ట్రియా, ఐర్లండ్ నిలిచాయి. చైనా కంటే తయారీ రంగంలో భారత్ చాలా వెనుకబడినప్పటికీ... ఇతర బ్రిక్స్ దేశాలతో(బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా) పోలిస్తే మెరుగ్గానే ఉండటం గమనార్హం. ర్యాంకింగ్స్‌లో రష్యా 35, బ్రెజిల్ 41, దక్షిణాఫ్రికా 45 స్థానాల్లో ఉన్నాయి. 'భవిష్యత్తు తయారీ సంసిద్ధత' పేరుతో తొలిసారిగా విడుదల చేసిన నివేదికలో డబ్ల్యూ ఈఎఫ్ ఈ వివరాలను పొందుపరిచింది. అధునాతన పారిశ్రామిక వ్యూహాల రూపకల్పన విషయంలో దేశాలు అనుసరిస్తున్న విధానాలను విశ్లేషించి 100 దేశాలను నాలుగు గ్రూపులుగా విభజించింది. ఇందులో భారత్ మూడో గ్రూప్(లెగసీ-బలమైన మూలాలు ఉన్నా, భవిష్యత్తులో రిస్కులు అధికం)లో ఉంది. కాగా, ఇదే గ్రూప్‌లో హంగరీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, రష్యా, థాయ్‌లాండ్, టర్కీ వంటివి ఉన్నాయి. బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు మాత్రం నాలుగో గ్రూప్(ప్రారంభ స్థాయి)కే పరిమితం కావడం విశేషం. ఈ నెలాఖరులో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో డబ్ల్యూ ఈఎఫ్ సదస్సు జరగనున్న నేపథ్యంలో ఈ నివేదికను విడుదల చేసింది. తయారీ రంగంలో ప్రస్తుతం ప్రపంచంలో ఐదో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్.. 2016లో ఈ రంగానికి సంబంధించి 420 బిలియన్ డాలర్ల విలువను జోడించిందని తెలిపింది. గడిచిన మూడు దశాబ్దాలుగా సగటున భారత్ తయారీ రంగం 7 శాతం వృద్ధిని సాధించిందని.. జీడీపీలో 16-20 శాతం వాటా ఈ రంగానిదేనని పేర్కొంది.

ప్రగతి ఫలాలు రైతులకు అందకపోతే ఆర్థికాభివృద్ధి వృథా!

వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాం... ● ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ

మరికొద్ది రోజుల్లో మోదీ సర్కారు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో ఈసారి రైతులు, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. ప్రగతి ఫలాలు రైతులకు అందకపోతే.. ఆర్థికంగా దేశం ఎంత అభివృద్ధి సాధించినా అది వృథాయేనని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. అంతేకాకుండా, తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఆదివారమిక్కడ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధికి సంబంధించిన ప్రయోజనాలు వ్యవసాయ రంగంలో కూడా స్పష్టంగా కనబడాలి. లేదంటే ఎంత వృద్ధిరేటు సాధించినా నిరుపయోగమే.అందుకే రైతులకు వృద్ధి ఫలాలు దక్కేవిధంగా సాగు రంగంపై ప్రభుత్వం మరింత ఎక్కువగా దృష్టిసారిస్తుంది' అని జైట్లీ తెలిపారు. కేంద్రీయ గణాంకాల సంస్థ(సీఎస్ఓ) ముందస్తు అంచనాల ప్రకారం ఈ ఏడాది(2017-18) జీడీపీ వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్టమైన 6.5 శాతానికి పడిపోయే అవకాశం ఉంది. మోదీ సర్కారు హయాంలో ఇదే అత్యంత తక్కువ వృద్ధి రేటు కూడా. వ్యవసాయ రంగం, తయారీ రంగాల పేలవ పనితీరు వృద్ధి దిగజారడానికి ప్రధాన కారణమని సీఎస్ఓ అంచనాలు చెబుతున్నాయి. గతేడాది(2016-17)లో వ్యవసాయ రంగం వృద్ధి 4.9% ఉండగా... ఈ ఏడాది ఇది 2.1 శాతానికి పడిపోవచ్చనేది సీఎస్ఓ అంచనా. ఈ నేపథ్యంలో జైట్లీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



గోరుచిక్కుడు... ఆప్షన్స్ ట్రేడింగ్ ప్రారంభం

నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎన్‌సీడెక్స్)లో గోరు చిక్కుడు విత్తనాలకు సంబంధించి ఆప్షన్స్ ట్రేడింగ్‌ను ఆదివారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'దేశానికి రైతులు ఎనలేని సేవలందిస్తున్నారు. ఒకప్పుడు ఆహార కొరతతో అల్లాడిన మన దేశాన్ని ఇప్పుడు వ్యవసాయోత్పత్తుల్లో మిగులు సాధించేలా చేయగలిగారు. అయితే, రైతులకు తాము పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో అధిక ఉత్పత్తి కారణంగా ధరలు పడిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా దీనిపై ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుంది. అయితే, ప్రభావం చాలా తక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి మరిన్ని చర్యలు తీసుకుంటాం. రైతులకు మేలు చేసే ప్రధాన చర్యల్లో కమోడిటీ మార్కెట్లో ఆప్షన్స్ ట్రేడింగ్ ప్రారంభం ఒకటి. మొదట్లో ఇది చాలా చిన్న చర్యగానే అనిపించొచ్చు. రానున్న రోజుల్లో అవగాహన పెరిగేకొద్దీ రైతులు దీనిద్వారా చాలా ప్రయోజనాలు పొందుతారు. పంటకు మెరుగైన ధర లభిస్తుంది' అని చెప్పారు.

ఎన్‌సీడెక్స్... రెండో ఎక్స్ఛేంజ్

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎంసీఎక్స్) తర్వాత కమోడిటీల్లో ఆప్షన్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించిన రెండో ఎక్స్ఛేంజ్ ఎన్‌సీడెక్స్. గతేడాది అక్టోబర్‌లో ఎంసీఎక్స్ గోల్డ్‌లో ఆప్షన్స్‌ను మొదలుపెట్టింది. కాగా, వ్యవసాయోత్పత్తుల ఆప్షన్స్ కాంట్రాక్టులకు సంబంధించి గోరుచిక్కుడే మొట్టమొదటిది. డెరివేటివ్స్ కాంట్రాక్టుల్లో భాగమే ఆప్షన్స్ ట్రేడింగ్. ఏదైనా నిర్దిష్ట ఉత్పత్తికి సంబంధించి ధరల్లో హెచ్చుతగ్గుల రిస్కులకు ప్రతిగా(హెడ్జింగ్) దీన్ని ప్రధానంగా ఉపయోగించుకుంటారు. భవిష్యత్తులో ధర పెరుగుతుందా, తగ్గుతుందా అన్న అంచనాలకు అనుగుణంగా ఈ ఆప్షన్స్ కాంట్రాక్టులను కొనడం/అమ్మడం చేస్తుంటారు. కాగా, ధరల పెరుగుదల లేదా తగ్గుదల రిస్కులను తట్టుకోవడానికి ఆప్షన్స్ ట్రేడింగ్ అత్యంత శక్తిమంతమైన సాధనమని ఈ సందర్భంగా ఎన్‌సీడెక్స్ ఎండీ, సీఈఓ సమీర్ షా పేర్కొన్నారు.

ఫలితాలు, గణాంకాలు నడిపిస్తాయ్ !

- నేడు టోకు ధరల ద్రవ్యోల్బణ డేటా
- దిగ్గజ కంపెనీల క్యూ3 ఫలితాలు
- మార్కెట్ ప్రభావిత అంశాలు



కీలక కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం మార్కెట్‌ను నడిపిస్తాయని విశ్లేషకులు అంటున్నారు. వీటితో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల గమనం, డాలర్‌తో రూపాయి మారకం కూడా తగిన ప్రభావాన్ని చూపిస్తాయని వారంటున్నారు. గత శుక్రవారం వెలువడిన పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలకు సోమవారం మార్కెట్ ప్రతిస్పందిస్తుంది. పారిశ్రామికోత్పత్తి 17 నెలల గరిష్ట స్థాయి, 8.4 శాతానికి ఎగియగా, రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 17 నెలల గరిష్ట స్థాయి, 5.2 శాతానికి ఎగిశాయి.

మార్కెట్ జోరు కొనసాగుతుంది...

ఇక మంగళవారం టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు వస్తాయి. ఈ వారంలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, విప్రో, హిందుస్తాన్ యూనిలివర్, యస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, తదితర దిగ్గజ సంస్థల క్యూ3 ఫలితాలు వెలువడుతాయి. ప్రపంచ మార్కెట్ల జోరు, నిధుల ప్రవాహం బాగా ఉండటంతో స్టాక్ మార్కెట్లో ప్రస్తుత సానుకూలతలు కొనసాగుతాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అయితే కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు, బడ్జెట్ సంబంధించిన సంకేతాలు మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. ఇన్ఫోసిస్, టీసీఎస్ ఫలితాలు అంచనాలకనుగుణంగానే వచ్చాయని, మార్కెట్ జోరు కొనసాగుతుందని అరిహంత్ క్యాపిటల్ మార్కెట్స్ హోల్‌టైమ్ డైరెక్టర్ అనితా గాంధీ చెప్పారు.

విదేశీ పెట్టుబడులు @ రూ.5,200 కోట్లు

భారత క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ.5,200 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం ఈ నెల 1-12 మధ్యన విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లో రూ.2,172 కోట్లు, డెట్ మార్కెట్లో రూ.3,080 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారు. ఈల్డ్స్ ఆకర్షణీయంగా ఉండడం, కంపెనీల క్యూ3 ఫలితాలు ఆశావహంగా ఉంటాయనే అంచనాలు దీనికి కారణమని నిపుణులంటున్నారు. ఇవే కారణాల వల్ల విదేశీ పెట్టుబడులు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని వారంటున్నారు. గత ఏడాది డెట్, ఈక్విటీల్లో కలిపి విదేశీ ఇన్వెస్టర్లు మొత్తం రూ.2 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు.



భారత్ బెంజ్‌కు మరో 200 బుకింగ్స్

కస్టమర్ మీట్‌లో వెల్లడించిన శ్రీ హర్ష ట్రక్కింగ్

హైదరాబాద్: భారత్ బెంజ్ 2018 మోడల్ ట్రక్కులకు మరో 200కు పైగా బుకింగ్స్ వచ్చినట్లు భారత్ బెంజ్ అధీకృత డీలర్ శ్రీ హర్ష ట్రక్కింగ్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకూ వందకు పైగా ఈ ట్రక్కులను విక్రయించామని శ్రీ హర్ష ట్రక్కింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మురళీధర్ వెల్లడించారు. భారత్ బెంజ్ కొనుగోలు చేసిన వినియోగదారులతో ఇటీవల జరిగిన కస్టమర్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటిదాకా 3,000 పైగా భారత్ బెంజ్ ట్రక్కులను విక్రయించామని పేర్కొన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం హయత్ నగర్, మియాపూర్, పాశమైలారం, నాగర్ కర్నూల్, కోదాడ, పాల్వంచ, కరీంనగర్, నిజామాబాద్, అనంతపూర్‌ల్లో సేల్స్ సర్వీసింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బోర్డ్ మీటింగ్స్



సోమవారం-15/01/2018

ఫెడరల్ బ్యాంక్, జీ లెర్నింగ్, డెల్టా కార్ప్

మంగళవారం-16/01/2018

ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఏఎంసీ, డెన్ నెట్‌వర్క్స్, జే భారత్ మారుతీ, ఎస్‌హెచ్ కేల్కర్ అండ్ కంపెనీ

గత వారం హీరోలు

స్టాక్స్	12 ముగింపు	5 ముగింపు	మార్పు(%)
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	67	58	15
కోల్ ఇండియా	306	279	10
వక్రంజీ	447	406	10
ఇన్ఫోసిస్	1,075	1,012	6
టెక్ మహీంద్రా	551	524	5
గ్లెన్‌మార్క్ ఫార్మా	623	592	5
కోల్గేట్ పామోలివ్	1,137	1,101	3
విప్రో	319	310	3
టీసీఎస్	2,759	2,684	3
డీఎల్ఎఫ్	266	260	3

ఎందుకు పెరిగాయంటే...

క్యాపిటల్ ఫస్ట్ కంపెనీ విలీనం కారణంగా ఐడీఎఫ్‌సీ షేర్ 15% ఎగసింది. ధరలను టన్నుకు రూ.110 పెంచడంతో కోల్ ఇండియా షేర్ 10% లాభపడింది. అంచనాలకు అగుణంగా టీసీఎస్ ఫలితాలు, ఇన్ఫీ ఫలితాలూ బాగుంటాయన్న అంచనాలు(శుక్రవారం మార్కెట్ ముగిశాక ఇన్ఫీ ఫలితాలు వచ్చాయి) నెలకొన్నాయి. హెచ్1బీ వీసాలపై ఎలాంటి మార్పుల్లేవని అమెరికా ప్రకటించడం, రూపాయి క్షీణతతో ఇన్ఫీ, టెక్ మహీంద్రా, విప్రో, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీలు 3-6% రేంజ్‌లో పెరిగాయి.

విజయవాడలో బిగ్ సి 9వ షోరూమ్ ప్రారంభం

విజయవాడలో 9వ 'బిగ్ సి' షోరూమ్‌ను ప్రముఖ సినీనటి, బిగ్ సి బ్రాండ్ అంబాసిడర్, రాశీ ఖన్నా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిగ్ సీ ఈడీ వై. స్వప్నకుమార్ పాల్గొన్నారు. ఈ షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా పలు ఆఫర్లను అందిస్తున్నామని, ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితంగా ఒక బహుమతిని గెల్చుకోవచ్చని తెలిపారు.



గత వారం జీరోలు

స్టాక్స్	12 ముగింపు	5 ముగింపు	మార్పు(%)
ఐడియా సెల్యులర్	104	116	-10
భారతీ ఎయిర్‌టెల్	507	540	-6
మారికో	313	326	-4
బజాజ్ ఆటో	3,165	3,278	-3
టీవీఎస్ మోటార్	743	768	-3
హిందాల్కో	268	277	-3
హావెల్స్ ఇండియా	549	564	-3
క్రాంప్టన్ గ్రీవ్స్	272	279	-3
ఐషర్ మోటార్స్	28,488	29,251	-3
బజాజ్ ఫైనాన్స్	1,767	1,811	-2

ఎందుకు తగ్గాయంటే...

స్పెక్ట్రమ్ హోల్డింగ్ కెపాసిటీ నిబంధనలను సరళీకరించాలని టెలికం కమిషన్ నిర్ణయించడం, మరికొన్ని సానుకూలాంశాలతో పెరిగిన టెలికం షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఐడియా, ఎయిర్‌టెల్ వంటి టెలికం షేర్లు 6-10% పడ్డాయి. డిసెంబర్ లో అమ్మకాలు బాగా ఉండటంతో లాభపడిన బజాజ్ ఆటో, టీవీఎస్, ఐషర్ మోటార్స్ వంటి వాహన షేర్లలో కూడా లాభాల స్వీకరణ జరిగింది. దీంతో ఈ షేర్లు 2-3% రేంజ్‌లో పడిపోయాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 15-1-2018

విశాఖ	406-00
చిత్తూరు	398-00
వరంగల్	404-00
ముంబై	447-00
చెన్నై	405-00
విజయవాడ	406-00
గోదావరి	406-00
నమక్కల్	395-00
14-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405-00
ఢిల్లీ	425-00
కోల్‌కతా	450-00

7.3 శాతానికి జీడీపీ సగటు వృద్ధి రేటు



మోర్గాన్ స్టాన్లీ అంచనా


న్యూఢిల్లీ: ఇండియా 2020-2022కల్లా సగటున 7.3 శాతం జీడీపీ వృద్ధి రేటును సాధించగలుగుతుందని అంతర్జాతీయ ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనావేసింది. మధ్యకాలికంగా ఇండియా వృద్ధి పటిష్ఠంగా వుండగలదని, 2018 నుంచి ప్రైవేటు మూలధన పెట్టుబడుల పెరుగుదల మొదలవుతుందని, దాంతో ఉత్పాదక వృద్ధిని క్రమేపీ సాధించగలుగుతుందని మోర్గాన్‌స్టాన్లీ తాజాగా విడుదల చేసిన నివేదికలో వివరించింది. కార్పొరేట్ రాబడి అంచనాలు, బ్యాలెన్స్ షీట్ ఫండమెంటల్స్ మెరుగుపడుతున్నాయని, బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్ఠపరిస్తే...పరపతి డిమాండ్‌ను అందుకోవడం సాధ్యపడుతుందని మోర్గాన్‌స్టాన్లీ పేర్కొంది. ఈ 2018 సంవత్సరంలో భారత్ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో రికవరీ కాగలుగుతుందని, 2016లో 6.4 శాతం ఉన్న జీడీపీ వృద్ధి రేటు 2017లో 7.5 శాతానికి, 2018లో 7.7 శాతానికి పెరుగుతుందని ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన మోర్గాన్‌స్టాన్లీ పేర్కొంది.

సెన్సెక్స్ తక్షణ మద్దతు 34,310

మార్కెట్ పంచాంగం


కొత్త ఏడాదిలో అమెరికా మార్కెట్ నేతృత్వంలో ప్రపంచ ఈక్విటీల ర్యాలీ కొనసాగుతోంది. అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగానే మన స్టాక్ సూచీలు కూడా ఆల్‌టైమ్ రికార్డుస్థాయిలో ముగిసాయి. కానీ సెన్సెక్స్, నిఫ్టీల్లో భాగమైన షేర్లలో ఏవీ కొత్త గరిష్టస్థాయిలో ముగియకుండానే. సూచీలు ఆ ఫీట్ సాధించడం విచిత్రం. రానున్న రోజుల్లో కొన్ని హెవీవెయిట్ షేర్లు కొత్త రికార్డుల్ని నెలకొల్పలేకపోతే, సాంకేతికంగా సూచీలు ఇప్పటిస్థాయిలో నిలబడలేవు. అలాగే అధిక వెయిటేజి కలిగిన బ్యాంకింగ్ షేర్లు రెండు నెలల నుంచి ఒక పరిమితశ్రేణిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ షేర్లు పెరిగితేనే ప్రధాన సూచీలు కొత్త హై పైన స్థిరపడటం సాధ్యపడుతుంది. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



జనవరి 12తో ముగిసిన వారంలో చిన్నపాటి ఒడిదుడుకులతో క్రమేపీ పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్ 34,638 పాయింట్ల రికార్డు గరిష్టస్థాయిని తాకింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే, 439 పాయింట్ల భారీ లాభంతో 34,592 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ పెరిగిన ప్రభావంతో ఈ సోమవారం మార్కెట్ పెరిగితే తొలుత 34,700-34,750 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ శ్రేణిని ఛేదిస్తే క్రమేపీ 34,850-34,980 శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం మార్కెట్ క్షీణిస్తే 34,310 పాయింట్ల వద్ద సెన్సెక్స్‌కు తక్షణ మద్దతు లభిస్తున్నది. గతవారం పలు దఫాలు మద్దతునిచ్చిన ఈ స్థాయిలోపున ముగిస్తే 34,020 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే తిరిగి 33,700 పాయింట్లస్థాయిని పరీక్షించవచ్చు.


నిఫ్టీ తొలి మద్దతు 10,590



గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన అంచనాలకు అనుగుణంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,620 పాయింట్లస్థాయిని దాటిన తర్వాత క్రమేపీ 10,690 పాయింట్లస్థాయిని అందుకోగలిగింది. 10,690 వద్ద కొత్త రికార్డును నెలకొల్పిన అనంతరం చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే, 122 పాయింట్ల లాభంతో 10,681 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం మార్కెట్ గ్యాప్‌అప్‌తో మొదలైతే 10,720-10,750 పాయింట్ల నిరోధశ్రేణిని చేరవచ్చు. ఈ నిరోధశ్రేణిని దాటితే క్రమేపీ 10,790-10,810 పాయింట్ల శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం తొలి అవరోధాన్ని దాటలేకపోతే, 10,590 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. గతవారం మూడుదఫాలు మద్దతును అందించిన ఈ స్థాయిని కోల్పోతే 10,520 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ లోపున 10,440 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్

ఫండ్స్‌ను ఎప్పుడు విక్రయించాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను కొన్ని మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్‌లు(గ్రోత్ ఆప్షన్), డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. వీటిపై పన్నులు ఎలా ఉంటాయి?

– ఫరూక్, హైదరాబాద్

మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్‌లు(గ్రోత్ ఆప్షన్), డెట్ మ్యూచువల్ ఫండ్స్‌పై పన్నులు ఒకే విధంగా ఉంటాయి. మీరు ఏదైనా డెట్ ఫండ్ గ్రోత్ ఆప్షన్‌లో ఇన్వెస్ట్ చేశారనుకుందాం. మూడేళ్లలోపే మీరు ఈ ఫండ్ యూనిట్లను విక్రయిస్తే, మీరు స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై వచ్చిన రాబడులను మీ మొత్తం ఆదాయానికి కలిపి మీకు వర్తించే ఆదాయపు పన్ను స్లాబ్‌ననుసరించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ ఫండ్ యూనిట్లను మూడేళ్ల తర్వాత విక్రయిస్తే, వీటిపై వచ్చే రాబడులను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా పరిగణిస్తారు. ఈ రాబడులపై ఇండెక్సేషన్ ప్రయోజనాలతో 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ఏ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి? ఎలా ఇన్వెస్ట్ చేయాలి అనే విషయాలపై కొంత అవగాహన ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఒక ఇన్వెస్టర్‌గా నేను ఏం చేయాలి? ఫండ్ పనితీరు బాగా లేకపోతే ఆ ఫండ్‌లోనే ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించాలా ? లేదా వేరే ఫండ్‌లోకి మారిపోవాలా? అసలు మ్యూచువల్ ఫండ్ యూనిట్లను ఏ ఏ సందర్భాల్లో విక్రయించాలో చెబుతారా ?

– శైలజ, విజయవాడ

ఒక మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను దీర్ఘకాలం కొనసాగిస్తే, సంపద అదే పెరిగిపోతుందని చాలా మంది ఇన్వెస్టర్లు అనుకుంటారు. అయితే ఇది అన్ని ఫండ్స్‌కు వర్తించదు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఆ ఫండ్స్ పనితీరును తప్పనిసరిగా మదింపు చేయాలి. మంచి రాబడులు ఇస్తుందా లేక ప్రతికూలంగా ఉందా గమనించాలి. ఫండ్ పనితీరు అంచనాలకు అనుగుణంగా లేకపోయినా, ఈ కేటగిరిలోని ఇతర ఫండ్స్ కన్నా అధ్వానంగా ఉన్నా ఈ ఫండ్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వేరే ఫండ్‌లోకి బదిలీ చేయాలి. దశాబ్దాలుగా మంచి పనితీరు కనబరిచిన ఫండ్స్ పనితీరు అధ్వానంగా ఉంటే పనితీరు మెరుగుపడేదాకా వెయిట్ చేయడం ఉత్తమం. ఫండ్ మేనేజర్ మార్పు కూడా పరిగణనలోకి తీసుకోదగిన విషయమే. మీ ఫండ్ మేనేజర్‌ను సదరు మ్యూచువల్ ఫండ్ సంస్థ తొలగించి వేరే ఫండ్ మేనేజర్‌ను నియమించిందనుకుందాం. వెంటనే మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మార్చేయాల్సిన పనిలేదు. కొత్త ఫండ్ మేనేజర్‌ట్రాక్ రికార్డ్‌ను పరిశీలించండి. కొత్త ఫండ్ మేనజర్ నేతృత్వంలో మీ ఫండ్ పనితీరును కనీసం ఆరు నెలల పాటు అయినా మదింపు చేయండి. ఆ ఫండ్ పనితీరు సంతృప్తికరంగా లేకపోతే అప్పుడు ఆ ఫండ్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వేరే ఫండ్‌లోకి మార్చుకోవచ్చు. మీరు రెండు, అంతకంటే ఎక్కువ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారనుకుందాం. ఒకటికి మించిన ఫండ్ పోర్ట్‌ఫోలియో స్టాక్ హోల్డింగ్స్ దాదాపు ఒకే విధంగా ఉంటే, ఏదో ఒక ఫండ్ నుంచి వైదొలగడమే ఉత్తమం. ఫండ్ పోర్ట్‌ఫోలియోలు ఒకే విధంగా ఉంటే, డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు మీకు లభించవు. మీ పోర్ట్‌ఫోలియోలో అధిక సంఖ్యలో మ్యూచువల్ ఫండ్స్ ఉంటే, తక్కువ రాబడులు వచ్చే, పనితీరు బాగా లేని ఫండ్స్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోవచ్చు. మీ పోర్ట్‌ఫోలియోలో ఐదు కంటే ఎక్కువ ఫండ్స్ ఉండకపోవడమే మంచిది. ఇక మీ అంచనాలకు అనుగుణంగా లేని ఫండ్స్‌ను కూడా విక్రయించవచ్చు. ఈక్విటీ ఫండ్స్‌లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే.. సొంత ఇల్లు కొనుగోలు చేయడం, రిటైర్మెంట్ నిధి ఏర్పాటు, పిల్లల ఉన్నత చదువులు తదితర ఆర్థిక లక్ష్యాలను సాకారం చేసుకోవచ్చు. ఈక్విటీ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే, మంచి రాబడులు వస్తాయి. మరోవైపు పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

మా నాన్నగారి వయసు 75 సంవత్సరాలు. ఆయనకు బేసిక్ మెడిక్లెయిమ్ పాలసీ రూ.1.5 లక్షలకు ఉంది. ఆయన కోసం రూ.5 లక్షల టాప్ అప్ పాలసీ తీసుకోవాలనుకుంటున్నాను. ఈ విషయంలో నాకు తగిన సలహా ఇవ్వండి ?

– కరుణాకర్, విశాఖ పట్టణం

హాస్పిటలైజేషన్‌ను కవర్ చేసే బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని టాప్ అప్ పాలసీగా చెప్పుకోవచ్చు. స్వల్ప అదనపు వ్యయంతో ఆరోగ్య బీమా కవర్‌ను పెంచుకోవడానికి ఇది అత్యుత్తమ మార్గం. వైద్య ఖర్చులు ఒక పరిమితికి మించితేనే ఈ టాప్ అప్ పాలసీలు పనిచేస్తాయి. చాలా టాప్ అప్ పాలసీలకు గరిష్ట వయసు పరిమితి 65 సంవత్సరాలు. ఐసీఐసీఐ లొంబార్డ్ హెల్త్ కేర్ ప్లస్‌వంటి కొన్ని ప్లాన్‌లకు గరిష్ట వయోపరిమితి లేదు. ఇలాంటి టాప్ అప్ ప్లాన్‌లకు ప్రీమియమ్ కూడా అధికంగానే ఉంటుంది. అంతే కాకుండా మీ నాన్నగారి ఆరోగ్య పరిస్థితులను బట్టి కూడా ప్రీమియమ్ ఆధారపడి ఉంటుంది. అందుకని అధిక వయసు వ్యక్తులకు వివిధ సంస్థలు ఆఫర్ చేస్తున్న టాప్ అప్ ప్లాన్‌లన్నింటినీ క్షుణ్నంగా పరిశీలించి మీ బడ్జెట్‌కు సరిపడే ప్లాన్‌ను ఎంచుకోండి.

భారత ప్రభుత్వము
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ
ప్రకటన
న్యూఢిల్లీ, 3 జనవరి, 2018

S.O.69 (E) :- జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లోని సెక్షను 3Aలోని సబ్–సెక్షన్ (1) (ఇకమీదట చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జాతీయ రహదారి నం.18లో LC నం.23కు బదులుగా కి.మీ.3/800 వద్ద, LC నం.18కు బదులుగా కి.మీ.7/800 వద్ద, LC నం.14కు బదులుగా కి.మీ.12/600 వద్ద ROBల నిర్మాణం కోసం భూమి స్ట్రెచ్‌లో దిగువ షెడ్యూలులో నిర్దేశించిన సంక్షిప్త వివరణగల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని సంతృప్తి చెందిన తర్వాత సదరు అవసరానికి సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిపై ప్రయోజనం గల ఏ వ్యక్తి అయిన అధికారిక గెజెట్‌లో ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 21 రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి ఆక్షేపణ తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణ సమర్థప్రాధికారికి అంటే జాయింట్ కలెక్టర్, చిత్తూరు గారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు సమర్థప్రాధికారి ఆక్షేపణదారుకు స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారించబడేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన తర్వాత మరియు సమర్థప్రాధికారి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తర్వాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీ చేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్ (2) క్రింద సమర్థప్రాధికారిచే జారీ చేయబడే ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ ప్రకటన క్రింద కవరయ్యే భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు సమర్థప్రాధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి మరియు ఆసక్తిగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జాతీయ రహదారి నం.18లో LC నం.23కు బదులుగా కి.మీ.3/800 వద్ద, LC నం.18కు బదులుగా కి.మీ.7/800 వద్ద, LC నం.14కు బదులుగా కి.మీ.12/600 వద్ద ROBల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ.

క్ర. సం.	జిల్లా పేరు	తాలూకా/ మండలం పేరు	గ్రామం పేరు	సర్వే నం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం (చ.మీ.లలో)
1	2	3	4	5	6	7	8
1	చిత్తూరు	చిత్తూరు	తిమ్మ సముద్రం	258/1	ప్రైవేట్	మెట్ట	35.24
2				257/1	ఇనాం	మెట్ట	22.12
3				223-A/1	ప్రైవేట్	మెట్ట	629.60
4				220-B/2	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	1581.60
5				219/2	ప్రైవేట్	మాగాణి	1637.12
6				213/B2	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	225.84
7				208-A/2B	ప్రైవేట్	మాగాణి	91.88
8				208-B/2B	ప్రైవేట్	మాగాణి	696.40
9				206/2A	ప్రైవేట్	మాగాణి	787.88
10				202/1A	ఇనాం	మాగాణి	9.08
11				202/2B	ఇనాం	మాగాణి	1173.92
12				182/2	ప్రైవేట్	మాగాణి	2933.76
13				181/2B	ప్రైవేట్	మాగాణి	404.44
14				183/2	ప్రైవేట్	మాగాణి	2189.40
15				174/2B	ప్రైవేట్	మాగాణి	7.28
16				172/1B	ప్రైవేట్	మాగాణి	1003.36
17				172/2B	ప్రైవేట్	మాగాణి	2793.12
18				159/2B	ప్రైవేట్	మాగాణి	1416.20
19				158/2	ప్రైవేట్	మాగాణి	343.28
20				156/2	ప్రభుత్వ	కాల్వ పోరంబోకు	40.48
21				173/2	ప్రైవేట్	మాగాణి	1335.84
22				220A/1	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	5424.32
23				222/1A	ప్రైవేట్	మెట్ట	121.44
24				259	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	5788.64
25				530/2	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	80.92
					మొత్తం		**30773.16**
26	చిత్తూరు	చిత్తూరు	కట్టమంచి	14	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	7436.72
					మొత్తం		7436.72
27	చిత్తూరు	పెనుమూరు	కాలవగుంట	28/1	ప్రైవేట్	మెట్ట	258.24
28				29/1	ప్రైవేట్	మెట్ట	520.68
29				30/1	ప్రైవేట్	మెట్ట	20.48
30				42/1	ప్రైవేట్	మెట్ట	779.60
31				43/B	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	127.92
32				44/A1	ప్రైవేట్	మెట్ట	1960.76
33				45/1	ప్రభుత్వ	పోరంబోకు/ వాగు	143.40
34				46/1	ప్రైవేట్	మెట్ట	532.60
35				119/3A	ఇనాం	మెట్ట	200.44
					మొత్తం		**4544.12**
36	చిత్తూరు	పూతలపట్టు	ముతిరేవుల	265/2	ప్రైవేట్	మెట్ట	140.76
37				264/2	ప్రైవేట్	మెట్ట	2052.96
38				262/2	ప్రభుత్వ	పోరంబోకు/ వాగు	357.72
39				259/3	ప్రైవేట్	మెట్ట	1015.16
40				257/A2	ప్రైవేట్	మెట్ట	369.64
41				256/2	ప్రైవేట్	మెట్ట	444.00
42				255/A2	ప్రభుత్వ	పోరంబోకు/ వాగు	29.44
43				254/2	ప్రైవేట్	మెట్ట	134.84
44				251/2	ప్రైవేట్	మెట్ట	143.84
45				250/2	ప్రైవేట్	మెట్ట	170.32
46				249/2B	ప్రైవేట్	మెట్ట	4.88
47				249/3B	ప్రైవేట్	మెట్ట	80.96
48				249/4B	ప్రైవేట్	మెట్ట	80.96
49				248/2	ప్రభుత్వ	పోరంబోకు/ రోడ్డు	7.96
50				245/2	ప్రైవేట్	మెట్ట	54.92
51				242/4	ప్రభుత్వ	గ్రామ కంఠం	100.40
52				242/5	ప్రభుత్వ	గ్రామ కంఠం	80.96
53				241/1B	ప్రైవేట్	మెట్ట	125.88
54				241/2B	ప్రైవేట్	మెట్ట	364.32
55				241/3A	ప్రైవేట్	మెట్ట	101.20
56				241/3B	ప్రైవేట్	మెట్ట	101.20
57				920/1	ప్రైవేట్	మెట్ట	1395.84
58				919/1A	ప్రైవేట్	మెట్ట	4077.20
59				919/2A1	ప్రైవేట్	మెట్ట	364.32
60				919/2B1	ప్రైవేట్	మెట్ట	283.36
61				919/2C1A	ప్రైవేట్	మెట్ట	202.40
62				919/2E1	ప్రైవేట్	మెట్ట	404.80
63				267	ప్రభుత్వ	పోరంబోకు	1133.44
64				942	ప్రభుత్వ	రైల్వే రోడ్డు	323.84
					మొత్తం		**14147.52**
65	చిత్తూరు	పూతలపట్టు	ఒడ్డిపల్లి	215/1A	ప్రైవేట్	మాగాణి	971.52
66				215/1B	ప్రైవేట్	మాగాణి	1012.00
					మొత్తం		**1983.52**
67	చిత్తూరు	పూతలపట్టు	వావిలితోట	810/2B	ప్రైవేట్	మెట్ట	1506.84
68				810/3B	ప్రైవేట్	మెట్ట	1052.48
69				810/4B	ప్రైవేట్	మెట్ట	850.08
70				810/6B	ప్రైవేట్	మెట్ట	485.76
71				812/2	ఇనాం	మెట్ట	2072.80
72				813/1	ఇనాం	మెట్ట	480.84
73				814/2G	ప్రైవేట్	మెట్ట	42.04
74				814/2H	ప్రైవేట్	మెట్ట	80.96
75				814/2I-2	ప్రైవేట్	మెట్ట	1335.84
76				814/3	ప్రైవేట్	మెట్ట	283.36
77				814/5A1	ప్రైవేట్	మెట్ట	40.48
78				814/5B1	ప్రైవేట్	మెట్ట	161.92
79				815/5	ప్రైవేట్	మెట్ట	466.68
80				815/6A	ప్రైవేట్	మెట్ట	80.96
81				815/6B2	ప్రైవేట్	మెట్ట	121.44
82				815/7B	ప్రైవేట్	మెట్ట	121.44
83				815/7C	ప్రైవేట్	మెట్ట	40.48
84				815/7D2	ప్రైవేట్	మెట్ట	566.72
85				815/7E	ప్రైవేట్	మెట్ట	769.12
86				815/7F1	ప్రైవేట్	మెట్ట	607.20
87				816/2B	ప్రైవేట్	మెట్ట	195.25
88				816/2C	ప్రైవేట్	మెట్ట	283.36
89				816/2D2	ప్రైవేట్	మెట్ట	40.48
90				816/4A	ప్రైవేట్	మెట్ట	283.36
91				816/4B1	ప్రైవేట్	మెట్ట	242.88
92				816/4C1	ప్రైవేట్	మెట్ట	40.48
93				817A/1A	ప్రైవేట్	మెట్ట	709.60
94				817/A4	ప్రైవేట్	మెట్ట	566.72
95				818/3B	ప్రైవేట్	మెట్ట	87.44
96				818/4B	ప్రైవేట్	మెట్ట	526.24
97				820/4C2	ప్రైవేట్	మెట్ట	277.60
98				820/4D1	ప్రైవేట్	మెట్ట	202.40
99				820/4E2	ప్రైవేట్	మెట్ట	2671.68
100				820/4F	ప్రైవేట్	మెట్ట	890.56
101				820/4G1	ప్రైవేట్	మెట్ట	121.44
102				820/4H2	ప్రైవేట్	మెట్ట	404.80
103				819/2	ప్రభుత్వ	పోరంబోకు/ రాస్తా	1902.56
					మొత్తం		**20614.29**
104	చిత్తూరు	పెనుమూరు	కలిగిరి	307//3C	ప్రైవేట్	మాగాణి	420.12
105				307/4C2	ప్రైవేట్	మాగాణి	1214.4
106				307/4D2	ప్రైవేట్	మాగాణి	485.76
107				304/6B	ప్రైవేట్	మాగాణి	40.48
				మొత్తం			**2160.76**
					పూర్తి మొత్తం		**81660.09**

[F.No.RW/NH-12014/AP(18)LA/16-S&R(B)]

రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ

రౌడీమూకలతో ముస్లింలపై దాడులా!?

- బాధితులకు న్యాయం చేయాలంటూ వైఎస్సార్ సీపీ డిమాండ్
- నిందితులను అరెస్టు చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా
- డీఎస్పీ, సీఐ హామీతో ఆందోళన విరమణ



పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పిడుగురాళ్ల టౌన్: స్థానికంగా జరిగిన క్రికెట్ పోటీలో ఓటమి పాలైన అక్కసుతో ముస్లిం యువకులపై గొడవకు దిగి.. అది చాలక పిడుగురాళ్ల నుంచి రౌడీమూకలను తీసుకువచ్చి గ్రామంలోని ముస్లిం కాలనీపై టీడీపీ నేతలు దాడిచేయటం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన అల్లరి మూకలు, రౌడీలతో టీడీపీ నాయకులు పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామ ముస్లింలపై శనివారం రాత్రి చేసిన దాడులకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, గ్రామంలోని ముస్లింలపై టీడీపీ గూండాలు మహిళలను కూడా వదలకుండా దాడిచేయటం దారుణమన్నారు. గ్రామంలో ఇంత ఘోరం జరిగినా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేని దుస్థితి నెలకొని ఉందని తెలిపారు. జానపాడులో గొడవ జరిగితే పిడుగురాళ్ల నుంచి రౌడీ మూకలను రప్పించి రాడ్లు, కర్రలతో దాడిచేశారన్నారు. పోలీసులు టీడీపీ వారికి అండగా ఉన్నట్లు తెలుస్తోందని అంబటి తెలిపారు. గుంటూరు తూర్పు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మొహ్మద్ ముస్తఫా, పార్టీ బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి, గుంటూరు పట్టణ అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ సమన్వయకర్తలు మర్రి రాజశేఖర్, కాసు మహేష్‌రెడ్డి, కావటి మనోహర్ నాయుడు తదితరులు మాట్లాడుతూ, టీడీపీ నేతల ఆగడాలకు హద్దు లేకుండాపోతోందని దుయ్యబట్టారు. వారి దాడులను ఇక ఉపేక్షించే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. మళ్లీ పల్నాడులో గొడవలు జరిగితే స్థానిక ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కాగా, టీడీపీ నేతలపై కేసులు నమోదుచేసి అరెస్టు చేస్తామని డీఎస్పీ కాలేషావలి, సీఐ హనుమంతరావుల హామీతో నేతలు ఆందోళన విరమించారు. ఈ ధర్నాలో వేలాదిమంది ముస్లింలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో కౌలురైతు ఆత్మహత్య

అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపం



మల్లికార్జున

కమలాపురం: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం చెన్నారెడ్డిపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దండుబోయిన మల్లికార్జున (37) తండ్రి, తమ్ముడితో కలసి జీవిస్తున్నాడు. తండ్రి పేరిట రెండున్నర ఎకరాల పొలం ఉంది. అలాగే మల్లికార్జున, ఆయన తమ్ముడు రవిశంకర్ మరో పదెకరాల పొలం కౌలుకు తీసుకొని వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం రూ.2 లక్షలు అప్పు చేసి రెండు బోర్లు వేశాడు. అవి 3 నెలలకే ఎండిపోయాయి. మూడేళ్ల క్రితం మరో రూ. 2 లక్షలు అప్పు చేసి రెండు బోర్లు వేశాడు. వీటిల్లో ఓ మోస్తారుగా నీళ్లు వస్తున్నాయి. గతేడాది సాగు చేసిన వేరుశనగ పంట తెగుళ్లతో సగానికి పైగా ఎండిపోయింది. పంట దిగుబడి లేక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర రాక మల్లికార్జున తీవ్రంగా నష్ట పోయాడు. మరోవైపు అప్పు వడ్డీతో కలసి దాదాపు రూ.10 లక్షలకు చేరింది. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండటంతో, కౌలు రైతుగా రుణం పొందాలని పలు మార్లు బ్యాంకుల్లో ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో జీవితంపై విరక్తి కలిగి శనివారం రాత్రి పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగేశ్వరమ్మ, కుమారులు చందు, పండు ఉన్నారు.

విభజన హామీల్ని తుంగలో తొక్కింది

కేంద్రంపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజం

కందుకూరు అర్బన్: రాష్ట్ర విభజన సమయంలో ఏపీకిచ్చిన హామీల్ని అమలు చేయడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు. ఆదివారం ఇక్కడి సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తున్నారని, గతంలో కేంద్రంలో చక్రం తిప్పిన చంద్రబాబు ప్రస్తుతం వేలు కూడా తిప్పలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. దేశ చరిత్రలో మొదటిసారిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే ఇతర న్యాయమూర్తులు ఆరోపణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుందని, అయితే ఇరు పక్షాలూ రాజీమార్గంలో పరిష్కరించుకోవాలంటూ చీఫ్ జస్టిస్‌కు అనుకూలంగా కేంద్రం వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు.

‘బీసీల అభివృద్ధిని ఆర్ఎస్ఎస్ అడ్డుకుంటోంది’

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): బీసీల అభివృద్ధిని ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ అడ్డుకుంటున్నాయని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పీఎం కొండయ్య ఆరోపించారు. పుట్టా సుధాకర్ యాదవ్‌కు టీటీడీ చైర్మన్ పదవి రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సుధాకర్ యాదవ్‌ను టీటీడీ చైర్మన్‌గా నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైన తరుణంలో మతోన్మాద సంస్థలు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు.

ముస్లిం మైనార్టీలపై వరుస దాడులు దుర్మార్గం

ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి



బాధితులను పరామర్శిస్తున్న మైనార్టీ నాయకులు

పిడుగురాళ్ల: ముస్లిం మైనార్టీలపై వరుస దాడులు జరగడం దుర్మార్గమని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి విమర్శించారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన ముస్లింలపై అగ్రవర్ణాలు చిన్నచూపు చూడటం దారుణమన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మానవతావాదులు ఇలాంటి చర్యలను తీవ్రంగా నిరసించాలన్నారు. జానపాడులో జరిగిన దాడి పక్కా ప్రణాళికతో చేసినట్లుగా ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడానికి వెనుకాడే దౌర్భాగ్య స్థితి రావడం శోచనీయమని ముస్లిం ఆలోచనాపరుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవన్ ఖాన్ యజ్దాని అన్నారు.

అదృశ్యమైన బాలుడి హత్య?



చరణ్(ఫైల్)

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లొద్దపద్ర గ్రామంలో శుక్రవారం అదృశ్యమైన బాలుడు దాత చరణ్ (7) ఆదివారం ఓ బావిలో శవమై తేలాడు. ఊహించని ఈ పరిణామంతో స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. బాలుడు శుక్రవారం తన తమ్ముడు సాత్విక్, గ్రామంలోని పిల్లలతో ఆటలాడుతూ కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా దొరకలేదు. ఈ క్రమంలో ఆదివారం బావిలో శవమై తేలాడు. తన కొడుకును తీసుకెళ్లి, రెండు రోజులు దాచిపెట్టి ఎవరో చంపేశారని బాలుడి తల్లి ఆరోపించారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ సీఐ అశోక్‌కుమార్ బాలుడి మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తమోడిన రహదారులు..

- వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో రాష్ట్రంలో పదిమంది దుర్మరణం
- చిత్తూరు జిల్లాలో ముగ్గురు తిరుమల యాత్రికులు..
- నెల్లూరులో ఐదుగురు..
- గుంటూరు జిల్లాలో మరో ఇద్దరు మృత్యువాత
- భోగి నాడు విషాదం



బయమ్మ



యు.బయ్యారెడ్డి



అనిల్ కుమార్



నెల్లూరు జిల్లాలో లారీ కిందకు దూసుకెళ్లిన కారు

బి.కొత్తకోట/పెద్దతిప్పసముద్రం/నెల్లూరు (మినీ బైపాస్)/ పెదకాకాని (గుంటూరు): భోగి పండుగ రోజైన ఆదివారం రాష్ట్రంలోని పలుచోట్ల రోడ్లు రక్తసిక్తమయ్యాయి. చిత్తూరు, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం పదిమంది దుర్మరణం చెందారు. చిత్తూరులో ముగ్గురు, నెల్లూరులో ఐదుగురు, గుంటూరులో ఇద్దరు మృత్యువాత పడ్డారు. చిత్తూరు జిల్లాలో కాలినడకన తిరుమలకు బయలుదేరిన బృందాన్ని వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పెద్దతిప్ప సముద్రం (పీటీఎం) మండలం ఎంపార్లపల్లి మిట్టపై జరిగింది. పీటీఎం మండలం వరికసువుపల్లికి చెందిన బయ్యమ్మ, యు.బయ్యారెడ్డి, లక్ష్మి, లలితమ్మ, చెన్నకేశవ, ఈశ్వరమ్మ, టి.బయ్యారెడ్డి ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కాలినడకన బూర్లపల్లెకు బయలుదేరారు. సోమవారం ఉదయం అక్కడి గ్రామస్తులతో కలిసి నడక మార్గంలో తిరుమలకు వెళ్లాల్సి ఉంది. వీరు పోతుపేట సమీపంలోని ఎంపార్లపల్లె మిట్ట దిగుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాలు వీరిని ఢీకొన్నాయి. దీంతో బయమ్మ(48), యు.బయ్యారెడ్డి (45) అక్కడికక్కడే మరణించారు. కర్ణాటకలోని ఉప్పకుంటపల్లికి చెందిన మోటార్‌సైక్లిస్ట్ అనిల్‌కుమార్ (23)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కాలినడకన వస్తున్న వారిలో భార్యాభర్తలు ఈశ్వరమ్మ(38), చెన్నకేశవులు (40), టి.బయ్యారెడ్డి (55), ద్విచక్ర వాహనాల్లో వస్తున్న రాంకుమార్(30), లోకేష్ (28)కు తీవ్రంగా గాయాలయ్యాయి. వీరిలో రాంకుమార్ పరిస్థితి విషమంగా ఉంది. వీరిని 108, ప్రైవేట్ వాహనాల్లో మదనపల్లెకు తరలించారు.

నెల్లూరులో ప్రాణాలు తీసిన పొగమంచు

నెల్లూరులోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున పొగమంచు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తోటపల్లి గూడూరు మండలం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన ముత్యాల మల్లికార్జున, సర్పంచ్ నరసమ్మ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రెండు కార్లలో తమిళనాడులోని నాగపట్నానికి బయల్దేరారు. ఒక కారులో డ్రైవర్ జాఫర్, మల్లికార్జున, నరసమ్మ, ముత్యాల అశోక్, ముత్యాల ప్రేమసాగర్, ముత్యాల అనిల్, పామంజి మంజులమ్మ, పామంజి పోలమ్మ ప్రయాణిస్తున్నారు. వారికి ముందు రెండు లారీలు, ఓ కంటైనర్ వెళ్తున్నాయి. పొగమంచు కారణంగా కంటైనర్ డ్రైవర్ వేగాన్ని తగ్గించడంతో వెనకనున్న సిమెంట్ లారీ కంటైనర్‌ను ఢీకొంది. దీంతో సిమెంట్ లారీ వెనకే వస్తున్న మరో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో జాఫర్ నడుపుతున్న కారు లారీని ఢీకొట్టింది. కారులోని జాఫర్, నరసమ్మ, మంజులమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ముత్యాల మల్లికార్జున, ముత్యాల అనిల్, పామంజి పోలమ్మకు తీవ్రగాయాలయ్యాయి.

ప్రైవేట్ బస్సు ఢీకొని మరో ఇద్దరు..

మరో ఘటనలో.. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో వారిలో ఇద్దరు మృతిచెందారు. నెల్లూరు ప్రశాంతినగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామునే ఈ దుర్ఘటనా చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నెల్లూరుకు చెందిన ఎం.సుబ్రహ్మణ్యం (40), పి.వెంకటేష్ (28) మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రమాదానికి కారణమైన బస్సును తగులబెట్టారు.

గుంటూరు జిల్లాలో లారీ అదుపుతప్పి..

గుంటూరు జిల్లా పెదకాకాని మండల శివారులోని మద్దిరాల రాజేశ్వరరావు కాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు బైక్‌పై గుంటూరు నుంచి ఆటోనగర్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి వస్తున్న ఓ లారీని మరో లారీ ఓవర్‌టేక్ క్రమంలో బైక్ పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత పాదచారి షేక్ ఇర్ఫాన్‌ను కూడా ఢీకొంది. ఈ ఘటనలో మనోజ్‌కుమార్(20), షేక్ ఇర్ఫాన్ (27) అక్కడికక్కడే మరణించారు.



రావణ వాహనంపై శ్రీశైలేశుడు

నేడు కల్యాణోత్సవం

శ్రీశైలం: మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భోగి పర్వదినాన శ్రీ మల్లికార్జున స్వామి దేవేరి పార్వతితో కలిసి రావణ వాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో రావణ వాహనాధీశులైన స్వామి, అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు విశేష వాహన పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించి రథశాల వద్దకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం అంకాలమ్మ గుడి, నంది మండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగి తిరిగి దక్షిణ మాడవీధుల గుండా ప్రదక్షిణ చేసి రాత్రి 9.30 గంటలకు ఆలయ ప్రాంగణం చేరుకుంది. సోమవారం సంక్రాంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శ్రీ మల్లికార్జునస్వామి, పార్వతీదేవిల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశారు.

ముందు లిఫ్ట్ ఇచ్చి.. తర్వాత అసభ్య ప్రవర్తన


ఓలా డ్రైవర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్: రాత్రిపూట బస్టాప్ వద్ద వేచి ఉన్న ఒంటరి మహిళకు లిఫ్ట్ ఇచ్చి అసభ్యంగా ప్రవర్తించిన ఓ క్యాబ్ డ్రైవర్‌ను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాచకొండ జాయింట్ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి ఆదివారం ఇక్కడ వివరాలు వెల్లడించారు. లాలాపేట్ శాంతానగర్‌కు చెందిన కందుకూరి నాగ మధుకిరణ్(29) ఓలా క్యాబ్ డ్రైవర్. ఈ నెల 5న కాప్రా పరిధిలోని రాధిక థియేటర్ చౌరస్తా వద్ద రాత్రి 10:50 గంటలప్పుడు ఓ మహిళ ఒంటరిగా బస్సు కోసం వేచిచూస్తోంది. అదే సమయంలో క్యాబ్‌లో అటుగా వచ్చిన నాగమధుకిరణ్ ఆమెను మాటల్లో పెట్టి సైనిక్‌పురి వరకు లిఫ్ట్ ఇస్తానంటూ క్యాబ్‌లో ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక దారి మళ్లించాడు. ఏఎస్‌రావునగర్ పార్కు వద్దకు తీసుకెళ్లి కారు డోర్లు లాక్ చేసి మహిళతో అసభ్యంగా ప్రవర్తించసాగాడు. ఆమె అరుపులు, కేకలు వేయడంతో కారులోంచి దింపి పరారయ్యాడు. దీనిపై బాధితురాలు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా క్యాబ్ డ్రైవర్‌ను శనివారం అదుపులోకి తీసుకొని విచారించగా మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది అక్టోబర్ 17న కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికను కిడ్నాప్ చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు. కొకుర్ దర్గాకు బాలికను తీసుకెళ్లి కాళ్లు, చేతులు కట్టేసి లైంగికదాడికి యత్నించినట్లు అంగీకరించాడు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వర శర్మ, ఏసీపీ గోనె సందీప్‌రావు, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల ముందుకు కరుణానిధి

సాక్షి, చెన్నై: అనారోగ్యం కారణంగా ఏడాది పాటు గోపాలపురంలోని ఇంటికే పరిమితమైన డీఎంకే అధినేత కరుణానిధి ఆరోగ్యం కొంచెం కుదుటపడింది. దీంతో ఆయన ఆదివారం కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసేందుకు కార్యకర్తల ముందుకు వచ్చారు. ఆయన్ని చూసేందుకు కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున చెన్నైలోని గోపాలపురానికి చేరుకున్నారు. కరుణానిధి వారికి అభివాదం చేస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు.


22న కోర్టుకు యాంకర్ ప్రదీప్



హైదరాబాద్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యాంకర్ మాచి రాజు ప్రదీప్ ఈ నెల 22న కోర్టుకు హాజరు కానున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ అధికారులకు ఆయన సమాచారం అందించారు. గత నెల 31న అర్ధరాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ప్రదీప్ మద్యం సేవించి కారు నడుపుతూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 8న తన తండ్రితో కలసి గోషామహల్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అనంతరం ఈ నెల 16న కోర్టుకు హాజరవుతానని ఇటీవల పోలీసులకు సమాచారం ఇచ్చారు. 16న కోర్టుకు సెలవు కావడంతో మళ్లీ 22కి ఆయన హాజరు వాయిదా పడింది. నాంపల్లిలోని నాలుగో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు ప్రదీప్‌ను పోలీసులు హాజరు పరచనున్నారు. అదేరోజు ఆయనకు శిక్ష ఖరారు కానుంది.

మహిళ గొంతు కోసి.. ఆత్మహత్యాయత్నం

వివాహేతర సంబంధం నేపథ్యంలో ఫ్యాన్సీ స్టోర్ యజమాని దారుణం



చికిత్స పొందుతున్న ప్రశాంతి, ఖాదర్‌వలి

బద్వేలు అర్బన్: వైఎస్సార్ జిల్లా బద్వేలులో ఆదివారం దారుణం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి వివాహిత గొంతు కోసి, అనంతరం తాను కూడా కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సుందరయ్య కాలనీకి చెందిన షేక్ ఖాదర్‌వలి(40) ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయ నగర్‌కు చెందిన బండి ప్రశాంతి రెండేళ్ల కిందట ఖాదర్ వలి దుకాణంలో పనిచేసేది. ఈ క్రమంలో ఇరువురి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే కువైట్‌లో ఉంటున్న ప్రశాంతి భర్త ఆమె తీరుపై అనుమానం వచ్చి ఆ దుకాణంలో పని మాన్పించి తిరిగి కువైట్‌కు వెళ్లాడు. దీంతో ఆమె ఆ దుకాణం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిలో చేరింది. అయితే తనతో వివాహేతర సంబంధం కొనసాగించాలని, లేని పక్షంలో తన వద్ద తీసుకున్న డబ్బును తిరిగి ఇచ్చేయాలని ఖాదర్‌వలి ఆమెపై ఒత్తిడి తెస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ప్రశాంతిని దుకాణానికి పిలిపించి గొడవకు దిగాడు. ఈ సమయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఖాదర్‌వలి కత్తితో ఆమె గొంతు భాగంలో గాయపరిచాడు. వెంటనే ఆమె తప్పించుకుని బయటకు పరుగులు తీసింది. అనంతరం ఖాదర్‌వలి కూడా కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి ఇద్దరినీ ప్రైవేట్ అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు బాల నేరస్తులు పరార్

హైదరాబాద్: అబ్జర్వేషన్ హోం నుంచి ఆరుగురు బాల నేరస్తులు పారిపోయారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని శిక్షపడిన బాల నేరస్తులను నాగోలు కృషి నగర్‌లోని రోజ్ అబ్జర్వేషన్ హోంలో ఉంచుతారు. ఈ హోంలో శనివారం మధ్యాహ్నం భోజనం అనంతరం మహేశ్, ఎండీ అఫ్రోజ్‌ఖాన్ అలియాస్ ఇప్పు, వేల్పు కిశోర్, సయ్యద్ షాహెద్, శ్యామ్‌సుందర్, శివసింగ్ అనే బాల నేరస్తులు పారిపోయారు. అబ్జర్వేషన్ హోం నిర్వాహకులు సాయిలు ఫిర్యాదుతో ఎల్బీ నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ హోం నుంచి ఇప్పటికే నాలుగు సార్లు బాల నేరస్తులు చేసి పారిపోయారు. సరైన భద్రత లేకపోవడం వల్లే బాల నేరస్తులు తరచూ తప్పించుకుని పోతున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్సార్ జిల్లా
సోమవారం, 15-1-2018

ఈస్ట్ అబ్బాయి వెస్ట్ అమ్మాయి



'నేను సినిమా హీరోయిన్‌ని.. పెళ్లవుతుందా?' అని ఆలోచించిన రోజులేమైనా?

చాలా ఆలోచించేదాన్ని. సినిమాలు చేస్తూ ఎంత బిజీగా ఉన్నా, పెళ్లి చేసుకుని సెటిల్ అవ్వాలని ఉండేది. మంచి లైఫ్ పార్టనర్ రావాలని కోరుకునేదాన్ని. మాకు బోలెడంత మంది పిల్లలు ఉండాలనుకునే దాన్ని. ఓ అమ్మాయికి ఉండే 'జెన్యూన్' ఫీలింగ్స్ ఇవి. నా ఆలోచనల్లో నిజాయితీ ఉంది కాబట్టే 'వీర' లాంటి జెన్యూన్ పర్సన్‌ని భర్తగా పొందే అర్హత నాకు ఉందనిపించింది.

బోలెడంత మంది పిల్లలు కావాలనే కోరిక ఉందన్నారు. మరి మమ్మీగా ఎప్పుడు ప్రమోషన్?

ఆల్రెడీ నా అన్న కూతురికి నేను అమ్మనే. ఇంట్లో ఉన్న పెట్స్‌కి మమ్మీనే. అయితే ఫిజికల్‌గా బర్త్ ఇవ్వడం అంటే చిన్న విషయం కాదు. అందుకని కొంచెం టైమ్ తీసుకోవాలనుకుంటున్నాను.

తూర్పు పడమరలు ఆపోజిట్.
ఈ తూర్పూ పడమరలు అఫెక్షనేట్!
సూరత్ అమ్మాయి నమిత..
శ్రీకాకుళం అబ్బాయి వీర..
ఇరు దిక్కుల తమ బాంధవ్యానికి
నలుదిక్కుల నుంచి ఆశీర్వచనాలు
కోరుకుంటున్నారు.

ఆ దేవుడు నా మాట విన్నాడు : నమిత

- **'మిస్' నమిత నుంచి 'మిసెస్' నమిత అయ్యాక జీవితం ఎలా ఉంది?**

చాలా కలర్‌ఫుల్‌గా, పీస్‌ఫుల్‌గా ఉంది. ఒక మంచి స్పేస్‌లో ఉన్నాననే భరోసా ఏర్పడింది.

- **వీర మీకు మంచి జీవిత భాగస్వామి అవుతారని మీకు ఎప్పుడు అనిపించింది?**

ఒక అబ్బాయి గురించి ఆలోచించినప్పుడు 'ఇతను మంచి భర్త మాత్రమే కాదు.. మంచి తండ్రి కూడా అవుతాడు' అనే ఫీలింగ్ కలిగిందంటే.. అతను మంచి జీవిత భాగస్వామి అవుతాడని నా నమ్మకం. వీరతో పరిచయం నాకా ఫీలింగ్‌ని కలిగించింది. ఏదైనా స్ట్రయిట్ ఫ్రమ్ హార్ట్ మాట్లాడతాడు. డ్రామా యాడ్ చేయడు. చాలా జెన్యూన్ పర్సన్. తన సమక్షంలో ఉన్నప్పుడు ఓ 'ప్రొటెక్టివ్' ఫీల్ కలుగుతుంది. ఏ భయమూ లేకుండా మిగతా జీవితాన్ని గడిపేయొచ్చనే నమ్మకం ఏర్పడింది. మా ఇద్దరిదీ 'సోల్ కనెక్షన్' అనిపించింది. అందుకే తను ప్రపోజ్ చేయగానే పెళ్లికి ఒప్పుకున్నాను.

- **శ్రీకాకుళం అబ్బాయితో సూరత్ అమ్మాయి పెళ్లి! ఇంట్లోవాళ్లు ఏమీ అనలేదా?**

జనరల్‌గా కొంతమంది పేరెంట్స్ సినిమాల్లోకి వెళతానంటే ఒప్పుకోరు. కానీ నా పేరెంట్స్ నేనేం చేసినా కాదనలేదు. సినిమాల్లోకి వెళ్తానంటే సపోర్ట్ చేశారు. పెళ్లి గురించి చెప్పినప్పుడూ సపోర్ట్ చేశారు.

- **తిరుపతిలోనే పెళ్లి చేసుకోవాలని ఎందుకు అనుకున్నారు?**

ఏడాదికి రెండుసార్లయినా నేను తిరుపతి వెళతాను. వెంకటేశ్వర స్వామి అంటే నాకు బలమైన నమ్మకం. ఆ దేవుడు నా మాటలు వింటాడని నమ్ముతాను. నాకు బెటర్ లైఫ్ ఇస్తాడని నమ్మాను. నిజంగానే అదే జరిగింది. అందుకే ఆ దేవుడి సమక్షంలో పెళ్లి చేసుకోవాలనుకున్నాను. వీర కూడా ఓకే అన్నాడు.

- **హీరోయిన్స్‌ని ఆరాధిస్తారు. కానీ పెళ్లి చేసుకోవాలంటే ఆలోచిస్తారు. సమాజం ఇలా ఉన్నప్పుడు వీర మిమ్మల్ని పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడం ఎలా అనిపించింది?**

మీరన్నది కరెక్టే. అయితే అందరూ అలా ఉండరు. వీరలాంటి వాళ్లు కూడా ఉంటారనడానికి మా పెళ్లి ఓ ఎగ్జాంపుల్. అయినా చేసే ప్రొఫెషన్‌ని బట్టి ఎవరినీ జడ్జ్ చేయకూడదు. వీర, నేను పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు చాలా ఆలోచించాం. ఎందుకంటే జీవితాంతం కలిసి బతకాల్సిన వాళ్లం. 'నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉంది' అని తను ప్రపోజ్ చేసినప్పుడు నా కల నిజమైంది అనిపించింది. 'నో' చెప్పడానికి నాకు ఒక్క కారణం కూడా కనిపించలేదు. ఎందుకంటే పరిచయమైన ఏడాదికి తను నాకు ప్రపోజ్ చేశాడు. అంటే.. నన్ను అర్థం చేసుకున్నాడనే కదా.

- **ప్రేమ అంటే మనం ఎలా ఉన్నామో అలా అంగీకరించడమే. మీరు బొద్దుగా ఉంటారు కాబట్టి బరువు తగ్గమని వీర సజెస్ట్ చేశారా?**

యాక్చువల్లీ ఇప్పుడు ఉన్నదానికన్నా ఓ పది కిలోలు తక్కువగా ఉండేదాన్ని. నాకు నోస్ అలర్జీ ఉండేది. ఎప్పటినుంచో ఉన్నప్పటికీ దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. పెళ్లికి రెండు నెలల ముందు సీరియస్ అయింది. దాంతో నేను బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. వర్కవుట్స్ చేయడానికి కుదిరేది కాదు. వెయిట్ చాలా పెరిగాను. 'ఇలా అయిపోతున్నాను' అంటే 'ఏం ఫర్వాలేదు. పెళ్లి తర్వాత వర్కవుట్స్ చేసి, తగ్గుదువుగాని. లేకపోయినా ఓకే' అని వీర అన్నాడు. మ్యారేజ్ అయ్యాక వర్కవుట్స్ మొదలుపెట్టాను. నాలుగు కిలోలు తగ్గాను. హెల్త్ గురించి కేర్ తీసుకోవాలి కాబట్టి నా అంతట నేనే తగ్గడం మొదలుపెట్టాను.

- **మీకు గ్లామర్ క్వీన్ అనే ఇమేజ్ ఉంది. ఇకముందు కూడా ఆ ఇమేజ్‌కి తగ్గ క్యారెక్టర్స్ చేస్తారా? అసలు సినిమాలు కంటిన్యూ చేస్తారా?**

సినిమాలు మానేయడం ఎందుకండి? పెళ్లయితే జాబ్ మానేయాలని రూలేం లేదు కదా. అలాగే క్యారెక్టర్స్ సెలెక్ట్ చేసుకునే విషయంలో కూడా ఏ మార్పూ ఉండదు. వీర నన్ను సినిమాలు మానేయమని చెప్పలేదు. క్యారెక్టర్ గ్లామరస్‌గా కనిపించాలని డిమాండ్ చేస్తే నో ప్రాబ్లమ్. ఫర్ ఎగ్జాంపుల్ హాలీవుడ్ మూవీ 'సూసైడ్ స్క్వాడ్'లో మార్గెట్ రాబీ చేసిన క్యారెక్టర్‌ని తీసుకుంటే చాలా గ్లామరస్‌గా ఉంటుంది. సేమ్ టైమ్ పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అలాంటి క్యారెక్టర్స్ వస్తే చేస్తాను.

- **మీ అత్తమామల్ని ఏమని పిలుస్తున్నారు.. వీరాగారికి అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు ఉన్నారా?**

అత్తయ్యగారూ, మామయ్యగారూ అని పిలుస్తున్నాను. వీరాకి ఒక చెల్లెలు ఉంది. తను నాకు 'ఆడొపచు'.. ఏంటో సరిగ్గా నోరు తిరగడంలేదు. చిన్నమ్మాయి. పాతికేళ్లు కూడా లేవు. వదినా అంటూ నాతో బాగుంటుంది.

- **ఆడొపచు కాదు.. ఆడపడుచు అంటారు.**

ఓహ్.. ఆడపడుచు.. ప్రాక్టీస్ చేస్తా. (నవ్వుతూ)



భర్త వీరతో నమిత



“

- **'ఎఐఎడిఎంకె' పార్టీలో ఉన్నారు. జయలలిత మరణం తర్వాత ఆ పార్టీ, తమిళనాడు రాజకీయాలు గందరగోళంగా తయారయ్యాయి. మీరేమైనా పార్టీ మారాలనుకుంటున్నారా?**

ప్రస్తుతానికి ఎఐఎడిఎంకేలో ఉన్నాను. భవిష్యత్తులో వేరే పార్టీకి మారతానా.. అనేది ఇప్పుడు చెప్పలేను. తమిళనాడులో రాజకీయాల పరిస్థితి అయోమయంగా ఉంది. చూడాలి. మంచి మార్పు రావాలి. ప్రజలకు మేలు జరగాలి.

- **రజనీకాంత్‌గారు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన సీఎం అయితే న్యాయం చేస్తారనుకుంటున్నారా?**

రజనీకాంత్‌గారు సూపర్ స్టార్. ప్రజల గుండెల్లో బోలెడంత స్థానం సంపాదించుకున్నారు. కానీ, ఆయన రాజకీయాల్లోకి వస్తే న్యాయం చేస్తారా? ఏం చేస్తారు? అనేది ఇప్పుడే చెప్పలేను. జడ్జ్ చేయలేం.

ఇంటర్వ్యూ: డి.జి. భవాని

మాది ఆత్మబంధం : వీర



- **బీచ్ ఒడ్డున క్యాండిల్ లైట్ డిన్నర్ ఏర్పాటు చేసి, నమితకు లవ్ ప్రపోజ్ చేశారట.. ఐడియా బాగుంది!**

థ్యాంక్స్ అండీ.. 2016 సెప్టెంబర్ 6న మా ఇద్దరి కామన్ ఫ్రెండ్స్ ద్వారా నమితకు, నాకు పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత చాలాసార్లు మాట్లాడుకున్నాం. అప్పుడు నమిత ఆలోచనలు, అభిరుచులు తెలిశాయి. ఇలా ప్రపోజ్ చేస్తే తనకు నచ్చుతుందని గ్రహించాను. బేసిక్‌గా నేను రైటర్‌ని. పొయెటిక్‌గా నా లవ్‌ని ఎక్స్‌ప్రెస్ చేయాలనుకున్నా. కోవలమ్ బీచ్ బెస్ట్ అనిపించింది. ఫస్ట్ టైమ్ లవ్ ప్రపోజ్ చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్న తర్వాత విపరీతమైన గాలి! దాంతో కుదరలేదు. సెకండ్ టైమ్ వర్షం వచ్చింది. ఆ ప్లాన్ కూడా వర్కవుట్ కాలేదు. థర్డ్ టైమ్ ప్రకృతి సహకరించింది (నవ్వుతూ). పైగా ఆ రోజు ఫుల్ మూన్ డే. పండు వెన్నెల సాక్షిగా నమితకు ప్రపోజ్ చేశాను. ఓకే చెప్పింది. 2017 నవంబర్‌లో పెళ్లి చేసుకున్నాం.

- **నమితగారిలో మీకు నచ్చిన విషయాలేంటి?**

నేనేదైనా ఓపెన్‌గా మాట్లాడతాను. తనూ అంతే. ఇద్దరి ఆలోచనలూ చాలా క్లియర్‌గా ఉంటాయి. కొన్ని థాట్స్ కలిశాయి. కలిసి జీవించడానికి ఇది చాలనిపించింది. బేసిక్‌గా తను చాలా మంచి అమ్మాయి.

- **మీ ఇద్దరూ లవ్‌లో పడక ముందు వేరేవాళ్లతో లవ్, బ్రేకప్ ఇన్సిడెంట్స్ ఉన్నాయి. వాటి గురించి ఓపెన్‌గా మాట్లాడుకున్నారా? ఓ బంధాన్ని ఎలా నిలబెట్టుకోవాలో ఆ బ్రేకప్ మీకు నేర్పించిందా?**

యస్. నేనూ ఒక అమ్మాయిని ప్రేమించాను. విడిపోయాను. నమిత లైఫ్‌లో కూడా ఇలాంటి ఓ ఇన్సిడెంట్ ఉంది. వాటి గురించి మేం మాట్లాడుకున్నాం. గతం గతః అనుకున్నాం. భవిష్యత్తులో కలిసి నడవాలనుకున్నాం. ఓ బ్రేకప్ మంచి లెసన్ అవుతుంది. ఆ లెసన్ ఇప్పటి బంధాన్ని ఎలా నిలబెట్టుకోవాలనే క్లారిటీ ఇచ్చింది.

- **జనరల్‌గా గ్లామరస్ ఫీల్డ్‌లో ఉన్న అమ్మాయిలను ఆరాధిస్తారు కానీ 'మంచి'గా ఆలోచించే మనసు చాలామందికి ఉండదు. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోరు కూడా...**

మా ఇంట్లో నా ఇష్టాలను కాదనరు. క్లారిటీతో ఉంటాననే నమ్మకం వాళ్లకు ఉంది. మీరన్నట్లు హీరోయిన్‌లను అందరూ ఆరాధిస్తారు. కానీ పెళ్లి చేసుకోమంటే ఆ ఆరాధించేవాళ్లే ముందుకు రారు. 'వాళ్లు అలా అట.. ఇలా అట' అని ఊహించుకుంటారు. అబ్బాయిల గురించి కూడా అలాగే అనుకుంటారు. కానీ నేనేంటో నమితకు తెలుసు. తనేంటో నాకు తెలుసు. మాది 'ఆత్మబంధం'.

- **మీరు శ్రీకాకుళం (ఈస్ట్) అబ్బాయి. నమిత వెస్ట్ (సూరత్) అమ్మాయి. ఉంటున్నదేమో చెన్నైలో. మరి.. ఒకరి సంప్రదాయాలకు ఒకరు అలవాటయ్యారా?**

నమిత ఇప్పుడు సౌత్ అమ్మాయి. 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటోంది కాబట్టి, ఇక్కడి సంప్రదాయాలు బాగా తెలుసు. నాకు వాళ్ల ట్రెడిషన్స్ తెలియదు. వాళ్ల సంప్రదాయాలు ఎలా ఉంటాయో పెళ్లప్పుడు కొంచెం తెలిసింది. ఈస్ట్, వెస్ట్.. అండర్ వన్ రూఫ్. మనసులు కలిస్తే చాలండి. భాష, ప్రాంతం అడ్డుకావు.

- **కొత్త అల్లుణ్ణి ఇంటికి పిలుస్తుంటారు అత్తింటివాళ్లు. మిమ్మల్ని పిలిచారా?**

సూరత్ రమ్మని మా అత్తయ్య, మావయ్య పిలిచారు. కానీ మేం వెళ్లలేదు. బేసిక్‌గా నేనలా ఫార్మాలిటీస్ ఎక్స్‌పెక్ట్ చేసే అల్లుణ్ణి కాదు (నవ్వుతూ). చెన్నైలో చాలా పనులు ఉండటంవల్ల ఇంకోసారి వెళ్దామనుకున్నాం.

- **మీ అయిష్టాన్ని నమితగారి కోసం ఇష్టంగా మార్చుకున్నది ఏదైనా?**

నమితకు పిజ్జా, చాక్లెట్స్ ఇష్టం. నాకు అవంటే ఇష్టం ఉండదు. కానీ ఇప్పుడు ఇష్టంగా మార్చుకున్నాను. చాక్లెట్స్ తింటున్నాను.

“

- **మీ బ్యాగ్రౌండ్ ఏంటి?**

మా నాన్నగారు, అంకుల్ మయూరి ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్‌లో ఉండేవారు. నేను ఆర్టిస్ట్‌ని, ప్రొడ్యూసర్‌ని, రైటర్‌ని. ఇప్పుడు నేను, నమిత కలిసి ఒక కాన్సెప్ట్ అనుకున్నాం. మంచి కథలతో వచ్చే కొత్త డైరెక్టర్స్‌కి చాన్స్ ఇవ్వాలనుకుంటున్నాం. అలాగే, డబ్బుండి కూడా సినిమాలు ఎలా తీయాలో తెలియని ప్రొడ్యూసర్స్‌కి హెల్ప్ చేయాలనుకుంటున్నాం. వాళ్లు ఏ మాత్రం నష్టపోని విధంగా ఓ కాన్సెప్ట్ డిజైన్ చేశాం. సో.. నిర్మాతలను కూడా ఎంకరేజ్ చేద్దామనుకుంటున్నాం. నమిత అండ్ వీరని ట్రస్ట్ చేస్తే చాలు. టాలెంట్ ఉన్నవాళ్లు మమ్మల్ని ఎలా కలవాలో తెలియకపోతే veera.official అనేది నా ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్. దాని ద్వారా సంప్రదించవచ్చు.

- **నమితగారితో కలిసి మీరు యాక్ట్ చేశారా?**

మేమిద్దరం కలిసి 'మియా' అనే మలయాళ సినిమాలో భార్యాభర్తలుగా యాక్ట్ చేశాం. నేను విడిగా తమిళ్, మలయాళ సినిమాల్లో నెగటివ్, పాజిటివ్ క్యారెక్టర్స్ చేస్తుంటాను.

- **ఇప్పుడు మీరు, నమితగారు కలిసి నటిస్తారా?**

తప్పకుండా చేయాలని ఉంది. ఓ కాన్సెప్ట్ తయారు చేయించాం.

చెట్టు నీడ

దాచిన బంగారం

ఒక వ్యక్తి రోజూ తన ఇంటికి దగ్గర్లో ఉన్న పూలతోటకు వెళ్లొచ్చేవాడు. రోజూ అతడు అక్కడికి వెళ్లిరావడం దేనికంటే.. ఇంట్లోని బంగారు నగలు, నాణేలను అతడు ఆ తోటలోనే ఒక చోట గొయ్యి తవ్వి దాచిపెట్టాడు. అవి అక్కడ భద్రంగానే ఉన్నాయా అని చూసుకోడానికి వెళ్లేవాడు. వెళ్లి, ప్రతి రోజూ ఆ బంగారు నగల్నీ, నాణేలను గొయ్యిలోంచి పైకి తీసి, లెక్క పెట్టుకుని తిరిగి ఆ గొయ్యిలోనే పూడ్చి పెట్టి వచ్చేవాడు.



ప్రతీకాత్మక చిత్రం

కొన్నాళ్లుగా ఇదంతా గమనిస్తున్న ఓ దొంగ, ఓ రోజు ఆ గొయ్యి తవ్వి నగల్నీ, నాణేలను దోచుకెళ్లాడు. మర్నాడు తోటలోకి వెళ్లి చూసిన ఆ 'బంగారయ్య'కు గుండె గుభిల్లుమంది. లబోదిబోమని మొత్తుకున్నాడు. ''దేవుడా నా కష్టార్జితం అంతా దొంగల పాలయ్యింది'' అని శోకాలు పెట్టాడు. ఆ శోకాలు విన్న బాటసారి ఒకరు బంగారయ్య దగ్గరకు వచ్చి ''ఏం జరిగిందయ్యా.. ఎందుకు దుఃఖిస్తున్నావు?'' అని అడిగాడు. బంగారయ్య విషయం చెప్పాడు.

''ఇంట్లోనే దాచుకోలేకపోయావా? అవసరం అయినప్పుడు ఆ బంగారం నీకు అందుబాటులో కూడా ఉండేది'' అన్నాడు బాటసారి.

ఆ మాటకు బంగారయ్యకు కోపం వచ్చింది. ''ఖర్చు చెయ్యడానికైతే బంగారాన్ని దాచుకోవడం ఎందుకు?'' అన్నాడు.

ఆ మాటకు బాటసారి ఆశ్చర్యపోయాడు. ఒక రాయి తీసుకుని, బంగారయ్య బంగారం దాచుకున్న గొయ్యిలోకి విసిరేసి, ''గోతిలో పడిన ఆ రాయికి ఎంత విలువుందో, గోతిలో పాతిపెట్టిన నీ బంగారానికి అంతే విలువ ఉంటుంది. ఇందులో బాధపడేందుకు ఏముందీ. ఇంటికి వెళ్లిపో'' అనుకుంటూ వెళ్లిపోయాడు.

జీవితానికి పొదుపు అవసరమే. భవిష్యత్తుకు బంగారమూ అవసరమే. అయితే అవసరాలకు ఉపయోగించని పొదుపు, అవసరాలకు బయటికి తియ్యని బంగారం.. రెండూ.. ఏ విలువా లేని రాళ్లతో సమానం.

మార్టిన్ లూథర్‌కింగ్ డే

మూడో సోమవారం

● మాధవ్ శింగరాజు

జనవరి నెలలోని మూడో సోమవారం అంటే అమెరికన్‌లలో చాలామందికి ఇష్టం ఉండదు! 'ద మోస్ట్ డిప్రెసింగ్ డే ఆఫ్ ద ఇయర్'గా వాళ్లు ఫీలౌతారు. అప్పటికి క్రిస్మస్, న్యూ ఇయర్ అయిపోయి ఉంటాయి. ఆ రెండు రోజుల కోసం చేసిన అప్పులేవైనా ఉంటే అవి మిగిలి ఉంటాయి. కొత్త సంవత్సరపు తీర్మానాలు ఈ రెండు వారాల్లో బ్రేక్ అయి ఉంటాయి. అవన్నీ అలా ఉంచండి.. క్రిస్మస్‌లా, న్యూ ఇయర్‌లా.. ఎదురుచూడ్డానికి దగ్గర్లో ఇంకే పండుగలూ ఉండవు. అందుకని జనవరి మూడో సోమవారాన్ని 'బ్లూ మండే' అంటాడు క్లిఫ్ ఆర్నల్ అనే సైకాలజిస్టు. అంటే దిగుళ్ల సోమవారం అని. మనుషుల్లో స్ట్రెస్ లెవల్స్ పెరగడం మొదలయ్యే రోజట అది. 'ఇ ఈక్వల్స్ టు ఎంసీ స్క్వేర్' లాంటి లెక్కలేవో ఆయనకు ఉన్నాయి.

ఆ లెక్కల్ని పక్కన పెడితే, అమెరికాలో ఇవాళ నేషనల్ హాలిడే! నేషనల్ హాలిడే ఎందుకంటే ఇవాళ అక్కడ 'మార్టిన్ లూథర్ కింగ్ డే'. అమెరికాలో నల్లజాతి హక్కుల కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ని గుర్తు చేయడం కోసం (గుర్తు చేయడానికి, గుర్తు చేసుకోడానికి తేడా ఉంది) యేటా ప్రతి మూడో సోమవారం 'మార్టిన్ లూథర్ కింగ్ డే'ని జరుపుతోంది అమెరికా. (జరపడానికి, జరుపుకోడానికి తేడా ఉంది).

ఈ ఏడాది మార్టిన్ డే, మార్టిన్ బర్త్‌డే రెండూ ఒకేరోజు వచ్చాయి. జనవరి 15 మార్టిన్ బర్త్‌డే. మరి మార్టిన్ బర్త్‌డే నే, మార్టిన్ డే గా ప్రకటించవచ్చు కదా! ప్రకటించవచ్చు కానీ, ఎందుకనో అప్పటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ జనవరిలో వచ్చే మూడో సోమవారాన్ని 'మార్టిన్ లూథర్ డే' పేరిట జాతీయ సెలవు దినంగా ప్రకటించారు. 1983లో ఆయన ఆ హాలిడే బిల్లు మీద సంతకం చేస్తే, 1986 జనవరి మూడో సోమవారం తొలిసారిగా అమెరికాలో హాలిడే అమల్లోకి వచ్చింది. అయితే అమెరికాలోని మెజారిటీ రాష్ట్రాలు 'మార్టిన్ లూథర్ డే' ని గుర్తించలేదు! కొన్ని రాష్ట్రాలైతే, లూథర్ డే అని కాకుండా, ఇంకేదైనా పేరు పెడితేనే గుర్తిస్తాం అని పట్టుపట్టి కూర్చున్నాయి! 2000 నాటికి గానీ అమెరికా సంయుక్త రాష్ట్రాలన్నీ కలసి 'మార్టిన్ లూథర్ డే'ని నేషనల్ హాలిడేగా అంగీకరించలేకపోయాయి. బిల్లు మీద సంతకం పెట్టడానికి ముందు రొనాల్డ్ రీగన్ మనసు కూడా అందుకు అంగీకరించలేదు! మనసొప్పక, నల్లవాళ్లను నొప్పించలేక సంతకం పెట్టేశారు.

'ది మోస్ట్ డిప్రెసింగ్ డే ఆఫ్ ది ఇయర్‌గా' జనవరిలో వచ్చే మూడో సోమవారాన్ని బలపరచడానికి 'మార్టిన్ డే'ని కూడా ఒక కారణంగా చూపే తెల్ల అమెరికన్‌లు కూడా అక్కడ లేకపోలేదు. కనీస హక్కుల్ని సైతం పొందలేక.. డేస్, ఇయర్స్ మాత్రమే కాదు.. పుట్టినప్పట్నుంచీ డిప్రెసింగ్ లైఫ్‌నే గడుపుతున్న నల్లజాతి అమెరికన్ పౌరుల హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ని అమెరికన్ జాతీయులు ఈ మాత్రంగానైనా అంగీకరించడానికి చాలా సమయమే పట్టింది.



1966 ఆగస్టు 5 : చికాగోలో ప్రసంగిస్తున్నప్పుడు, ఆగంతకులెవరో తన తలపై విసిరిన రాయిని తప్పించుకునేందుకు మోకాలిపై కిందికి వంగిన మార్టిన్ లూథర్ కింగ్‌కు రక్షణగా నిలబడిన కార్యకర్తలు.

''ఓ రోజు వస్తుంది. ఆ రోజు అమెరికాలో నల్లవారందరికీ స్వేచ్ఛ, తెల్లవారందరితో సమానత్వం అనే నా కల నిజమౌతుంది'' అన్నారు మార్టిన్.. 'ఐ హ్యావ్ ఎ డ్రీమ్' అనే ప్రసంగంలో. మొన్న శుక్రవారం నాడు వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్.. 'మార్టిన్ డే' ఉద్ఘోషణ (ప్రొక్లమేషన్) మీద లాంఛనంగా సంతకం పెట్టిన రెండు రోజులకే, ఆఫ్రికా దేశాల పౌరులను ఉద్దేశించి 'షిట్‌హోల్స్' అనడం చూస్తుంటే, మార్టిన్ కల పూర్తిగా నిజం ఫలించిందా అన్న సందేహం కలుగుతుంది.

మనసులో చీకటిని పెట్టుకుని ఎన్ని దీపాలను వెలిగిస్తే మాత్రం ఏమిటి? మనిషి మీద గౌరవం లేకుండా ఎన్ని 'డే'లు జరిపితే మాత్రం ఏముంది?

సాక్షి ఫ్యామిలీ
సినిమా
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం
15-1-2018

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను ఒక అబ్బాయిని ఇష్టపడుతున్నా. నేను తనని వాళ్ల అన్నయ్య పెళ్లిలో చూశాను. అప్పటి(సిక్స్ ఇయర్స్) నుంచీ ప్రేమిస్తున్నా. తనకి ఒక సారి వాట్సాప్‌లో మెసేజ్ చేశాను. రిలేటివ్స్ కావడంతో తనూ బాగానే మాట్లాడాడు. తరువాత ఫోన్స్ కూడా చేసుకున్నాం. అంతా బాగానే ఉంది కానీ, తనకంటే నేను ఐదేళ్లు చిన్నదాన్ని. నా లవ్ విషయం తనకి చెబితే ఎలా రియాక్ట్ అవుతాడో.. చిన్నపిల్లలా చూస్తాడేమోనని డౌట్‌గా ఉంది అన్నయ్యా. నన్ను ఏం చెయ్యమంటారు? ఈ చిట్టి చెల్లికి మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– వాసుకి

చిట్టి తల్లి.. లవ్ యు రా..

అసలు టెన్షన్ పడొద్దు...!

నువ్వు ఏమి చదువుకుంటున్నావో చెప్పలేదు..

కెరీర్‌లో ఏం చెయ్యబోతున్నావో చెప్పలేదు..

కానీ, నువ్వు బాగా ఫోకస్డ్‌గా ఉన్నావని అనుకుంటూ..

ఈ సమాధానం చెబుతున్నాను.

మీకు వయసులో ఎంత తేడా ఉందన్నది ఇంపార్టెంట్ కాదు..

మీ ఇద్దరి మధ్య ఆలోచనలలో, అవగాహనలో, జీవితం మీద గురిలో...

ఎంత తేడా ఉందో తెలుసుకో చెల్లెమ్మా..!!

'అవన్నీ తేడాగా ఉంటే వర్కౌట్ కాదా సార్!?'

నాకు నువ్వు జామకాయ ఇచ్చి....

అరటిపండు తిన్నంత సంతోషంగా ఫీల్ అవ్వండి అంటే ఎలా ఉంటుందో...

వాళ్లిద్దరి మధ్యలో ప్రవృత్తులలో తేడాలు ఉంటే అలానే ఉంటుంది!

'అయితే చిట్టి బంగారం ప్రేమ... కాయా..? పండా సార్??'

పండు లాంటి జీవిత లక్ష్యాలు ఉంటే కాయ కూడా పండవ్వద్దీ నీలూ..!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

	9							4
	2	7	4					3
	8	4	2	5			9	
7	5	2		3				
9	6						1	2
				6		7	5	8
	7			1	8	4	2	
8					4	9	3	
2							6	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	6	9	4	8	2	3	5	1
6	4	3	1	7	8	9	2	5
2	1	8	5	9	3	4	6	7
8	7	1	6	2	4	5	9	3
9	2	4	7	3	5	8	1	6
5	3	6	8	1	9	7	4	2
3	9	7	2	4	6	1	5	8
1	8	2	9	5	7	6	3	4
4	8	5	3	8	1	2	7	9

ముగ్గు-ముచ్చట

10 చుక్కలు
10 వరుసలు





సంపంగి గీతిక
6వ తరగతి
స్లేట్ స్కూల్
డిఫెన్స్ కాలనీ,
కర్మన్‌ఘాట్,
హైదరాబాద్

సుభిక్షం



'నాకెంత దాహమేసిందో నా మొక్కలకూ అంతే దప్పిక కదా. నాకు నా వాళ్లు నీళ్లిచ్చారు. మరి వాటికి నేనే కదా వాళ్ల వాడిని. మబ్బును వంచి, మొయిలును తుంచి, మొక్క మొక్క మీదా పిండి నీళ్లు కురిపించాలని ఉంటుంది నాకు. అది కుదిరేపని కాదు కదా' అంటాడు రైతు.

శ్రమణీయం... రమణీయం!

అప్పటి వరకూ ఎండలో తిరిగి తిరిగి అప్పుడే ఇంటికి చేరాడాయన. కాసిన్ని నీళ్లవ్వమంటే ఆలి కుండలోంచి మంచినీళ్లిచ్చింది. చల్లటి ఆ నీళ్లు హాయిగా గొంతు దిగుతున్నాయి. కాసేపు ఆ సుఖాన్ని అనుభవిస్తున్నవాడు కాస్తా గబుక్కున లేచాడు. చివరి నీటి గుక్క గొంతుదాటేలోపు ఆయన అడుగు గడప దాటింది. వసారాన కావడి భుజం చేరింది. ఇంటి దగ్గరి తొలి అడుగు పొలం వైపునకు పరుగయ్యింది.

''చల్లటి నీళ్లు గొంతు తడుపుతుంటే... ఆ హాయి నీ మనసు తడుముతుంటే... అనుభవిస్తూ కూర్చోక అంత వేగంతో ఎందుకు కదిలావూ...?'' అడిగింది మనస్సాక్షి. ''నేనంత హాయిని అనుభవించా కదా. మరి నా బిడ్డలక్కడ నీళ్లు లేక ఎప్పట్నుంచి ఎండుతున్నాయో! మరి వాటికీ ఆ హాయి వద్దా?'' అంటూ ఎదురుప్రశ్నించాడాయన. ఎవరయ్యా ఆయన... అవును... రైతయా ఆయన.

''పొలంలో మొక్క పదిలంగానే ఉంటుందిలే. వానేమో పడలేదు. రేపైనా పడుతుందేమోలే. కాసేపు నీడపట్టున కూర్చోకపోయావా?'' మళ్లీ అడిగింది మనస్సాక్షి.

''నాకెంత దాహమేసిందో నా మొక్కలకూ అంతే దప్పిక కదా. నాకు నా వాళ్లు నీళ్లిచ్చారు. మరి వాటికి నేనే కదా వాళ్ల వాడిని. మబ్బును వంచి, మొయిలును తుంచి, మొక్క మొక్క మీదా పిండి నీళ్లు కురిపించాలని ఉంటుంది నాకు. అది కుదిరేపని కాదు కదా. అందుకే ఇలా బయల్దేరా'' మనస్సాక్షికి సమాధానమిచ్చాడు రైతు.

అవును... రైతంటే అంతేమరి. సాధ్యం కానివీ, చేయాలనుకునేవాటినీ చేయాలనుకునేవాడే సేద్యగాడు మరి. చిన్నప్పుడు అందరూ ప్రకృతి వికృతి చదువుకున్నారు కదా. సాధ్యగాడు అనే మాట ప్రకృతి అయితే దాని వికృతి రూపమే సేద్యగాడేమో!?

తల్లీ బిడ్డల్ని చూసుకున్నట్టుగానే చేను–మొక్కల్ని తాను చూస్తాడు. అరకపట్టీ మెరకదున్నీ చదునుచేసీ నాట్లు వేసి మొక్క మొలిచీ మొలవగానే... పసిబిడ్డలా దాన్ని పట్టుబట్టి సాకుతాడు. గిట్టుబాటు అవుతుందా లేదా అని కూడా లెక్క చూడడు. బిడ్డల ఖర్చును ఎవడైనా లెక్క చూస్తాడా? హాలికుడూ అంతే... నిజానికి రైతు లెక్క చూస్తే నాగలి కూడా మిగలదు. దాన్ని చేయించడమూ కుదరదు. పొలం ఏండిన ఏడూ... చేను పండని ఏడు పాట్లెక్కువ. అరకొర పండినా మార్కెట్లో అగచాట్లెక్కువ. పండించాక కూడా దళారీ జేబులోని నోట్లూ ఎక్కువ. కానీ... తనకు మాత్రం గిట్టుబాటు తక్కువ. అయినా సరే... రైతు లెక్క చూడడు. అలాంటి వాడు లెక్క చూడటం మొదలు పెట్టి మొక్క మొక్కకూ లెక్కవేసి, గిట్టుబాటు కాదంటూ కాస్తా పాడుబడితే... చేను కాస్తా బీడుపడతది. రైతు క్షేమమే కదా రాజ్య క్షేమం. రైతు భాగ్యమే కదా రాజ్య భాగ్యం. అప్పుడు రైతు గోసపడితే రాజూ గోసపడాల్సి వస్తుంది. ఎందుకంటే... రాజనాలు పండించే వాడే పస్తుంటే పరమాత్మకూ పస్తే అంటారు. ఇక ఆ తర్వాత రాజనగా ఎంత... మహారాజనగా ఎంత!

అందుకే వాడు తాను చెడ్డా చేను చెడనివ్వడు. పొలం పొత్తిళ్లలోని మొక్కల చాళ్లలో నీళ్లు కావిళ్లతో పోసి, ప్రతి మొక్క మొదళ్లలోనూ అంతో ఇంతో తడి ఉండేలా చేసి, మర్నాడు మధ్యాహ్నం ఎండపూటన వచ్చి... మట్టిలో వేళ్లు గుచ్చి... తడి ఇంకా ఉందా... నేల పొడి బారిందా అంటూ మాటిమాటికీ చూసుకుంటాడు. ఒకరిద్దరు బిడ్డలున్న తల్లి పని కాస్త సులువు. కానీ పొలంలో ప్రతి మొక్కా రైతుకు బిడ్డేగా. అందుకే మొక్క మొక్కకూ ఆ హలజీవి కావిడి నీళ్లతో పెట్టే తడి ముద్దుతోనేనేమో... రైతులోని ఆ అమ్మదనం – మన కంచంలో కమ్మదనంగా మారి నోటికి ఇంత ముద్దగా రుచిగా అందుతోంది.

అందుకే కాలం కాకున్నా... పొలం పండకున్నా... ఏటికేడాది నష్టం వస్తున్నా లాభం లేకున్నా చీడ ఆశించినా... పీడ పట్టేసినా వదల కుండా చేనుకాపలాదారు కనిపెట్టుకొని ఉంటూ ఆలా సేద్యాన్ని చేస్తూనే ఉంటాడా వ్యవసాయదారు. 'ఎందుకయా ఇంత బాధ' అంటూ మన స్సాక్షి ఆ కమతగాణ్ణి అడిగితే ఆయనంటాడూ... 'చేనుకి గట్టూ... ఊరికి కట్టూ' ఉండాలేమోగానీ 'రైతుకు బెట్టు ఎందుకయా... పొలం బెట్టగొట్టుకు పోయినా రైతు వ్యవసాయం మానొద్దు. ఎందుకంటే చేను చేసి ఎవడూ చెడిందీ లేదూ... చెడు చేసి ఎవడూ బతికిందీ లేదు' అంటూ ఏటికేటికి నష్టాలు వస్తున్నా మాటిమాటికి అదే సమాధానమిస్తుంటాడు. 'నేను సాగు చేస్తే పెంట కూడా పంటవుతుంది. నేను గడ్డి వేస్తే అదే ఊళ్లో పాడి అవుతుంది. పదిమందికీ ఆఖరికి పరమాత్మకూ పరమాన్నం పెట్టేవాడిని నేనే. అలాంటి నేను కాడి దించేస్తే ఎలా?'' అందుకే మనం ముద్ద ముద్దకూ ఆయన్నే కొలవాలి. ముద్ద తినేముందర ఆయన్నే తలవాలి. ఇకపై మన ప్రతి పనీ ఒకటే మాటను గుర్తుపెట్టుకొని చేయాలి.

అదేమిటంటే...

చేలు పండాలి. రైతు గుండె నిండాలి. ఊరు నిబ్బరంగా, నిశ్చింతగా, నిర్భయంగా ఉండాలి. లోకం సుక్షేమంగా నిక్షేపంగా సుభిక్షంగా ఉండి తీరాలి.

– యాసీన్

వైఫ్ ఆఫ్ రామ్

వినూత్న క్యారెక్టర్‌లు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ మూవీస్ చేస్తూ నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు లక్ష్మీ మంచు. ప్రస్తుతం 'వైఫ్ ఆఫ్ రామ్' అనే సినిమాతో మరో కొత్త కాన్సెప్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో అబద్ధాన్ని నిజమని నమ్మే పాత్రలో కనిపిస్తారట లక్ష్మి. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా టైటిల్ లోగోను రిలీజ్ చేశారు. 'ఈగ', 'బాహుబలి 1' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన విజయ్ యలకంటి ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సామ్రాట్ రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, శ్రీకాంత్ అయ్యర్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. కృతి ప్రసాద్, విద్యా నిర్వాణ మంచు, ఆనంద్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాకు సంగీతం: రఘు దీక్షిత్, కెమెరా: సామల భార్గవ్, మాటలు: సందీప్ గుంటా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుహాసిని రాహుల్.



● లక్ష్మీ ప్రసన్న

నో మోర్ డౌట్స్



● దీపికా పదుకోన్

నో డౌట్స్. 'పద్మావత్' సినిమా గురించి ఇక నో మోర్ డౌట్స్. సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో దీపికా పదుకోన్, రణ్‌వీర్‌సింగ్, షాహిద్‌కపూర్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పద్మావత్'. ఈ సినిమాను ఈ నెల 25న రిలీజ్ చేయనున్నారు. ''ఈ నెల 25న 3డీ, ఐ–మ్యాక్స్ 3డీ వెర్షన్‌లతో పాటుగా తమిళ, తెలుగు భాషల్లో 'పద్మావత్' సినిమాను రిలీజ్ చేయబోతున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఇదే రోజున అక్షయ్‌కుమార్ నటించిన 'ప్యాడ్‌మ్యాన్' రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే.



నాగచైతన్య, సమంతల వివాహం అయిన తర్వాత వచ్చిన ఫస్ట్ సంక్రాంతి ఇది. ఆపై వీకెండ్. ఇక చెప్పేదేముంది. అలా హుషారుగా జాలీగా షికారు వెళ్లారట చై-సామ్. "వీకెండ్ వైబ్స్... షార్ట్ ట్రిప్స్... లవ్ అండ్ అడ్వెంచర్...చై లవ్" అని మీరు చూస్తోన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు సమంత.



భోగి మంట సంబరాల్లో హీరోయిన్ శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రా, ఆమె కుమారుడు వియాన్ రాజ్‌కుంద్రా.



కూతురు ఆరాధనతో తమిళ హీరో శివ కార్తికేయన్ సంక్రాంతి సంబరాలు







సంక్రాంతి వేడుకలకు ముస్తాబైన హీరోయిన్లు వేదిక, అతుల్య, వరలక్ష్మి శరత్‌కుమార్...

డిజైన్ రథం





తుర్లపాటి ప్రత్యూష
అత్తాపూర్
హైదరాబాద్


రథం ముగ్గు
15 చుక్కల నుండి
1 చుక్క వచ్చేవరకు
చుక్కలు చూసి
పెట్టుకోవాలి.





శాంతి
దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్

పూల రథం
25 చుక్కల నుండి
1 చుక్క వచ్చేవరకు
చుక్కలు చూసి
పెట్టుకోవాలి.





గోకవరపు సుహాసిని
రాబర్ట్‌సన్ పేట
మచిలీపట్నం

సాక్షి ఫ్యామిలీ
సినిమా
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం
15-1-2018

రారండోయ్ పండగ చేద్దాం!

చిన్నా పెద్దా తేడా లేదు. అక్కడ, ఇక్కడ అన్న బేధాలు లేవు. కామన్ మేన్ అయినా సెలబ్రిటీ అయినా.. ఎవరైనా ఒకటే. అందరి ఆలోచనా ఒకటే. పండగ చేసుకోవాలి. 'రారండోయ్ సంక్రాంతి పండగ చేద్దాం' అంటూ, ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో వారి ఫొటోలు పోస్ట్ చేశారు కొందరు నటీనటులు.



• కూతురు మంజుల, మనవరాలు జాన్వీతో కృష్ణ

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. పండగ రోజు మా నాన్నగారితో టైమ్ స్పెండ్ చేయడం చాలా హ్యాపీగా ఉందన్నారు మంజుల.

నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఛలో'. "ఈ నెల 25న జరగనున్న 'ఛలో' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా రావడానికి చిరంజీవిగారు ఒప్పుకున్నారు. థ్యాంక్స్ సర్. భోగి రోజున నా ఆనందానికి అవధులు లేవు" అన్నారు నాగశౌర్య. ఈ చిత్రాన్ని వచ్చే నెల 2న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.





అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సెలబ్రేషన్‌లో భాగంగా రామ్ చరణ్, నిహారిక, వైష్ణవ్ తేజ్‌లతో తాము ఉన్న గ్రూప్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు సాయిధరమ్ తేజ్, వరుణ్ తేజ్.



అందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ.. నివేథా థామస్, అనుపమా పరమేశ్వరన్, రీతూ వర్మ తమ లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు.



భోగి మంట సంబరాల్లో సంపూర్ణేష్ బాబు, హృదయ కాలేయం దర్శకుడు-కొబ్బరిమట్ట నిర్మాత సాయి రాజేష్.





ఆదివారం ఉదయం జైసల్మేర్‌లో హిందీ చిత్రం 'అయ్యారీ' టీమ్‌తో కలిసి భోగి పండగ వేడుకల్లో పాల్గొన్నారు హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్.

అదిరిపోయే డైలాగ్స్!

డైలాగ్స్ చెప్పడంలో మోహన్‌బాబు స్టైలే డిఫరెంట్. స్క్రీన్‌పై ఆయన డైలాగ్స్ చెబుతుంటే ప్రేక్షకుల రెస్పాన్స్ ఓ రేంజ్‌లో ఉంటుంది. త్వరలో విడుదల కాబోతున్న 'గాయత్రి'లో పవర్‌ఫుల్ డైలాగ్స్ చాలా ఉన్నాయి. మోహన్‌బాబు, విష్ణు, శ్రియ, నిఖిలా విమల్ ముఖ్య తారలుగా ఆర్.మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'గాయత్రి'. శ్రీలక్ష్మీప్రసన్న పిక్చర్స్ పతాకంపై అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదల అయ్యింది. టీజర్‌లో మోహన్‌బాబు చెప్పిన డైలాగ్స్ అదిరిపోయేలా ఉన్నాయని ప్రేక్షకులు అంటున్నారు. ''మోహన్‌బాబుగారి నటన ఈ సినిమాకు కొండంత అండ'' అని చిత్రబృందం చెబుతోంది. అనసూయ, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీత దర్శకుడు. 'గాయత్రి' చిత్రాన్ని ఫిబ్రవరి 9న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



• మోహన్‌బాబు

కృష్ణ... ఊర మాస్

ఎర్ర చొక్కా.. నల్ల బనియన్.. గళ్ల లుంగీ.. మెడలో తాయత్తు.. కత్తులను తలపిస్తున్న కోరమీసాలు.. రఫ్ గడ్డం.. పదునైన చూపులు.. సంక్రాంతి సందర్భంగా ఇలా పక్కా మాస్ లుక్‌లో ప్రత్యక్షమయ్యారు నాని. ఆయన తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తోన్న సినిమా 'కృష్ణార్జున యుద్ధం'. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి సమర్పణలో సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్, రుక్సార్ మీర్ కథానాయికలు. కృష్ణ పాత్రలో నాని ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సరికొత్త నానీని తెరపై చూడనున్నారు. ప్రస్తుతం చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. హిప్ హాప్ తమిళ స్వరాలు, కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఏప్రిల్ 12న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు.



• నాని


ట్యాప్‌తో టాప్ లేపాడు!



• కల్యాణ్‌రామ్

మంచి చేయాలనుకున్నాడు. వీలైనంత ఎక్కువ మందికి, వీలైనంత ఎక్కువగా మంచి చేయాలనుకున్నాడు. అందుకోసం ఎమ్మెల్యే అవ్వాలని డిసైడై ట్యాప్‌తో ప్రజల్లోకి వెళ్లి ప్రత్యర్థుల టాప్ లేపాడు. మధ్యలో ఈ ట్యాప్ ఏంటీ? అనుకోకండి. అది ఎమ్మెల్యే పార్టీ గుర్తు అన్నమాట. కల్యాణ్‌రామ్ హీరోగా ఉపేంద్ర మాధవ్ దర్శకునిగా పరిచయం అవుతున్న చిత్రం 'ఎమ్మెల్యే'. 'మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి' అనేది క్యాప్షన్. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ సమర్పణలో ఎల్‌ఎల్‌పి అండ్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్త నిర్మాణంలో సి. భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేసిన టీజర్‌కు విశేష స్పందన వస్తోందని చిత్రబృందం చెబుతోంది. ''కల్యాణ్‌రామ్ కెరీర్‌లో మంచి చిత్రంగా నిలుస్తుంది. ఉపేంద్ర మాధవ్ వినోదభరితంగా తెరకెక్కిస్తున్నారు. మార్చిలో సినిమాను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమాలో న్యూ లుక్‌లో స్టైలిష్‌గా కల్యాణ్‌రామ్ కనిపిస్తారు'' అన్నారు ఉపేంద్ర మాధవ్.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 15-1-2018




ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్‌డ్రాలో యూకీ

భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీ ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్‌డ్రాకు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ టోర్నమెంట్ ఫైనల్లో 25 ఏళ్ల యూకీ బాంబ్రీ 1-6, 6-3, 6-3తో పీటర్ పొలాన్‌స్కీ (కెనడా)పై గెలుపొందాడు. ఆస్ట్రేలియా ఓపెన్ తొలిరౌండ్‌లో సిప్రస్‌కు చెందిన మార్కస్ బాగ్దటిస్‌తో బాంబ్రీ తలపడతాడు. మరోవైపు తొలిసారి ఈ మెగాటోర్నీకి చేరువగా వచ్చిన రామ్‌కుమార్ రామ్‌నాథన్‌కు నిరాశ ఎదురైంది. ఫైనల్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో రామ్‌కుమార్ 4-6, 6-4, 4-6తో వాసెక్ పోస్పిసిల్ (కెనడా) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

అతనొక్కడే

- విరాట్ కోహ్లి సమయోచిత బ్యాటింగ్
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 183/5
- మరో 152 పరుగులు వెనుకబడి ఉన్న టీమిండియా
- దక్షిణాఫ్రికా 335 ఆలౌట్

సెంచూరియన్‌లో ఇంకా సెంచరీ మోత మోగలేదు కానీ భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అంతకంటే విలువైన ఇన్నింగ్స్ ఆడాడు...వరుస బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయిన దశలో బరిలోకి దిగి ముందుండి జట్టును నడిపించాడు... తుదికంటా నిలిచి రెండో టెస్టులో మన ఆశలు నిలబెట్టాడు... మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు తీసి దక్షిణాఫ్రికా ఆధిపత్యం ప్రదర్శించినా, కోహ్లి అడ్డుగోడ రెండో రోజును పూర్తిగా వారిది కాకుండా చేసింది. మొత్తంగా చూస్తే సఫారీలను తొందరగా ఆలౌట్ చేయడంతో పాటు బ్యాటింగ్‌లో కుప్పకూలని భారత్... కొన్ని అదనపు పరుగులు జోడించడంతో పాటు ఐదు ప్రధాన వికెట్లు పడగొట్టిన దక్షిణాఫ్రికా ఆదివారం ఆటను చెరి సగం పంచుకున్నాయి. బౌలింగ్‌కు పెద్దగా అనుకూలించని పిచ్‌పై మూడో రోజు పాండ్యా, అశ్విన్ అండతో కోహ్లి చెలరేగితే భారత్‌కు మంచి ఆధిక్యం దక్కవచ్చు.



కోహ్లి

సెంచూరియన్: భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు అనేక మలుపుల తర్వాత రెండో రోజు దాదాపు సమాన స్థితిలో నిలిచింది. ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ప్రస్తుతం విరాట్ కోహ్లి (130 బంతుల్లో 85 బ్యాటింగ్; 8 ఫోర్లు) సెంచరీకి చేరువ కాగా, హార్దిక్ పాండ్యా (11 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు. టీమిండియా ఇంకా 152 పరుగులు వెనుకబడి ఉంది. అంతకు ముందు దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ (142 బంతుల్లో 63; 9 ఫోర్లు) అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా...అశ్విన్‌కు 4, ఇషాంత్‌కు 3 వికెట్లు దక్కాయి.



డు ప్లెసిస్ క్లీన్‌బౌల్డ్

23.5 ఓవర్లలో...

ఓవర్‌నైట్ స్కోరు 269/6తో ఆట ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ కెప్టెన్ డు ప్లెసిస్ ముందుండి నడిపించాడు. 27 పరుగుల వద్ద డు ప్లెసిస్ ఎల్బీ అవుట్ కోసం అప్పీల్ చేసి భారత్ రివ్యూ కోల్పోయింది. ఎట్టకేలకు మహరాజ్ (18)ను షమీ అవుట్ చేయడంతో 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇది షమీకి 100వ వికెట్ కావడం విశేషం. అయితే ఆ తర్వాత భారత్ ఫీల్డింగ్ వైఫల్యం కూడా సఫారీలకు కలిసొచ్చింది. అశ్విన్ బౌలింగ్‌లో 1 పరుగు వద్ద వరుస బంతుల్లో రబడ ఇచ్చిన క్యాచ్‌లను భారత ఫీల్డర్లు వదిలేశారు. ముందుగా స్లిప్‌లో కోహ్లి పొరపాటు చేయగా, షమీతో సమన్వయ లోపంతో పాండ్యా చేతుల్లో పడిన బంతిని వదిలేశాడు. 54 వద్ద డు ప్లెసిస్ క్యాచ్‌ను కూడా పార్థివ్ నేలపాలు చేశాడు. కెప్టెన్‌కు అండగా నిలిచిన రబడ (11)ను ఇషాంత్ అవుట్ చేయడంతో 42 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత డు ప్లెసిస్‌ను కూడా ఇషాంతే పెవిలియన్ పంపించగా...తర్వాతి ఓవర్లో మోర్కెల్ (6) వికెట్‌తో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. రెండో రోజు ఆ జట్టు మొత్తం 66 పరుగులు జోడించింది.

వరుస బంతుల్లో...

భారత జట్టుకు మరోసారి పేలవమైన ఆరంభం లభించింది. ధావన్ స్థానంలో చోటు దక్కించుకున్న రాహుల్ (10) తనపై ఉంచిన బాధ్యతను నెరవేర్చలేకపోయాడు. మోర్కెల్ బౌలింగ్‌లో పేలవ షాట్‌తో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. తర్వాతి బంతికే భారత్‌కు మరో షాక్ తగిలింది. తాను ఎదుర్కొన్న తొలి బంతికే పుజారా (0) లేని సింగిల్ కోసం ప్రయత్నించి ఇన్‌గిడి త్రోకు రనౌట్‌గా వెనుదిరిగాడు. ఈ దశలో కోహ్లి, విజయ్ (126 బంతుల్లో 46; 6 ఫోర్లు) కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కోహ్లి ఆరంభంనుంచే ధాటిని ప్రదర్శించగా, విజయ్ తనదైన శైలిలో నెమ్మదిగా ఆడాడు. పిచ్ మరీ ఇబ్బందికరంగా లేకపోవడంతో పాటు దక్షిణాఫ్రికా బౌలింగ్ కూడా అసాధారణంగా ఏమీ లేకపోవడంతో ఇద్దరు బ్యాట్స్‌మెన్ క్రీజ్‌లో నిలదొక్కుకున్నారు. మధ్యలో కొన్ని మంచి బంతులు పడ్డా...పెద్ద ఇబ్బంది లేకపోవడంతో భాగస్వామ్యం 50 పరుగులు దాటింది.

కోహ్లి నిలకడ...

టీ విరామం తర్వాత కోహ్లి 68 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే మహరాజ్ బౌలింగ్‌లో పదే పదే బంతిని కట్ చేసేందుకు ప్రయత్నించిన విజయ్ చివరకు అదే బంతికి అవుట్ కాగా, రోహిత్ శర్మ (10) టెస్టుల్లో తన వైఫల్యాన్ని కొనసాగించాడు. ఈ దశలో పార్థివ్ (19) కొద్ది సేపు కోహ్లికి అండగా నిలిచినా, అతని ఆట కూడా ఎక్కువ సేపు సాగలేదు. ఇన్‌గిడి తొలి వికెట్‌గా అతను వెనుదిరిగాడు. ఈ దశలో కొన్ని ఉత్కంఠ క్షణాలు ఎదుర్కొన్నా...భారత బ్యాట్స్‌మెన్ మరో ప్రమాదం లేకుండా బయట పడ్డారు. కోహ్లి, పాండ్యా మరో 7.2 ఓవర్లు జాగ్రత్తగా ఆడటంతో దక్షిణాఫ్రికా మరో వికెట్ తీయడంలో విఫలమైంది. పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తుందనే భావనతో దక్షిణాఫ్రికా ఈ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌ను కేశవ్ మహరాజ్‌తో వేయించింది. ఎప్పుడో 1912లో దక్షిణాఫ్రికా ఇలా స్పిన్నర్ (ఆబ్రీ ఫాల్క్‌నర్)తో తొలి ఇన్నింగ్స్ బౌలింగ్ ప్రారంభించిన తర్వాత 106 ఏళ్లకు ఇలా చేయడం విశేషం.

7 షమీ టెస్టుల్లో 100 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. భారత్ నుంచి ఈ మైలురాయి చేరిన ఏడో ఫాస్ట్ బౌలర్ అతను. 29 టెస్టుల్లో ఈ ఘనత సాధించిన అతను కపిల్ (25), ఇర్ఫాన్ పఠాన్ (28) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31; మార్క్‌రమ్ (సి) పార్థివ్ పటేల్ (బి) అశ్విన్ 94; ఆమ్లా (రనౌట్) 82; డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20; డు ప్లెసిస్ (బి) ఇషాంత్ శర్మ 63; డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0; ఫిలాండర్ (రనౌట్) 0; కేశవ్ మహారాజ్ (సి) పార్థివ్ పటేల్ (బి) షమీ 18; రబడ (సి) పాండ్యా (బి) ఇషాంత్ శర్మ 11; మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6; ఇన్‌గిడి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (113.5 ఓవర్లలో) 335 ఆలౌట్.**

వికెట్ల పతనం: 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251, 7-282, 8-324, 9-333, 10-335.

బౌలింగ్: బుమ్రా 22-6-60-0, షమీ 15-2-58-1, ఇషాంత్ శర్మ 22-4-46-3, పాండ్యా 16-4-50-0, అశ్విన్ 38.5-10-113-4.

భారత్ ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) మహారాజ్ 46; రాహుల్ (సి అండ్ బి) మోర్కెల్ 10; పుజారా (రనౌట్) 0; కోహ్లి బ్యాటింగ్ 85; రోహిత్ శర్మ ఎల్బీడబ్ల్యూ (బి) రబడ 10; పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) ఇన్‌గిడి 19; పాండ్యా బ్యాటింగ్ 11; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (61 ఓవర్లలో 5 వికెట్లకు) 183.**

వికెట్ల పతనం: 1-28, 2-28, 3-107, 4-132, 5-164.

బౌలింగ్: కేశవ్ మహారాజ్ 16-1-53-1, మోర్కెల్ 15-3-47-1, ఫిలాండర్ 9-3-23-0, రబడ 12-0-33-1, ఇన్‌గిడి 9-2-26-1.

పంత్ సూపర్ ఫాస్ట్

- 32 బంతుల్లో సెంచరీ చేసిన ఢిల్లీ బ్యాట్స్‌మన్
- టి20ల్లో గేల్ తర్వాత రెండో స్థానం
- భారత్ తరపున ఫాస్టెస్ట్ సెంచరీ



న్యూఢిల్లీ: వారం క్రితమే రిషభ్ పంత్‌ను ఢిల్లీ జట్టు కెప్టెన్సీ నుంచి తప్పించారు. దానికి తానేమీ కుంగిపోలేదని... చేతల్లో చూపెట్టాడు. వేగవంతమైన చరిత్రలో భాగమయ్యాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టి20 ట్రోఫీలో పంత్ (38 బంతుల్లో 116 నాటౌట్; 8 ఫోర్లు, 12 సిక్సర్లు) సుడిగాలి ఇన్నింగ్స్‌తో క్రిస్ గేల్‌ను తలపించాడు. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. భారత్ తరపున వేగవంతమైన రికార్డుకు వేదికైన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 10 వికెట్ల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై ఘన విజయం సాధించింది. ఆదివారం ఫిరోజ్ షా కోట్ల స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్ ప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. నిఖిల్ గాంగ్టా (40) మెరుగ్గా ఆడాడు. ఢిల్లీ బౌలర్ సాంగ్వాన్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ తరపున రిషభ్ పంత్ సిక్సర్ల జడివాన కురిపించాడు. దీంతో కేవలం 11.4 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఢిల్లీ విజయాన్నందుకుంది. ఆకాశమే హద్దుగా చెలరేగిన పంత్ 18 బంతుల్లో అర్ధసెంచరీని, మరో 14 బంతుల్లో సెంచరీని పూర్తిచేశాడు. నిజానికి మెరుపు సెంచరీ అతనికేమీ కొత్తకాదు. 2016లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 48 బంతుల్లో సెంచరీ చేసిన దేశవాళీ బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు. ఇటీవల శ్రీలంకపై రోహిత్ (35 బంతుల్లో సెంచరీ) చేసిన సెంచరీ కూడా అతని దాటికి వెనుకబడింది. పంత్ కంటే ముందు వరుసలో ఒకే ఒక్కడు గేల్ (30 బంతుల్లో 100) ఉన్నాడు. 2013 ఐపీఎల్‌లో పుణే వారియర్స్‌పై బెంగళూరు తరపున గేల్ ఈ ఘనత సాధించాడు.

పీబీఎల్ చాంప్ హైదరాబాద్

ఫైనల్లో బెంగళూరుపై 4-3తో గెలుపు



మారిన్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై, సొంత ప్రేక్షకుల మధ్య హైదరాబాద్ హంటర్స్ గర్జించింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) మూడో సీజన్‌లో విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో హైదరాబాద్ 4-3 స్కోరుతో బెంగళూరు బ్లాస్టర్స్‌పై విజయం సాధించింది. మొదట పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో మార్కిస్ కిడో- యూ ఇయాన్ సియాంగ్ (హంటర్స్) 9-15, 10-15తో మథియాస్ బోయె- కిమ్ సా రంగ్ చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల సింగిల్స్ హంటర్స్‌కు ట్రంప్ మ్యాచ్ కాగా లీ హ్యూన్ ఇల్ 15-7, 15-13తో శుభాంకర్ డేపై గెలుపొందడంతో హైదరాబాద్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది అయితే తర్వాత రెండో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ను బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకుంది. ఈ పోరులో సాయిప్రణీత్ (హంటర్స్) 8-15, 10-15తో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్సన్ చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో హైదరాబాద్ 2-3తో వెనుకబడింది. అనంతరం జరిగిన మహిళల సింగిల్స్‌లో ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ (హంటర్స్) 15-8, 15-14తో గిల్మోర్‌పై గెలుపొందడంతో స్కోరు 3-3తో సమమైంది. ఈ దశలో కీలకమైన మిక్స్‌డ్ డబుల్స్‌లో పియా జెబదియా-సాత్విక్ సాయిరాజ్ (హంటర్స్) 15-11, 15-12తో సిక్కిరెడ్డి-కిమ్ సా రంగ్‌పై విజయం సాధించడంతో హైదరాబాద్ పీబీఎల్‌లో తొలిసారి చాంపియన్‌గా నిలిచింది.

ఆసీస్‌ను చితగ్గొట్టారు

100 పరుగులతో భారత్ జయభేరి



మౌంట్ మాంగనీ (న్యూజిలాండ్): ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో భారత్ 100 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 328 పరుగులు చేసింది. కెప్టెన్ పృథ్వీ షా (100 బంతుల్లో 94; 8 ఫోర్లు, 2 సిక్సర్లు), మన్‌జోత్ కల్రా (99 బంతుల్లో 86; 12 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మాన్ గిల్ (54 బంతుల్లో 63; 6 ఫోర్లు, 1 సిక్స్) సత్తాచాటారు. తర్వాత కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 42.5 ఓవర్లలో 228 పరుగుల వద్ద ఆలౌటైంది. బౌలింగ్‌లో పేసర్లు కమలేశ్ నాగర్‌కోటి (3/29), శివమ్ మావి (3/45) నిప్పులు చెరిగారు. దీంతో క్రమంగా వికెట్లు పడటంతో ఏ దశలోనూ ఆస్ట్రేలియా లక్ష్యం దిశగా పయనించలేకపోయింది. ఓపెనర్ జాక్ ఎడ్వర్డ్స్ (73; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ చేయగా, జొనాథన్ మెర్లో (38), బాక్స్‌టర్ హోల్ట్ (39) ఫర్వాలేదనిపించారు. రేపు జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్...పపువా న్యూగినియాతో తలపడుతుంది.

ఇంగ్లండ్ విజయం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ జేసన్ రాయ్ (151 బంతుల్లో 180; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుత సెంచరీతో జట్టును గెలిపించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. ఫించ్ (119 బంతుల్లో 107; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) శతకంతో చెలరేగగా...స్టొయినిస్ (60), మిచెల్ మార్ష్ (50) అండగా నిలిచారు. అనంతరం ఇంగ్లండ్ 48.5 ఓవర్లలో 5 వికెట్లకు 308 పరుగులు చేసింది. జో రూట్ (110 బంతుల్లో 91 నాటౌట్; 5 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 221 పరుగులు జోడించారు.

సెమీఫైనల్లో భారత్

అంధుల క్రికెట్ ప్రపంచకప్

దుబాయ్: అంధుల క్రికెట్ ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 8 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 37.5 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది. భారత బౌలర్లలో ప్రకాశ్ జయరామయ్య 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ రెండే వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసి గెలిచింది. అజయ్ గరియా (29 బంతుల్లో 54; 6 ఫోర్లు) రాణించాడు. 17న జరిగే సెమీఫైనల్లో భారత్... బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

ఆంధ్ర జట్టుకు నిరాశ

సూపర్‌లీగ్ దశకు కర్ణాటక, తమిళనాడు



రికీ


సాక్షి, హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టుకు అదృష్టం కలిసిరాలేదు. సూపర్‌లీగ్ దశకు అర్హత సాధించాలంటే తప్పకుండా గెలవాల్సిన మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ లీగ్ దశలోనే వెనుదిరగాల్సి వచ్చింది. మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 16 పరుగుల తేడాతో తమిళనాడు చేతిలో ఓడిపోయి సూపర్‌లీగ్ రేసు నుంచి తప్పుకుంది. లీగ్ దశ ముగిసేసరికి హైదరాబాద్ (2 గెలుపు, 3 ఓటములు) 8 పాయింట్లతో గ్రూపులో రెండోస్థానంలో నిలిచింది. ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో కర్ణాటక, తమిళనాడు జట్లతో సమానంగా 16 పాయింట్లు సాధించింది.

ఆదివారం వైజాగ్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ- వీడీసీఏ మైదానంలో గోవాతో జరిగిన మ్యాచ్‌లో టాపార్డర్ చెలరేగడంతో ఆంధ్ర 18 పరుగులతో గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఓపెనర్లు అశ్విన్ హెబ్బర్ (37 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), హనుమ విహారి (39 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రికీ భుయ్ (34 బంతుల్లో 65; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. అశ్విన్‌తో కలిసి తొలి వికెట్‌కు 78 పరుగుల్ని జోడించిన విహారి, రికీ భుయ్‌తో కలిసి రెండో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అనంతరం గోవా జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లకు 183 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ స్వప్నిల్ అస్నోడ్కర్ (50 బంతుల్లో 72; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీ చేశాడు. అమోఘ్ దేశాయ్ (30; 4 ఫోర్లు, ఒక సిక్స్), షగుణ్ కామత్ (43; 6 ఫోర్లు, ఒక సిక్స్) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో భార్గవ్ 2, శివకుమార్, హరిశంకర్, గిరినాథ్ రెడ్డి తలా వికెట్ దక్కించుకున్నారు.

ఆమ్లా రనౌటే టర్నింగ్

సునీల్ గావస్కర్

టెస్టు సిరీస్‌లో భారత్‌ను నిలబెట్టాలనే కసి కోహ్లి ఆటలో కనబడింది. గత టెస్టులో తడబడినట్లు కాకుండా అతను ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసం కనబరిచాడు. క్రీజ్‌లోకి రాగానే వచ్చే ఒత్తిడిని దరి చేరనీయకుండా చక్కని షాట్లతో ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టాడు. పిచ్ నుంచి కూడా సహకారం లభిస్తుండటంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను అధిగమించే అవకాశం భారత బ్యాట్స్‌మెన్ చేతిలో ఉంది. ఇప్పటికే తమకు లాభించే పిచ్‌ను తయారు చేయకపోవడంతో ప్రొటీస్ ఆత్మరక్షణలో పడినట్లుంది. చూస్తుంటే భారత్‌కు మేలుచేకూర్చేలా ఈ పిచ్ ఉందనిపిస్తుంది. అశ్విన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తన అమ్ములపొదిలోని అస్త్రాలన్నీ ప్రొటీస్ బ్యాట్స్‌మెన్‌పై ప్రయోగించి ఫలితాలు సాధించాడు. అతనికి ఇషాంత్ శర్మ మంచి తోడ్పాటు అందించాడు. వారి ఇన్నింగ్స్‌ను ఆమ్లా రనౌట్ మలుపుతిప్పింది. హార్దిక్ పాండ్యా మెరుపు వేగంతో స్పందించి నేరుగా వికెట్లను గిరాటు వేశాడు. ఇది భారత్ పట్టుబిగించేందుకు దోహదం చేసిందనే చెప్పాలి. కానీ దక్షిణాఫ్రికాను తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగుల్లోపే ఆలౌట్ చేయలేకపోవడం భారత శిబిరాన్ని కాస్త నిరాశపరిచింది. 335 పరుగులు తక్కువేం కాదు. ఇప్పటికైతే పిచ్ బ్యాటింగ్‌కు కలిసొచ్చేలా ఉంది. దీన్ని అనువుగా మలచుకొని భారత్ ఈ మ్యాచ్‌లో నిలిచేందుకు పోరాడాలి. ఈ నేపథ్యంలో మూడోరోజు భారత్‌కు కీలకం కానుంది.



మ్యాచ్‌లో దృశ్యం

పంజాబ్‌ను గెలిపించిన జితేందర్

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో ఎన్‌సీఆర్ పంజాబ్ రాయల్స్ జట్టు ఆటగాడు జితేందర్ అద్భుత ప్రదర్శనతో జట్టును ఓటమి నుంచి గట్టెక్కించాడు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ రాయల్స్ 4-3తో వీర్ మరాఠాస్ జట్టుపై గెలుపొందింది. ఇరు జట్ల స్కోర్లు 3-3తో సమమైన దశలో 74 కేజీల పురుషుల విభాగంలో బరిలోకి దిగిన జితేందర్ (పంజాబ్) 7-4తో పర్వీన్ రాణాపై నెగ్గి జట్టుకు విజయాన్ని అందించాడు. అంతకుముందు పంజాబ్ తరపున ఇలియాస్ బెక్బులటోవ్ (65 కేజీలు), గెనో పెట్రియాష్విలి (125 కేజీలు), ఉత్కర్ష్ కాలే (57 కేజీలు) గెలుపొందారు. వీర్ మరాఠాస్ జట్టులో మార్వా అమ్రి (57 కేజీలు), వసిలిసా మార్జాలిక్ (76 కేజీలు), రితూ ఫోగట్ (50 కేజీలు) విజయం సాధించారు.

ఓవరాల్ చాంప్స్ సర్వీసెస్, రైల్వేస్

గోవా: జాతీయ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ పురుషుల జట్టు, రైల్వేస్ మహిళల జట్లు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచాయి. ఈ పోటీల్లో తెలంగాణ అమ్మాయిలు జి. మహేశ్వరి రజతం, భాగ్యలక్ష్మి కాంస్య పతకం గెలిచారు. అండర్-18 విభాగంలో నిర్వహించిన 4 కి.మీ. పరుగును 14.37.30 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. అండర్-16 విభాగంలో నిర్వహించిన 2 కి.మీ. పరుగులో భాగ్యలక్ష్మి (6.56.30సె) మూడో స్థానంలో నిలిచింది.